www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★




'ఇందిరమ్మ ఇండ్ల' బిల్లుల చెల్లింపులో స్వల్ప మార్పులు 12
'పంచాయతీ' ప్రతినిధులకు భత్యాలు రెట్టింపు 05
రక్తమార్పిడీ.. ఐదుగురు పిల్లలకు హెచ్ఐవి 05

సంపుటి 08, సంచిక: 325 | సోమవారం | 27-10-2025 | ఖమ్మం Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## హిడ్మా లొంగుబాటుకు

# రంగం సిద్ధం?



**తెలంగాణలో ఆయుధాలు అప్పగించే అవకాశం**

**ఇటీవలే వరంగల్‌లో సరెండరైన హిడ్మా కుమార్తె కేశా**

ప్రజాపక్షం/హైదరాబాద్

మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుడు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి మడావి హిడ్మా అలియాస్ సంతోష్ లొంగిపోతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. తన అనుచరులతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట హిడ్మా ఆయుధాలు అప్పగించే అవకాశాలున్నాయని రాష్ట్ర నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రచారాన్ని ఛత్తీస్‌గఢ్ పోలీసులు తోసిపుచ్చుతున్నప్పటికీ, తెలంగాణ ఇంటెలిజెన్స్ వర్గాలు మాత్రం ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకోవడం లేదు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) ప్లాటూన్1 కమాండర్‌గా, కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న హిడ్మా.. గెరిల్లా దాడుల వ్యూహరచనలో అత్యంత నిపుణుడిగా పేరుగాంచాడు. గతంలో భద్రతా బలగాలపై జరిగిన అనేక భారీ దాడులకు హిడ్మానే నాయకత్వం వహించాడని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన హిడ్మా, వందలాది మంది గిరిజన యువతను మావోయిస్టు పార్టీలో చేర్పించి, వారికి సాయుధ శిక్షణ ఇచ్చి పటిష్టమైన సైన్యాన్ని నిర్మించాడు. మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న అతడు పలుమార్లు పోలీసులకు చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నాడు. ఇటీవల కాలంలో సోనూ, తరువాయి 2లో

**ఛత్తీస్‌గఢ్‌లో 27 మంది మావోయిస్టుల లొంగుబాటు** 05

## మోంతా తుపాను ప్రభావం

# అత్యంత భారీ వర్షాలు



**పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలెర్ట్ జారీ**

**ఉరుములు, మెరుపులతో వర్షాలు**

**గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలు వీచే అవకాశం**

ప్రజాపక్షం/హైదరాబాద్

మోంతా తుపాను ప్రభావంతో రానున్న ఐదురోజుల పాటు రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు రాష్ట్ర ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో పలు జిల్లాలకు ఆరెంజ్, రెడ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, తరువాయి 2లో

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 4.15 కిలోల డ్రగ్స్ పట్టివేత

**హైదరాబాద్ :** శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుడి నుండి మొత్తం 4.15 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డిఆర్ఐ ఆదివారం తెలిపింది. నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా, హైదరాబాద్ జోనల్ యూనిట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు 25న బ్యాంకాక్ నుండి వస్తున్న భారతీయ ప్రయాణికుడిని అడ్డుకున్నారు. ఆమె సామాగ్రిని తనిఖీ చేయగా ఆకుపచ్చ రంగు ముద్ద ఉన్న పదార్థాన్ని కలిగి ఉన్న ప్యాకెట్లు బయటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకున్నారు. హైడ్రోపోనిక్ గంజాయిని లగేజీ అడుగు భాగంలో దాచిపెట్టినట్లు అధికారులు తెలిపారు. ఎన్‌డిపిఎస్ చట్టం, 1985 నిబంధనల కింద ప్రయాణికుడిని అరెస్టు చేశారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.



02

**వామపక్ష పార్టీల మద్దతుతో ఐర్లాండ్ అధ్యక్షురాలిగా కానోలీ ఘన విజయం**



## మృతదేహాలు బంధువులకు

# అప్పగింత

**కర్నూలు :** కర్నూలు బస్సు ప్రమాదంలో మరణించిన వారిలో 18 మంది మృతదేహాలను డీఎన్‌ఏ రిపోర్టు ఆధారంగా కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించారు. మరణ ధ్రువీకరణ పత్రాలను కూడా వారికి అందజేశారు. ఈ ప్రక్రియను కర్నూలు జిల్లా కలెక్టర్ ఎ.సిరి పర్యవేక్షించారు. మృతదేహాలను స్వస్థలాలకు చేర్చేందుకు అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. కర్నూలు బస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. 18 మృతదేహాలను తమ కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో మరో గుర్తు తెలియని మృతదేహానికి సంబంధించి చిత్తూరు నుంచి ఒకరు వచ్చారని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ చెప్పారు. తమ తండ్రి కనిపించడం లేదని ఆ వ్యక్తి చెప్పినట్లు తెలిపారు. డీఎన్‌ఏ నివేదిక ఆధారంగా ఆ మృతదేహం ఎవరిదనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని అన్నారు. ప్రమాద తరువాయి 2లో



కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో శివశంకర్ నుంచి సేకరించిన నమూనాల్లో మద్యం ఆనవాళ్లు


బైకర్‌పై అతని స్నేహితుడు ఎర్రిస్వామి ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

## డాక్టర్ ఆత్మహత్య

# 'సంస్థాగత హత్యే'

**బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ 'అమానవీయ, సున్నితత్వం లేని' స్వభావాన్ని బయటపెడుతుంది : రాహుల్‌గాంధీ**





**న్యూఢిల్లీ :** మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ప్రభుత్వ వైద్యురాలు ఆత్మహత్య చేసుకోవడంపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ స్పందించారు. 'సంస్థాగత హత్య'గా అభివర్ణించారు. డాక్టర్ ఆత్మహత్య బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ 'అమానవీయ, సున్నితత్వం లేని' స్వభావాన్ని బయటపెడుతుందన్నారు. మధ్య మహారాష్ట్రలోని మరాఠ్వాడ ప్రాంతం బీడ్ జిల్లాకు చెందిన వైద్యురాలు, సతారా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. కాగా, గురువారం రాత్రి ఫల్తాన్ పట్టణంలోని ఒక హోటల్ గదిలో ఉరివేసుకుని కనిపించింది. ఆమె తన అరచేతిలో రాసిన సూసైడ్ నోట్‌లో, పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ గోపాల్ బదానే తనపై అనేకసార్లు అత్యాచారం చేశాడని, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రశాంత్ బంకర్ తనను మానసికంగా వేధించాడని ఆమె ఆరోపించింది. ఈ నేపథ్యంలో రాహుల్ స్పందిస్తూ అత్యాచారం, వేధింపులను ఎదుర్కొన్న తర్వాత సతారాలో డాక్టర్ ఆత్మహత్య చేసుకోవడం ఏ నాగరిక సమాజానికైనా మనస్సాక్షిని కదిలించే విషాదం అని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇతరుల బాధలను తగ్గించాలని ఆకాంక్షించిన ఒక ఆశాజనక వైద్యురాలు, అవినీతి వ్యవస్థలోని నేరస్థుల హింసకు బలైపోయారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఆవేదన వ్యక్తం చేశారు. 'నేరస్థుల నుండి ప్రజలను రక్షించే బాధ్యత అప్పగించబడిన వారు ఈ అమాయక మహిళపై అత్యాచారం, దోపిడీ చేసి అత్యంత దారుణమైన నేరానికి తరువాయి 12లో

## 8 వేల స్కూళ్లలో

# సున్నా నమోదు

- విద్యార్థులు లేకున్నా పనిచేస్తున్న 20 వేలకుపైగా టీచర్లు
- తొలిస్థానంలో పశ్చిమబెంగాల్, రెండవ స్థానంలో తెలంగాణ



**న్యూఢిల్లీ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పడిపోతుండడంతో తల్లిదండ్రులు తమ పిల్లను ప్రైవేటు స్కూళ్లలో చేర్చుతున్నారు. దీంతో సర్కార్ బడుల్లో చేరే వారి సంఖ్య అంతకంతకూ పడిపోయింది. కొన్ని స్కూళ్లలో సున్నా శాతంగా నమోదైంది. 2024–25 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా దాదాపు 8,000 పాఠశాలల్లో సున్నా నమోదులు జరిగాయి. పశ్చిమ బెంగాల్ ఇటువంటి పాఠశాలల్లో అత్యధికంగా ఉండగా, ఆ తర్వాత స్థానంలో తెలంగాణ ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాల ద్వారా వెల్లడయింది. ఇక్కడ చెప్పుకోదగ్గ విషయమేమంటే... సున్నా నమోదులు ఉన్న పాఠశాలల్లో మొత్తం 20,817 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో విద్యార్థుల నమోదులు లేని పాఠశాలలు అత్యధికంగా 3,812 ఉండగా, అందులో 17,965 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యా మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 7,993 పాఠశాలల్లో సున్నా నమోదులు ఉన్నాయి. గత సంవత్సరం 12,954 మందితో పోలిస్తే 5,000 తగ్గాయి. అయితే హర్యానా, మహారాష్ట్ర, గోవా, అసోం, హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, నాగాలాండ్ సిక్కిం, త్రిపురలలో ఇలాంటి పాఠశాలలు ఏవీ లేవు. పాఠశాల విద్య రాష్ట్రానికి సంబంధించిన అంశమి, పాఠశాలల్లో సున్నా నమోదు సమస్యను పరిష్కరించాలని తరువాయి 2లో



హైదరాబాద్ హిమాయతనగర్‌లోని మగ్దూంభవన్‌లో ఆదివారం జరిగిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి




# 21వ శతాబ్దం మనదే

- భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్య
- ఏషియాన్ శిఖరాగ్ర సదస్సులో దృశ్యమాధ్యమంగా ప్రసంగం

**న్యూఢిల్లీ :** ఆసియాన్ శిఖరాగ్ర సదస్సులో వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధానమంత్రి మోదీ 21వ శతాబ్దం భారత దేశం, ఏషియాన్ దేశాలదేనని వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది (2026) ఫిలిప్పీన్స్‌లో జరిగే ఏషియాన్‌ను 'ఆసియాన్–భారత్ సముద్ర సహకార సంవత్సరం'గా ప్రకటించారు. హిందూ మహాసముద్రం పరిధిలో ద్వైపాక్షిక సహకారం కొత్త దశకు చేరినట్లు ఈ నినాదం సూచిస్తుందని ఆయన చెప్పారు. తూర్పు ఆసియాతో భాగస్వామ్య తరువాయి 12లో

# రైతుకు దక్కని మద్దతు ధర

- దళారులకు విక్రయించి మోసపోతున్న అన్నదాతలు
- సిసిఐ, మార్క్ ఫెడ్ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర నష్టం
- పత్తి, మొక్క జొన్న రైతులపై నిర్లక్ష్యం

ప్రజాపక్షం/హనుమకొండ

ఆరుగాలం కష్టపడి పంటను మార్కెట్‌కు తరలించిన రైతుకు మద్దతు ధర దక్కడం లేదు. ప్రభుత్వ సంస్థలు మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడంతో దళారులకు విక్రయించి మోసపోతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పండించిన పత్తి, మొక్క జొన్నకు ధర రాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా అధికారులకు పట్టింపులేకుండా పోయింది.నేటికీ ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు జరుగలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాల నుంచి రైతులు పంటను కాపాడుకొని మార్కెట్ కు తీసుకువస్తే మద్దతు ధరకు కొనేవారు లేరు. సీసీఐ,



మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో మార్కెట్ లో మద్దతు ధర రావడంలేదు. వ్యాపారులు సిండికేట్ గా మారి తక్కువ ధరకే కొనుగోలు చేయడంతో ఆర్థికంగా రైతులు నష్టపోతున్నారు. ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పూర్తిస్థాయిలో వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలపై దృష్టి పెట్టకపోవడంతో వ్యాపారులు మద్దతు ధరకు కొనడం లేదు. రైతులతో పాటు రైతు సంఘాల నేతలు మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఐదున్నర లక్షల ఎకరాల్లో పత్తిసాగు..**

ఉమ్మడి జిల్లాలో ఈ యేడాది పత్తి సాగు బాగా పెరిగింది. ఐదున్నర తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## రష్యా అణు సమర్థ క్రూయిజ్ మిసైల్ 'బరెవెస్ట్నిక్' పరీక్ష విజయవంతం

**మాస్కో:** అణునిర్వాహక శక్తితో నడిచే 'బరెవెస్ట్నిక్' క్లాస్ క్రూయిజ్ మిసైల్‌తో చేసిన పరీక్ష విజయవంతమైంది. ఈ విషయాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదివారం ప్రకటించారు. అణుధారిత శక్తితో నడిచే ఈ క్రూయిజ్ మిసైల్ లక్ష్యానికి ఎలాంటి పరిమితులు లేవని అన్నారు. దేశ సేవ కోసం ఈ క్షిపణులను సేనలోకి ప్రవేశపెట్టడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయను ఆర్మీ అధికులను ఆదేశించారు.ఇటీవల నిర్వహించిన అణుపరిచయ విన్యాసాల్లో 'బరెవెస్ట్నిక్'15 గంటల పాటు గాలిలో ప్రయాణించి 14,000 కిలోమీటర్ల లక్ష్యాన్ని కూడా ఛేదించింది. రష్యా సైనిక హోదాలో అత్యున్నత అధికారిగా కూడా వ్యవహరిస్తున్న పుతిన్, యుద్ధ మైత్రి కేంద్రాన్ని దర్శించి, ప్రధాన సైనికాధికారులతో సమావేశమయ్యారు. వారి నేతృత్వంలో పనిచేస్తున్న జనరల్ స్టాఫ్ చీఫ్ వలెరి గెరాసిమోవ్ ఉక్రేన్ యుద్ధానికి సంబంధించిన వివరాలు తెలిపారు. సుమారు 10,000 మంది ఉక్రేన్ సైనికులను రెండు ప్రాంతాల్లో ముట్టడించినట్టు చెప్పారు.

## వామపక్ష పార్టీల మద్దతుతో ఐర్లాండ్ అధ్యక్షురాలిగా కానోలీ ఘన విజయం

**డబ్లిన్:** ఐర్లాండ్‌లో వామపక్ష పార్టీల మద్దతు పొందిన స్వతంత్ర అభ్యర్థి క్యాథరీన్ కానోలీ అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయాన్ని సాధించారు. ఆమె మధ్య రైట్‌వింగ్ ప్రత్యర్థి హీతర్ హంఫ్రీస్‌పై భారీ ఆధిక్యంతో గెలిచారు. అధికారిక ఫలితాలు కానోలీకి విస్తృతమైన ఓటర్ల మద్దతు లభించినట్లు వెల్లడించాయి. ఫైన్ గేల్ పార్టీకి చెందిన హీతర్ హంఫ్రీస్ ఓట్ల లెక్కింపు ముగియకముందే తాను ఓడిపోయినట్లు అంగీకరించారు. 'క్యాథరీన్ మన అందరి అధ్యక్షురాలు అవుతారు. ఆమె నా అధ్యక్షురాలు కూడా. ఆమెకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు' అని హంఫ్రీస్ పాత్రికేయులకు తెలిపారు.



ఐర్లాండ్ అధ్యక్షురాలిగా ఎన్నికైన కానోలీ ఒకప్పుడు బారిస్టర్‌గా పనిచేశారు. 2016 నుంచి పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్న ఆమె గాజాలో యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. రష్యా–ఉక్రేపై యుద్ధ నేపథ్యంలో, యూరోపియన్ యూనియన్‌లో పెరుగుతున్న సైనికీకరణపై ఆమె హెచ్చరించారు. కానోలీ, 2011 నుంచి అధ్యక్షుడిగా ఉన్న మైఖేల్ డి హిగిన్స్ స్థానాన్ని భర్తీ చేయనున్నారు. ఆయన రెండు ఏడు సంవత్సరాల పదవీకాలాలు పూర్తి చేశారు. కానోలీ ఐర్లాండ్ పదో అధ్యక్షురాలిగా, ఆ పదవిని చేపట్టిన మూడవ మహిళగా నిలిచారు. సిన్ ఫెయిన్, లేబర్ పార్టీ, సోషల్ డెమోక్రాట్స్ వంటి వామపంథా పార్టీల మద్దతు ఆమెకు లభించింది. ప్రధానమంత్రి మిహోల్ మార్టిన్ కానోలీకి అభినందనలు తెలిపారు. 'ఇది చాలా సమగ్ర విజయం. ఆమె ఐర్లాండ్ తదుపరి అధ్యక్షురాలు' అని అన్నారు. అదే సమయంలో ప్రపంచ వేదికపై ఐర్లాండ్ ప్రాముఖ్యతను కొనసాగించేందుకు, 2026 రెండో భాగంలో యూరోపియన్ యూనియన్ అధ్యక్ష పదవిని చేపట్టడానికి సిద్ధమవుతున్న ఈ సమయంలో, కొత్త అధ్యక్షురాలితో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నానని చెప్పారు. ప్రాథమిక ఫలితాల ప్రకారం, కానోలీ 60 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించారు. మార్టిన్ నేతృత్వంలోని ఫియానా ఫైల్ పార్టీ అభ్యర్థి జిమ్ గావిన్ మూడు వారాల క్రితం పాత ఆర్థిక వివాదం కారణంగా పోటీ నుంచి తప్పుకున్నారు. దాంతో కానోలీ, హంఫ్రీస్ ఇద్దరే తుది రేసులో మిగిలారు. గావిన్ పేరు మాత్రం చివరి నిమిషంలో ఉపసంహరణ జరగడంతో బ్యాలెట్ పత్రంలో ఉండిపోయింది. ఎన్నికల సంఘం తెలిపిన ప్రకారం, ఈసారి సాధారణం కంటే అసాధారణంగా ఎక్కువ సంఖ్యలో చెల్లని బ్యాలెట్ పత్రాలు నమోదయ్యాయి. ఇది ఓటర్ల అసంతృప్తి, నిరుత్సాహం ప్రతిఫలమని, దీని మీద లోతైన ఆలోచన అవసరం ఉందని ఎన్నికల సంఘం వ్యాఖ్యానించింది. ఉపప్రధాని సైమన్ హారిస్ కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. ఐర్లాండ్ ప్రజల్లో ఒక పెద్ద వర్గం రాజకీయాల పట్ల విసుగుతో ఉన్నారని వ్యాఖ్యానించారు. భవిష్యత్ అధ్యక్ష ఎన్నికల్లో నామినేషన్‌కి కావాల్సిన అర్హతల పరిమితిని మార్చే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు.

## 'ఏషియాన్' కూటమిలోకి తైమూర్–లెసె

**కౌలాలంపూర్ (మలేసియా):** అగ్నేయాసియా దేశాల సంఘం (ఏషియాన్) కూటమిలో తైమూర్–లెసెకు సభ్యత్వం లభించింది. 1990 దశకాల తర్వాత ఏషియాన్‌లో కొత్త దేశానికి సభ్యత్వం ఇవ్వడం ఇదే మొదటిసారి. ఏషియాన్‌లో చేరికతో సుమారు పమది సంవత్సరాల తమ చిరకాల కల నెరవేరిందని తైమూర్–లెసె ప్రధాన మంత్రి రలా సామానా గుస్మావ్ వ్యాఖ్యానించారు. కాగా, ఈ సమావేశాల సందర్భంగానే కంబోడియా, థాయిలాండ్ దేశాలు సరిహద్దుల వద్ద కాల్పుల విరమణ ఒప్పందంపై సంతకం చేశాయి. తర్వాదా దీర్ఘకాలిక శాంతికి మార్గం సులభమవుతుందని ఏషియాన్ అభిప్రాయపడింది. తైమూర్–లెసెకు సభ్యత్వ ప్రకటనతో, రెండు రోజుల ఏషియాన్ సదస్సు ఆదివారం ప్రారంభమైంది. తదుపరి వివిధ దేశాల ఉన్నత స్థాయి సమావేశాలు జరుగుతాయి. ప్రధానంగా చైనా, జపాన్, ఇండియా, ఆస్ట్రేలియా, రష్యా, దక్షిణ కొరియా, అమెరికా దేశాలు వివిధ అంశాలపై చర్చిస్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వంటి ప్రముఖులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. థాయిలాండ్, కంబోడియా మధ్య శాంతి స్థాపనకు తానే కృషి చేసినట్టు ట్రంప్ మరోసారి ప్రకటించుకున్నారు. అంతేగాక, ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది యుద్ధాలను నిలిపివేయగలిగానని అన్నారు. ఇలావుంటే, కొత్తగా సభ్యత్వం పొందిన తైమూర్–లెసె జనాభా 14 లక్షలు, జిడిపి సుమారు 2 బిలియన్ల డాలర్లు మాత్రమే. ఏషియన్ కూటమిలోకి రావడం వల్ల 680 మిలియన్ జనాభా, 3.8 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక సంఘంతో ఆ దేశానికి అనుబంధం ఏర్పడుతుంది. సదస్సుకు అధ్యక్షత వహిస్తున్న మలేసిఆ ప్రధాని అన్వర్ ఇబ్రహీం తన ప్రారంభోపన్యాసంలో తైమూర్–లెసెకు సభ్యత్వం లభించిన విషయాన్ని ప్రకటిస్తూ, కొత్త దేశాన్ని సాదరంగా ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. చిన్న దేశాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెప్పడానికి ఇదో ఉదాహరణ అని పేర్కొన్నారు.



## చర్చలు విఫలమైతే యుద్ధం తప్పదు

### అఫ్గానిస్థాన్‌కు పాకిస్థాన్ స్పష్టీకరణ

**ఇస్లామాబాద్:** ఉగ్రవాద చలనలను అడ్డుకోవడానికి పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాలు ఐస్తాంబుల్‌లో రెండవ విడత చర్చలు నిర్వహించాయి. ఉభయ సరిహద్దుల్లో ఉగ్రవాద కార్యకలాపాలను నిరోధించేందుకు సంయుక్త పర్యవేక్షణ విధానాన్ని రూపొందించడంపై చర్చలు జరిగాయి. అయితే, ఈ చర్చల్లో పాకిస్థాన్ తన ప్రధానమైన డిమాండ్‌ను మరోసారి వెల్లడించింది. తాహిర్ అంద్రాబీ, తహ్రీక్ ఇతాలిబాన్ పాకిస్థాన (టిటిపి), బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్‌ఎ)పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. పాకిస్తాన్ సరిహద్దుల్లో టిటిపి వంటి సంస్థల ఉగ్రవాదులు హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారన్నది పాకిస్తాన్ ఆరోపణ. ఈ సమస్యకు పరిష్కారం లభించకపోతే, యుద్ధం కొనసాగించక తప్పదని స్పష్టం చేసింది. ఈ నెల మొదట్లో పాక్, అఫ్గాన్ మధ్య జరిగిన దాడుల్లో భారీగా సైనికులు, పౌరులు, ఉగ్రవాదులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. దీనితో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడింది. అయితే అక్టోబరు 19న కతార్, టర్కీ మద్దతుతో దోహాలో చర్చలు జరిగిన తరువాత తాత్కాలికంగా శాంతి ఏర్పడింది. రేడియో పాకిస్థాన్ సమాచారం ప్రకారం, ఉభయ దేశాల ప్రతినిధులు సరిహద్దు ఉగ్రచర్యలను నిరోధించేందుకు సంయుక్త పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసే అంశంపై చర్చించారు. అలాగే, వాణిజ్యపరమైన అడ్డంకులు తొలగించడంపైనా దృష్టి పెట్టారు. రెండు దేశాల మధ్య దీర్ఘకాలిక రాజకీయ అవగాహన సాధించే అంశాన్ని కూడా సూచించారు. ఈ చర్చల్లో ప్రస్తావించిన అంశాల్లో పురోగతి లేకపోతే, యుద్ధం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని పాకిస్తాన్ అంటున్నది. పాక్ వ్యాఖ్యలపై తాలిబన్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలుడలేదు.

## కెనడాపై ట్రంప్ ఆగ్రహం

### 10 శాతం అదనపు సుంకాలు తప్పవని హెచ్చరిక

**అబ్రాడ్ ఎయిర్ ఫోర్స్ వన్ (అమెరికా):** కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా సుంకాలను ప్రస్తావిస్తూ ఒంటారియో ప్రావిన్స్ ప్రసారం చేసిన ఒక ప్రకటనపై ట్రంప్ సీరియస్‌గా స్పందిస్తూ, ఉద్దేశపూర్వకంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నందుకు 10 శాతం అదనపు సుంకాలు తప్పవని హెచ్చరించారు. కెనడాతో వాణిజ్య చర్చలను నిలిపివేస్తానని తెలిపారు. ఒంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ వీకెండ్ తర్వాత ఆ ప్రకటనను ఉపసంహరించుకుంటామని చెప్పినప్పటికీ, శుక్రవారం రాత్రి వరల్డ్ సిరీస్ తొలి మ్యాచ్ సమయంలో తిరిగి ప్రసారం చేయడంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ ప్రకటన మోసపూరితమైనదని తెలిసినప్పటికీ, ప్రసారం చేయడంలో ఆంతర్యం ఏమిటని ట్రంప్ ఎయిర్ ఫోర్స్ వన్‌లో మలేషియాకు బయలుదేరుతూ తన 'ట్రూత్ సోషల్' వేదికలో ట్రంప్ ప్రశ్నించారు. వాస్తవాలను వక్రీకరించడమేగాక, శత్రుత్వపూర్వకంగా వ్యవహరించినందుకు, కెనడాపై ఇప్పటికే ఉన్న సుంకానికి అదనంగా మరో పది శాతం పెంచుతున్నట్టు స్పష్టం చేశారు. అయితే, ఈ నిర్ణయం ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది? ఏఏ వస్తువులకు వర్తిస్తుంది? అనే వివరాలు ఇవ్వలేదు.



కెనడా ఎగుమతుల్లో మూడు వంతులకుపైగా అమెరికాకు వెళ్తాయి. రోజూ సుమారు 3.6 బిలియన్ కెనడియన్ డాలర్ల (2.7 బిలియన్ అమెరికన్ డాలర్ల) విలువైన వస్తుసేవల లావాదేవీలు జరుగుతున్నాయి. ఇప్పటికే కెనడా నుంచి దిగుమతి అవుతున్న పలురకాల ఉత్పత్తులపై 35 శాతం సుంకం విధించారు. ఉక్కు, అల్యూమినియంపై ఇది 50 శాతంగా ఉంది. ఇంధనం వంటి అమెరికా–కెనడా–మెక్సికో ఒప్పందం (యుఎస్‌ఎంసిఎ) కింద ఉండే కొన్ని వస్తువులు మాత్రం మినహాయింపు పొందాయి. వీటిపై కేవలం 10 శాతం సుంకంతో సరిపుచ్చారు. ఇలావుంటే, యుఎస్‌ఎంసిఎ ఒప్పందాన్ని ట్రంప్ త్వరలో పునఃపరిశీలించనున్నట్లు సమాచారం. ట్రంప్ తన తొలి పదవీకాలంలో ఆ ఒప్పందాన్ని కుదుర్చుకున్నప్పటికీ, ఇటీవల దానిపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్, కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ ఇద్దరూ మలేషియాలో జరగనున్న ఆగ్నేయాసియా దేశాల సంఘం (ఎఎస్ఇఎఎన్) శిఖరాగ్ర సమావేశానికి హాజరవుతున్నారు. అయితే, అక్కడ కార్నీతో భేటీ అయ్యే ఉద్దేశం లేదని తనతో ప్రయాణిస్తున్న మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ట్రంప్ తెలిపారు. అమెరికా మాజీ అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ మాటలను ఒంటారియో ప్రావీన్స్ తప్పుగా చూపుతున్నదని, రిపబ్లికన్ పార్టీకి ప్రియమైన నాయకుడైన రీగన్ స్థానాన్ని వక్రీకరించిందని ట్రంప్ ఆరోపించారు. కానీ 1987లో రీగన్ ఇచ్చిన ప్రసంగంలో సుంకాలపైన అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ, వాటికి వ్యతిరేకంగా తన వాదనను వివరించారు. అదే ప్రసంగంలోని భాగాలను ఒంటారియో ప్రకటనలో ఉపయోగించారు. కాగా, ఈ ప్రకటన అమెరికా సుప్రీంకోర్టు నిర్ణయాలను ప్రభావితం చేయాలనే ఉద్దేశంతో రూపొందించారని ట్రంప్ ఆరోపించారు. వచ్చే నెల సుప్రీంకోర్టులో జరగబోయే వాదనల్లో ట్రంప్ సుంకాల విధింపుపై తన అధికారాలను కొనసాగించగలరా? లేదా? అనే అంశంపై తీర్పు వెలువడనుంది. ఆ సుంక విధానం ట్రంప్ ఆర్థిక వ్యూహం లో కీలక భాగం. అందుకే, రాబోయే తీర్పుపై అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## దేశ రక్షణ ఎంత ముఖ్యమో.. రైతు రక్షణ అంతే ముఖ్యం

ముచ్చింతల్‌లో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు




**ప్రజాపక్షం/రంగారెడ్డి :** దేశ రక్షణ ఎంత ముఖ్యమో.. రైతు రక్షణ కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని వ్యవసాయం, అనుబంధరంగాలలో రాణిస్తున్న వారికి రైతు నేస్తం పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 58 శాతం మంది వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలపైన ఆధారపడి ఉన్నారని చెప్పారు. రైతులకు చేదోడుగా, తన వంతు కర్తవ్యం. రెండు దశాబ్దాలకు పైగా 'రైతు నేస్తం' మాసపత్రిక ద్వారా సేవలందిస్తున్న యడ్లపల్లి వెంకటేశ్వరరావును మాజీ ఉపరాష్ట్రపతిఎం.వెంకయ్య నాయుడు అభినందించారు. జీవితంలో ఇతరుల కోసం పనిచేసే వారే అన్నదాతలన్నారు.దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలను ఎప్పుడూ మర్చిపోకూడదని తెలిపారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా సరైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి అవసరం ఉందన్నారు. రైతును కాపాడుకున్నప్పుడే వ్యవసాయం నిలబడుతుంది.రైతు శ్రమకు సరైన న్యాయం జరిగే విధంగా మన వ్యవస్థలో మార్పులు తేవాల్సిన అవసరముందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయడు స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తదితరులు రైతులను ఉద్దేశించి ప్రసంగించారు.



## అత్యంత భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామని అధికారులు తెలిపారు. మంగళశారం జయశంకర్ భూపాలపల్లి, కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో అతిభారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. ఉరుములు, మెరుపులు, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశామని అధికారులు చెప్పారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురుస్తాయని, దీంతో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నల్లగొండ, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

### ఏపిలో అధికార యంత్రాంగం అప్రమత్తం

మొంతా తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలతోపాటు ఉన్నతాధికారులందరూ అన్ని శాఖల సమన్వయంతో పనిచేసేలా సన్నద్ధం చేశామని చెప్పారు. జిల్లాలకు అవసరమైన నిధులు అందుబాటులో ఉంచి.. ప్రత్యేక అధికారులను నియమించామని వివరించారు. విద్యుత్, తాగునీరు, రవాణా సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అలాగే వర్షం తీవ్రత, తుపాను ప్రభావానికి సంబంధించిన సమాచారాన్ని నేరుగా ప్రజలకు పంపడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. అధికార యంత్రాంగానికి, ప్రభుత్వానికి సహకరించాలని ఈ సందర్భంగా ప్రజలకు సిఎం చంద్రబాబు సూచించారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి.. అక్కడ అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించామన్నారు.
ఈ మేరకు ఎక్స్ ఖాతా వేదికగా సీఎం చంద్రబాబు మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం మరింత బలపడి మోంతా తుపాన్‌గా మారే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ తుఫాన్ కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. ఈ తుపాను ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని.. అలాగే బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది. తుపాన్ కారణంగా సహాయక చర్యలు చేపట్టేందుకు జిల్లాలకు ప్రత్యేక అధికారులను ఇప్పటికే ప్రభుత్వం నియమించింది. 30వ తేదీ వరకు ప్రభుత్వ ఉద్యోగులు సెలవులను రద్దు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశారు. తుపాన్ కారణంగా ఎవరికి ఎటువంటి సమస్య ఎదురైనా.. సహాయం కోసం కంట్రోల్ రూమ్‌లను సంప్రదించాలని ప్రజలకు ప్రభుత్వం సూచించింది. మూడు రోజుల వరకు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని తీర ప్రాంత ప్రజలను ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు.

## రంగం సిద్ధం? (మొదటి పేజీ తరువాయి)

ఆశన్న వంటి కీలక నేతలతో పాటు వందల మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే హిడ్మా కుమార్తె వంజెం కేశా అలియాస్ జిన్నీ సైతం వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. 'ఆపరేషన్ కగార్' తీవ్రం కావడంతో ఆమె పార్టీ నుంచి బయటకు వచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు హిడ్మా సైతం లొంగిపోవడానికి సిద్ధమవుతున్నారని, వరంగల్‌లో లొంగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిఘా వర్గాలు భావిస్తున్నాయి.

## అప్పగింత (మొదటి పేజీ తరువాయి)

సమయంలో బస్సు డ్రైవర్ మద్యం తాగలేదని నివేదికలో తేలినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ చెప్పారు.

**శివశంకర్ శరీరంలో మద్యం ఆనవాళ్లు :** కర్నూలు బస్సు ప్రమాదానికి సంబంధించిన విశ్లేషణ నివేదికను కర్నూలు రీజనల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఆర్ఎఫ్ఎస్ఎల్) సమర్పించింది. దీని ప్రకారం మృతుడు శివశంకర్ నుంచి సేకరించిన నమూనాల్లో మద్యం ఆనవాళ్లు ఉన్నట్లు వారు నిర్ధారించారు. ప్రమాదం జరిగిన సమయంలో శివశంకర్ మద్యం తాగి వాహనం నడిపినట్లు పేర్కొన్నారు. కాగా, మరణించిన శివశంకర్‌పై అతని స్నేహితుడు ఎర్రిస్వామి ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు పలు సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేశారు. శివశంకర్ నిర్లక్ష్యం వల్లే బైక్ డివైడర్‌ను ఢీ కొట్టినట్లు ఫిర్యాదులో ఎర్రిస్వామి పేర్కొన్నట్లు తెలిసింది. బైక్ డివైడర్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరం పడిపోయామని, శివశంకర్ ఘటనాస్థలిలోనే మృతి చెందినట్లు ఎర్రిస్వామి చెప్పారు. మృతదేహాన్ని పక్కకు తీసేందుకు యత్నించే లోపే తమ బైక్‌ను ఓ వాహనం ఢీ కొట్టగా రోడ్డు మధ్యలోకి వచ్చినట్లు పేర్కొన్నాడు. అనంతరం వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్‌ను రోడ్డు మీద 200 మీటర్ల వరకు లాక్కెళ్లింది. దీంతో బస్సులో మంటలు చెలరేగి ప్రమాదం జరిగిందని వివరించాడు.

## రైతుకు దక్కని మద్దతు ధర

(మొదటి పేజీ తరువాయి)

లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు చేశారు. ఐదు లక్షల మెట్రిక్ టన్నుల వరకు పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని వ్యవసాయ మార్కెట్లకు గడిచిన నెలరోజులుగా పత్తి వస్తోంది. ఎన్నో తిప్పలు పడి మొదటి విడత పత్తి ఏరిన రైతులు అకాల వర్షాలతో ఇంట్లో నిల్వచేయలేక అమ్మకానికి తీసుకువస్తున్నారు. మార్కెట్ కు వస్తున్న పత్తికి ధర మాత్రం రావడం లేదు. వరంగల్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, నెక్కొండ, జనగామ మార్కెట్లతో పాటు ఇతర మార్కెట్లకు పత్తిని తీసుకువస్తున్నారు.వీటితో పాటు జిన్నింగ్ మిల్లులకు కూడా తీసుకువెళ్లి నేరుగా అమ్మకాలు చేస్తున్నారు. పత్తి మద్దతు ధర క్వింటాలుకు రూ.8110 ఉంది. మార్కెట్ తో పాటు జిన్నింగ్ మిల్లులకు తీసుకువస్తున్న పత్తికి మాత్రం కనీస మద్దతు ధర రావడం లేదు. క్వింటాలుకు రూ.5వేల నుంచి రూ.7వేల మధ్యనే కొనుగోలు చేస్తున్నారు. రైతులు ఎన్నో కష్టనష్టాల కోర్చి పంట పండిస్తే భారీ వర్షాలతో దిగుబడి రాలేదు. పండించిన పంటను మార్కెట్ కు తీసుకువస్తే ధర రాక రైతులు సమస్యలను ఎదుర్కొంటున్నారు. క్వింటాలుకు రూ.2వేల వరకు నష్టపోతున్నారు. వర్షాలకు ఈ సంవత్సరం వేల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతింది. ప్రస్తుతం ఉన్న పత్తి ధర మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### మార్కెట్‌కు తరలి వస్తున్న పత్తి..

మార్కెట్లకు పత్తి భారీగా వస్తున్నా సీసీఐ మాత్రం ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ సీజన్ లో 25 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇప్పటి వరకు మాత్రం ఇంకా ప్రారంభం చేయలేదు. కపాస్ కిసాన్ యాప్ లో నమోదు చేసుకున్న రైతుల పత్తినే సీసీఐ కొనుగోలు చేస్తుందని అధికారులు నెలరోజులుగా ప్రకటిస్తున్నా కొనుగోలు చేపట్టకపోవడంతో రైతులు మద్దతు ధర రాక నష్టపోతున్నారు. వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. పత్తి కొనుగోలు కోసం త్వరగా సీసీఐ కేంద్రాలను ప్రారంభించాలని రైతులతో పాటు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

### మొక్కజొన్న రైతులకు తప్పని తిప్పలు..

ఉమ్మడి జిల్లాలో పత్తితో పాటు మొక్కజొన్న కొనుగోలు కు మార్క్ ఫెడ్ కేంద్రాలను ఇంకా ప్రారంభించలేదు. మొక్కజొన్న 3లక్షల ఎకరాల వరకు సాగు చేశారు. రైతులు అమ్మకానికి మొక్కజొన్నలు మార్కెట్ కు తీసుకువస్తున్నా ధర రావడం లేదు. ఉమ్మడి జిల్లా పరిధిలో రోడ్లపై వర్షాలకు ఆరబోసిన మక్కలు అకాల తడిసిపోతున్నాయి. దీంతో రైతులు తక్కువ ధరకే అమ్మకాలు చేస్తున్నారు. మొక్కజొన్న మద్దతు ధర క్వింటాలుకు రూ.2400 ఉంది. ఆ ధరకు మించి కొనుగోలు చేయాల్సి ఉన్నా వ్యాపారులు మాత్రం పట్టించుకోవడం లేదు. క్వింటాలు రూ.1700ల నుంచి రూ.2100 మధ్యనే కొనుగోలు చేస్తున్నారు.ఉమ్మడి జిల్లా పరిధిలో మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాలకు అనుమతులు ఇచ్చారు. మొక్కజొన్న కొనుగోలుకు 20 కేంద్రాలు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రైతులు మాత్రం అకాల వర్షాలతో మొక్కజొన్న తడుస్తుండటంతో నిల్వ ఉంచే పరిస్థితి లేక వచ్చిన ధరకే అమ్మకాలు చేస్తున్నారు. వ్యాపారులు సిండికేట్ కావడంతో కూడా ధర రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో పత్తి, మొక్కజొన్న వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్లకు వస్తున్న వేళ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పట్టించుకుని ధర వచ్చే విధంగా చూడాలని రైతులతో పాటు రైతు సంఘాల నేతలు కోరుతున్నారు.

## సున్నా నమోదు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాలకు సూచించామని, కొన్ని రాష్ట్రాలు మౌలిక సదుపాయాలు, సిబ్బంది వంటి వనరులను గరిష్టంగా వినియోగించుకోవడానికి కొన్ని పాఠశాలలను విలీనం చేశాయని ఒక సీనియర్ అధికారి పిటిఐకి తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి, లక్షద్వీప్, దాద్రా, నాగర్ హవేలి, అండమాన్, నికోబార్ దీవులు, డామన్, దయ్యూ, చండీగఢ్‌లలో కూడా సున్నా నమోదు ఉన్న పాఠశాలలు లేవు. ఢిల్లీలో కూడా సున్నా నమోదు ఉన్న పాఠశాలలు లేవు. అత్యధికంగా సున్నా నమోదులు ఉన్న పాఠశాలలుగల రాష్ట్రాల్లో తెలంగాణలో (2,245) రెండవ స్థానంలో ఉండగా, తరువాత మధ్యప్రదేశ్ (463) ఉంది. తెలంగాణలో సున్నా నమోదు ఉన్న పాఠశాలల్లో 1,016 మంది ఉపాధ్యాయులు ఉండగా, మధ్యప్రదేశ్‌లో 223 మంది పనిచేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోనూ సున్నా నమోదు గల పాఠశాలలు 81 ఉన్నాయి. గత మూడు విద్యా సంవత్సరాలుగా వరుసగా విద్యార్థుల నమోదును నమోదు చేసి రాష్ట్రవ్యాప్తంగా దాని అనుబంధ పాఠశాలల గుర్తింపును రద్దు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఉత్తరప్రదేశ్ మాధ్యమిక శిక్షా పరిషత్ (యుపి బోర్డు) ప్రకటించింది. దేశవ్యాప్తంగా 33 లక్షలకు పైగా విద్యార్థులు లక్షకు పైగా సింగిల్ టీచర్ పాఠశాలల్లో చదువుతున్నారు. ఇలాంటి సూళ్లు ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్ర, కర్ణాటక, లక్షద్వీప్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, ఒకే ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలల్లో విద్యార్థుల నమోదు విషయానికి వస్తే, ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఏక ఉపాధ్యాయ పాఠశాలల సంఖ్య 2022–23లో 1,18,190 నుండి 2023–24లో 1,10,971కి తగ్గింది. ఇది దాదాపు ఆరు శాతం తగ్గుదలని నమోదు చేసింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 28న 'రైతునేస్తం'

వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి

ప్రజాపక్షం/హైదరాబాద్: పత్తి, మొక్కజొన్న కొనుగోలు అంశాలపై మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ), వ్యవసాయ శాఖ అధికారులతో ఈనెల 28న( మంగళవారం) ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు వ్యవసాయ శాఖ 'రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి.గోపి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులందరూ తమ దగ్గరలోని 'రైతు వేదికల' ద్వారా పాల్గొని, తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు దగ్గరలోని వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.




## ఐదు విడతల కరువు భత్యం ఇవ్వండి




ప్రభుత్వానికి సిపిఐ విజ్ఞప్తి
60 వసంతాలుగా తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రభుత్వ గుర్తింపు యూనియన్‌గా కొనసాగడం గర్వకారణం : కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎఐటియుసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతో 60 వసంతాలుగా అప్రతిహతంగా కొనసాగడం ఎంతో గర్వ కారణమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు అన్నారు. యూనియన్ ప్రభుత్వ గుర్తింపు డైమండ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా ఆదివారం హిమాయత్ నగర్‌లో జరిగిన సమావేశంలో సాంబశివ రావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఇంత సుదీర్ఘ కాలం పాటు గుర్తింపు పొందిన యూనియన్‌గా ఉండటం దేశంలోనే ప్రథమం అన్నారు. ఇటీవల కాలంలో కొందరు అధికారులు యూనియన్ నాయకులను మినహాయించకుండా బదిలీలు జరిపితే, రాష్ట్ర హైకోర్టు జోక్యం చేసుకొని వాటిని రద్దు చేసి, వారికి రక్షణ కల్పించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జులై 2023 నుండి అమలుకావాల్సిన వేతన సవరణను 44శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, ఐదు విడతల కరువు భత్యం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఇఎస్‌ఐ విభాగంలో జిఓ126 సవరించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పూర్వపు పెన్షన్ విధానాన్ని పునఃరుద్దరించాలని, 317 జి.ఓ ద్వారా ఇప్పటికీ న్యాయం జరుగని ఉద్యోగులందరినీ తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్‌ను రద్దుచేసి ఆ స్థానంలో సెకండరీ హెల్త్ సర్వీసెస్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, తద్వారా ఉద్యోగుల ట్రెజరీ ద్వారా వేతనాలు పొందేందుకు వీలు కల్గుతుందని అన్నారు. యూనియన్ అధ్యక్షులు యం.ఎస్. మూర్తి మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉద్యోగులకు ల్యాబ్, ఎక్స్‌రే, ఇ.సి.జి, శిక్షణను పునఃప్రారంభించాలని, రేడియోగ్రాఫర్‌లకు ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రధాన కార్యదర్శి పి.ఇందిరా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళ నర్సింగ్ ఆర్డర్లీలకు ఇస్తున్న అదనపు ఇంటి అద్దె అలవెన్స్ పురుషులకు కూడా చెల్లించాలన్నారు. అదేవిధంగా టివివిపిలో క్యాడ ర్ స్ట్రెంథ్ సవరించేందుకు ఏర్పాటైన ఆడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ నివేదికను సవరించాలని, అలాగే అసిస్టెంట్ కమీషనర్ (నర్సింగ్) పోస్ట్ ను తక్షణం భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వి.వేణు కుమార్, సలహాదారు ఎం.సి.ఎస్. రాజు, ఉప ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసాచారి, ఎస్.శివానంద్, ఉపాధ్యక్షులు పి.నర్సయ్య, పి. స్వాతి, అమృత్‌రావు, వెంకట్రావు, కవిత, కార్యదర్శులు యం.మధుసూదన్ రెడ్డి, పి.సరస్వతి, ఆర్. జగన్ మోహన్ రావు, పి.రామారావు, పి.కిషన్, కోశాధికారి కె.సుశీల నాయకులు శ్రీదేవి, సతీష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబిలో ఏళ్లకు ఏళ్లుగా తిష్టవేసిన అధికారులు!

బదిలీలు లేకపోవడంతో అవినీతికి ఆస్కారం
ప్రక్షాళన చేయకపోతే కళంకమే




ప్రజాపక్షం/హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)లో అవినీతి రక్షణ కవచం బలపడుతోందన్న చర్చ వినిపిస్తుంది. సంవత్సరాల తరబడి ఒకే పోస్టింగ్‌లో కూర్చున్న అధికారులు.. బదిలీలపై ఎటు చూపక, స్థానిక లాబీలతో బలమైన నెట్‌వర్క్‌లు ఏర్పరుచుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రెండు సంవత్సరాలకు మించి ఒకే చోట ఉండరాదన్న నిబంధన ఉండగా.. కొందరు ఇన్‌స్పెక్టర్లు 8 ఏళ్లు, డిఎస్‌పిలు 10 ఏళ్లు ఇక్కడే కొనసాగుతున్నారు. ఫలితంగా అవినీతికి ఆస్కారం ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల వరంగల్ రేంజ్ ఎసిబిలో ఓ డిఎస్‌పి, నిందితుల తరపు బినామి వ్యక్తుల ఆస్తుల జప్తు విషయంలో రూ.20 లక్షలు లంచం తీసుకున్నట్లు ఫిర్యాదులు రావడం ఇందుకు నిదర్శనం. ప్రస్తుతం ఈ ఉదంతంపై ఎసిబి డైరెక్టర్ తరుణ్‌జోషి నేతృత్వంలో దర్యాప్తు కొనసాగుతుంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు డిఎస్‌పి ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచే ఎసిబిలో విధులు నిర్వహిస్తూ డిఎస్‌పిగా పదోన్నతులు పొందిన తరువాత కూడా ఇక్కడే కొనసాగడంపై పలు అనుమానాలను రేకెత్తిస్తుంది. దీంతో తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖలో అధికారులు ఏళ్ల తరబడి ఒకే చోట పదవుల్లో కొనసాగుతుండటం ఇప్పుడు పెద్ద చర్చగా మారింది. బదిలీలు లేకుండా, ఒకే జిల్లాలో, ఒకే రేంజ్ కార్యాలయంలో సంవత్సరాలుగా సీనియర్ అధికారులు పదవులను ఆక్రమించుకోవడం వల్ల ప్రభుత్వ శాఖల్లో అవినీతి నివారణ సంస్థే అవినీతి ఆశ్రయమవుతోందా? అనే ప్రశ్నలు మళ్లీ తెరపైకి వచ్చాయి. సర్కారు నియమావళి ప్రకారం, ఎసిబి, విజిలెన్స్, ఇంటెలిజెన్స్ వంటి కీలక శాఖల్లో పదవీ కాలం రెండేళ్లు మించకూడదు. కానీ, వాస్తవ పరిస్థితుల్లో కొన్ని మండలాల్లో ఇన్‌స్పెక్టర్లు 6 నుంచి 8 ఏళ్లు, డిఎస్‌పిలు 10 ఏళ్లకుపైగా ఒకే ప్రాంతంలో కొనసాగుతున్నారు. అంతకు మించి, కొందరు ప్రభావవంతమైన అధికారులుగా రాజకీయ అనుబంధాల ఆధారంగా ముఖ్య స్థానాలను సంపాదించుకున్నారని విభాగ అంతర్గత వర్గాలే చెబుతున్నాయి. ఒక సీనియర్ రిటైర్డ్ అధికారి వ్యాఖ్యానిస్తూ ఎసిబి అనేది ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే శాఖ. అదే శాఖలో బదిలీలు లేకపోతే అవినీతి నిరోధం బలహీనమవుతుంది. వ్యక్తిగత సంబంధాలు, స్థానిక ఒత్తిళ్లు పెరుగుతాయి అని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో విభాగం పనితీరుపై పలు ఫిర్యాదులు కూడా రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి వెళ్లినట్టు సమాచారం. అయితే, ఇప్పటివరకు అధికారిక స్థాయిలో ఎలాంటి బదిలీ జాబితా వెలువడలేదు. దాంతో, కొంతమంది అధికారులు తమ అధికారాన్ని వాడుకుంటూ స్థిర పదవులు – సురక్షిత స్థానాలు అనే ధోరణి పెంచుకున్నారని అంటున్నారని పరిశీలకులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఎసిబిని రాజకీయ లేదా వ్యక్తిగత లబ్ధి కోసం కాకుండా నిజమైన అవినీతి నిరోధక యంత్రాంగంగా మలచాలంటే, సమయానుకూల బదిలీలు, పదవీకాల పరిమితులు, పర్యవేక్షణ వ్యవస్థ తప్పనిసరి. బదిలీలు లేకపోవడం వల్ల స్థానిక సంబంధాలు, వ్యక్తిగత లాబీలు, అరెస్టు చేయాలా వద్దా? అనే నిర్ణయాల్లో కూడా పాక్షికత పెరుగుతోందని లోగుట్టు వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే అవినీతి వ్యతిరేక యంత్రాంగం విశ్వసనీయత కుప్పకూలే ప్రమాదం ఉందని హెచ్చరికలు వెల్లువెత్తుతున్నాయి. ఇక విభాగంలో కొందరు అధికారులు రాజకీయ ఆశ్రయంతో తాము ఇష్టమొచ్చిన విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా, స్పెషల్ టీమ్‌లు, సర్కిల్ ఇన్‌ఛార్జ్ పోస్టులు, సున్నితమైన కేసులు ఇవన్నీ కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమైపోయాయని అంటున్నారు.

**ప్రభుత్వ వర్గాలు ఈ వ్యవహారంపై కన్ను వేసినా, ఇప్పటివరకు పెద్దగా చర్యలు లేవు.. అవినీతి అధికారులకు ఆమె సింహస్వప్నం..**

ఇటీవలే ఎసిబి బాధ్యతలను అదనపు డిజి చారుసిన్హా చేపట్టారు. విధినిర్వహణలో చారుసిన్హా చాలా స్ట్రిక్ట్ అనే ముద్ర వేయించుకున్నారు. నిబద్ధతతో పనిచేసే వారికి ప్రశంసలు, నిబంధనలకు విరుద్ధంగా పనిచేసే అధికారులకు మాత్రం ఆమె సింహస్వప్నం అని పోలీసు శాఖలో పేరుంది. ప్రస్తుతం ఎసిబిలో అధికారుల పనితీరును పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డారు. ఇప్పటికైనా దీర్ఘ కాలంగా పనిచేస్తున్న అవినీతి అధికారులను గుర్తించి బదిలీ చేస్తే ఎసిబికి ప్రజల్లో ప్రశంసలు దక్కుతాయని పలువురు అంటున్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో బిఆర్‌ఎస్ కథ పరిసమాప్తం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతో బిఆర్‌ఎస్ కథ పరిసమాప్తమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా చారిత్రక తీర్పు ఇవ్వాలని ఓటర్లకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వెంగళరావు నగర్ డివిజన్ మధురానగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ 10 ఏళ్ల బిఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్‌లో విధ్వంసం జరిగిందన్నారు. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో పరాజయం పాలైన బిఆర్‌ఎస్ ఉప ఎన్నికలో చేసే కుయుక్తులు తిప్పి కొట్టాలని పేర్కొన్నారు. మినీ ఇండియా లాంటి హైదరాబాద్ అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంతో పని చేస్తున్నారని ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ ఓటర్లు సీఎం రేవంత్ రెడ్డి మద్దతుగా నిలవాలని మంత్రి తుమ్మల కోరారు. నియోజకవర్గంలో స్థానికుడిగా, ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నవీన్ యాదవ్‌ను గెలిపించడం ద్వారా జుబ్లీహిల్స్‌ను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ మాట్లాడుతూ స్థానిక సమస్యలు మధురానగర్ కాలనీలోని మౌలిక వసతుల లోపాలను, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలు తమ అమూల్యమైన ఓటును 'చేతి గుర్తు'కు వేసి, తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత బండి రమేష్ వర్ధన్నపేట ఎంఎల్‌ఎ నాగరాజు పాల్గొన్నారు.

## భూమి సునీల్‌కు 'భూమి రత్న' పురస్కారం

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు న్యాయ నిపుణులు ఎం.సునీల్ కుమార్(భూమి సునీల్)కు 'భూమి రత్న' పురస్కారం లభించింది. రైతుల భూమి హక్కులు, గ్రామీణ ప్రాంతాల్లో న్యాయ సాధికారతకు గానూ ఆయన అందిస్తున్న విస్తృత సేవలకు గాను ఈ గౌరవం లభించింది. హైదరాబాద్‌లో రైతునేస్తం, ముప్పవరపు ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును సునీల్‌కు అందజేసి ఘనంగా సత్కరించారు.



## రొమ్ము క్యాన్సర్ సమాజాన్ని పట్టిపీడిస్తోంది

ప్రజాపక్షం/హైదరాబాద్: రొమ్ము క్యాన్సర్ సమాజాన్ని పట్టిపీడిస్తోందని, దీనిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారించడం చాలా సులభమని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క తెలిపారు. క్యాన్సర్ పట్ల ప్రజలకు మరింత అవగాహన కల్పించడం అత్యవసరమని, వైద్యులు ఇలాంటి కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీ యశోద ఆసుపత్రిలో 'బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన' సదస్సు ఆదివారం జరిగింది. ఈ కార్య క్రమానికి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభ, ప్రముఖ సినీ నటి శ్రీలీల, యశోద హాస్పిటల్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్.జి.ఎస్.రావుతో కలిసి ఆవిష్కరించారు. సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రాజేష్ గౌడ్ రచించిన 'పింక్ పవర్' రొమ్ము క్యాన్సర్ అవగాహన పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రస్తుతం అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, క్యాన్సర్ రాగానే జీవితం ముగిసిందనే భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, క్యాన్సర్ పేషెంట్లకు వైద్యులు విశ్వాసం కల్పిస్తే, దీనిని జయించడం సాధ్యమవుతుందని మంత్రి సూచించారు. యశోద ఆసుపత్రి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల ఆమె అభినంధించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల అవగాహన క్యాంపులను నిర్వహించాలి. అప్పుడే వైద్య వృత్తి సార్థకమవుతుందన్నారు. ఇంట్లో మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఇల్లు ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ డైరెక్టర్ ఫాల్గుణ గోరుకంటి, మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ లింగయ్య, ఆంకాలజీ విభాగం అధిపతి డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఎంజాయి పేరుతో గంజాయి వద్దు




తెలంగాణ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో...
ఈనెల 27 నుంచి నవంబర్ 2 వరకు బస్సు కళా జాత
పోస్టర్‌ను ఆవిష్కరించిన పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎంజాయి పేరుతో గంజాయి వద్దు అంటూ తెలంగాణ ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు బస్సు కళా జాతను నిర్వహించనున్నారు. కళాజాత వాల్ పోస్టర్‌ను ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావులు ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్ల పల్లి శ్రీనివాసరావు, ఈటి నరసింహా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, కార్యదర్శివర్గ సభ్యులు కళవేణ శంకర్, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, ప్రజానాట్యమండలి నాయకులు కె.లక్ష్మి నారాయణ, రాము, సైదులు, శైలజా, మంగలు పాల్గొన్నారు. సాంస్కృతిక సలహామండలి సభ్యులు, తెలంగాణ ప్రజా నాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా నేతృత్వంలో 30 మంది కళాకారులు పాల్గొననున్న ఈ బస్సు కళా జాత సోమవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లో నిజాం కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభం కానుంది. ఈ కళాజాత వివిధ విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, జూనియర్ కళాశాలను సందర్శించి తమ సాంస్కృతిక కళా రూపాల ద్వారా విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగనుంది. అదేవిధంగా ఈ బస్సు జాత ఎంపిక చేసిన జిల్లాలలోని మండల కేంద్రాలు, గ్రామాల్లో సైతం సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనుంది. ఈ బస్సు కళాజాతను నవంబర్ 2వ తేదీన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని మంచిర్యాలలో సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. తెలిసి తెలియక కొంత మంది విద్యార్థులు డ్రగ్స్, గంజాయి అలవాటు పడి వారి బంగారి భవిష్యత్తును నశనం చేసుకుంటున్న ఈ నేపథ్యంలో కళాజాతను చేపట్టామని పల్లె నర్సింహ వివరించారు.

## కత్తి ఒకరికిచ్చి... యుద్ధం మరొకరు చేయమంటే ఎలా?

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్: కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం మరొకరిని చేయమంటే ఎలా అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. ఓటింగ్ రోజున హైదరాబాద్ ప్రజలు ఓటింగ్ వేసేందుకు రారని, వారిని ఓట్లకు తీసుకొచ్చి, బిఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ హోటల్స్ కార్మిక యూనియన్ నాయకులతో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కెటిఆర్ ఆదివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలువురు హోటల్స్ కార్మిక నాయకులు బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ రాష్ట్రం రౌడీషీటర్ల, దండుపాళ్యం ముఠా పాలన నడుస్తోందని ఆరోపించారు. ఒక మంచి ఐఎఎస్ అధికారి విఆర్‌ఎస్ పెట్టారని, లిక్కర్ బాటిల్స్ స్టిక్కర్ కాంట్రాక్టు కోసం సిఎం అల్లుడు, మంత్రి కొడుకు పోటీ పడ్డారని కెటిఆర్ చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మలేదని, ఒఆర్ఆర్ లోపల కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తెలంగాణకు లాభం చేసే తీర్పు ఇవ్వాలని కెటిఆర్ ప్రజలను కోరారు. కెసిఆర్‌ను మరోసారి సిఎం చేసే అవకాశం వచ్చిందన్నారు.

## విక్టరి గ్రౌండ్ ఘటనతో... ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

డిజిపి శివధర్‌రెడ్డి
గాయపడిన డిసిపి, గన్‌మెన్‌ను పరామర్శించిన డిజిపి, సిపి



ప్రజాపక్షం/హైదరాబాద్: ఛాదర్‌ఘాట్ వద్ద విక్టరి గ్రౌండ్ కాల్పుల ఘటన నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవరం లేదని.. రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతామని డిజిపి శివధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనలో సెల్‌ఫోన్ దొంగ ఒమర్ కత్తితో దాడి చేయడంతో గాయపడి సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సౌత్‌ఈస్ట్ డిసిపి చైతన్యకుమార్, గన్‌మెన్ మూర్తిలను డిజిపితో పాటు హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్‌లు పరామర్శించారు. వారి ధైర్యసాహసాలను ఈ సందర్భంగా డిజిపి అభినందించడంతో పాటు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డిజిపి శివధర్‌రెడ్డి ఆసుపత్రి వద్ద మీడియాతో మాట్లాడుతూ... ''చాదర్‌ఘాట్ ప్రాంతంలో మొబైల్ స్నాచర్లపై కాల్పులు జరిగాయి, సెల్‌ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితులను పట్టుకునే క్రమంలో, నిందితులు డిసిపిపై కత్తితో దాడి చేశారు. డిసిపి చైతన్య కుమార్, గన్‌మెన్ మూర్తి నిందితులను సుమారు 750 మీటర్లు వెంబడించారు. ఈ వెంబడింపులో భాగంగా నిందితులు కత్తితో దాడికి పాల్పడ్డారు. ప్రధాన నిందితుడు ఒమర్ అన్సారీపై గతంలో 22 కేసులు నమోదై ఉన్నాయి. కాలపత్తర్ పోలీస్ స్టేషన్‌లో ఒమర్ అన్సారీపై రౌడీ షీట్ ఉంది. ఈ ఆపరేషన్‌లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన డిసిపి, గన్‌మెన్ల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నాము. ప్రస్తుతం వారిద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. గాయపడిన ఇద్దరు అధికారులు రేపు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవుతారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నాం. నిందితుడు ఒమర్ అన్సారీకి శస్త్రచికిత్స (ఆపరేషన్) జరిగింది. నిందితుడి ఆరోగ్య పరిస్థితి కూడా నిలకడగా ఉంది'' అని అన్నారు. పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ మాట్లాడుతూ డిసిపి సౌత్ జోన్ నేతృత్వంలో పరారీలో ఉన్న ఆటోడ్రైవర్, మరో నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయన్నారు. దర్యాప్తులో కొన్ని క్లూస్ కూడా లభించాయని, ఇటీవల ఒమర్ అన్సారీ యొక్క కదలికలు, అతనికి ఉన్న పరిచయాలపై వివరాలు సేకరిస్తున్నామన్నారు. నగరంలో విజిబుల్ పోలీసింగ్‌ను పెంచామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. హైద్రాబాద్ పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు రక్షణగా ఉంటారని, రౌడీ షీటర్లు, దొంగల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మొబైల్ స్నాచింగ్ గ్యాంగ్స్‌పై కూడా ప్రత్యేకంగా నిఘా పెట్టామని, డిసిపి చైతన్యకుమార్‌కు మెడ భాగంలో గాయాలయ్యాయి, గన్‌మెన్ మూర్తికి కాలు గాయమైందన్నారు. ఈ సంఘటనలో డ్రైవర్ సందీప్ అప్రమత్తంగా ఉండి, కీలకపాత్ర పోషించారని తెలిపారు. డిసిపి చైతన్య కుమార్, గన్‌మెన్ మూర్తి, డ్రైవర్ సందీప్ – ముగ్గురూ ధైర్యసాహసాలు ప్రదర్శించారు. పరారీలో ఉన్న ఇద్దరు నిందితుల కోసం ఐదు బృందాలు గాలిస్తున్నాయి. మీడియా సమావేశంలో వెస్ట్‌జోన్ డిసిపి చింతమనేని శ్రీనివాస్, సౌత్‌జోన్ డిసిపి స్నేహా మెహ్రా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కల్లు గీత వృత్తిదారుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 6 నుంచి 8 వరకు రాష్ట్రవ్యాప్త నిరసనలు

బకాయిలను విడుదల చేయాలని చేయాలని రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్




ప్రజాపక్షం/హైదరాబాద్ : కల్లుగీత వృత్తిలో చెట్లపై నుండి పడి మరణించిన కుటుంబాలతో పాటు శాశ్వతంగా గాయపడిన వారికి చెల్లించాల్సిన రూ.13 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలను తక్షణమే విడుదల చేయాలని చేయాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర కౌన్సిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఎక్స్‌గ్రేషియా బకాయిల విడుదలతో పాటు పెండింగ్ వున్న పెన్షన్ దరఖాస్తులు, గుర్తింపు కార్డులు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 6,7,8 తేదీలలో రాష్ట్ర వ్యాపితంగా తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయాలు, జిల్లా కేంద్రాలలో సూపరిండెంట్, కలెక్టర్ ఆఫీసుల ముందు ప్రదర్శనతో మెమోరాండాలు సమర్పించాలని రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారు. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గీత వృత్తిదారుల సమస్యలపై దశల వారిగా ఆందోళన కార్యక్రమం చేపట్టాలని నవంబర్ చివరి వారంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించాలని సమావేశం నిర్ణయించిందని తెలిపారు. షెడ్యూల్ ఏరియాలోని కల్లు గీత వృత్తిలో వున్న గీత వృత్తిదారులకు సహకార సంఘాలు, టిఎఫ్టాలు ఇవ్వాలని, గీత వృత్తిదారులందరికి రక్షణ వృత్తి పరికరాలు అందించాలని, నీర స్కీమ్ కల్లు గీత సహకార సంఘాల ద్వారా అమలు చేయాలని, పెన్షన్‌ను రూ.5వేలకు పెంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్ కో ఆర్డినేటింగ్ సెక్రటరి బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షులు దూసరి శ్రీరాములు, కెవిఎల్, పబ్బు వీరస్వామి, పి.రాములు, రామ్మూర్తి, నాగరాజు, బొడిగె సైదులు, నాగేశ్వరరావు, పైరు తిరుపతి, సుధాకర్ గౌడ్, ఎర్ర రమేశ్, చాపల అంజయ్య, కుంభం జయరాములు మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీత వృత్తిదారులకు 560 జీవో ప్రకారం సొసైటీలకు భూమి, షాపులకు స్థలాలు, వృత్తి అభివృద్ధికి సంక్షేమ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ముందు ఇటీవల మరణించిన నేలపట్ల పెద్దసైదులు, కర్నూల్ బస్సు ప్రమాదంలో మరణించిన వారికి, చెట్లపై నుండి మరణించిన వారికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళ్లు అర్పించారు.

## చెస్ జిల్లా జట్టుకు తేజ విద్యార్థులు

**ప్రజాపక్షం/కోదాడ** : ఎస్.జి.ఎఫ్ ఆదివారం సూర్యాపేట పట్టణ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి చదరంగం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ 14 బాలికల విభాగంలో కోదాడ పట్టణ శివారు కోమరబండకు చెందిన తేజ విద్యాలయ విద్యార్థులు భూక్యా యోగిత(6వ తరగతి), ఓరుగంటి అనంతలక్ష్మి (7వ తరగతి)లు, అండర్ 17 విభాగంలో శ్రీహర్ష(8వ తరగతి)లు ఎంపికైనట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ రమాసోమిరెడ్డి, కోచ్ నరసింహారావులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో నిర్వహించు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.



## వారాహి శక్తిపీఠం ఆలయ, స్నేహ వృద్ధాశ్రమం నిర్మాణానికి భూమిపూజ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : జిల్లా కేంద్రం సమీపంలోని చర్లపల్లి శివారులో నూతనంగా నిర్మించే శ్రీశ్రీశ్రీ వారాహి శ్రీ శక్తి పీఠం ఆలయ నిర్మాణానికి, స్నేహ వృద్ధాశ్రమం ఆదివారం వేదమూర్తుల వేద పండితుల మంత్రోచ్ఛరణాల నడుమ భక్తిశ్రద్ధలతో భూమి పూజ నిర్వహించారు. ఆలయంలో వారాహి అమ్మవారు, లలితాంబికా దేవి, రాజ్యశ్యామల, కాలభైరవుడు, విఘ్నేశ్వర విగ్రహాల ప్రతిష్ఠాపనకు ఐదు రకాల హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షురాలు గంట్ల లక్ష్మి, కార్యదర్శి అక్కినపల్లి కిరణ్, కోశాధికారి మండది సురేందర్ రెడ్డి, సభ్యులు ఆలంపల్లి గోవర్ధనగిరి, రావుల శ్రీనివాస్ రెడ్డి, కేతిరెడ్డి శ్రీనివాస రావు, అరుణ,లతా, విజయ్, పద్మ పాల్గొన్నారు.





## నాణ్యమైన వడ్లతో మద్దతు ధర పొందండి

**ప్రజాపక్షం/మోటకొండూరు** : నాణ్యమైన వడ్లు తెచ్చి మద్దతు ధర పొందాలని డిఆర్‌డిఏ అడిషనల్ పిడి జంగారెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మోటకొండూరు మండలంలోని కదిరేణిగూడెం, కొండాపురం, చామాపూర్, ఇక్కుర్తి, దిలావర్ పూర్‌లలో ఐకేపి ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఎవరూ అధైర్యపడవద్దని అన్నారు. వర్షాల కారణంగా పంటలకు ఆలస్యం అయిందని అయినప్పటికీ రైతులు పండించిన ప్రతి ధాన్యం కొనుగోలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం రవీందర్, ఏపిఎం ఆనంద్, సిసి లక్ష్మణ్, వివోఏ కవ్య, నాయకులు, రైతులు ఏసగారి అంజిరెడ్డి, పాషం తిర్మల్ రెడ్డి, వల్ల బల నవీన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కీర్తి పురస్కార గ్రహీత బైరెడ్డి కృష్ణారెడ్డికి సన్మానం : పెద్దిరెడ్డి గణేష్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సూర్యాపేట తాలూకాలో జన్మించిన ఆంగ్ల ఉపన్యాసకులు, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార గ్రహీత బైరెడ్డి కృష్ణారెడ్డికి మనం వికాస వేదిక తరఫున సన్మానించనున్నట్లు మనం వికాస వేదిక అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుధా బ్యాంక్ ఆడిటోరియంలో సోమవారం సాయంత్రం జరగనుందని అన్నారు. ఈ సభలో తెలుగు సాహితీ చరిత్రలో ఎన్నో మరుపురాని ఘట్టాలను ఆవిష్కరించిన గ్రేస్ గాత్రం ద్వితీయ ముద్రణ ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అధ్యక్షత వహించే సభలో పుప్పాల కృష్ణమూర్తి, సాగర్ల సత్తయ్య, పెరుమాళ్ళ ఆనంద్, వేముల వెంకటేశ్వర్లు, ఏబిఎల్ శశి, గొడిశాల వెంకటేశ్వర్లు, శీల అవిలేసుతోపాటు పలువురు కవులు, కళాకారులు, సుధా బ్యాంక్ పాలకవర్గం, సిబ్బంది, సాహితీ ప్రియులు పాల్గొంటారని వివరించారు.

## బిసిలకు బడ్జెట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం

### రూ.5 వేల కోట్ల ఫీజుల బకాయిలు ప్రభుత్వం విడుదల చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : రాష్ట్రంలో ఇంజినీరింగ్,డిగ్రీ,పిజి తదితర కాలేజి కోర్సులు చదివే 14 లక్షల మంది ఎస్‌సి,ఎస్‌టి,బిసి,మైనారిటీ విద్యార్థుల గత రెండు సంవత్సరాల ఫీజులు బకాయిలు 5వేల కోట్లు విడుదల చేయాలని బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరల ప్రకారం స్కాలర్‌షిప్ రెండు రెట్లు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాం మాత్రం బిసిలకు బడ్జెట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. గత రెండు సంవత్సరాల ఫీజుల బకాయిలను చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. క్లాసుల నుంచి బయటకు పంపి ఎండలో నిలబెట్టి అవమాన పరుస్తున్నారని తెలిపారు. దీనితో చదువుకోవడం ఇబ్బందిగా తయారైందన్నారు. దీనితో విద్యార్థులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.ఈ సమావేశంలో బిసి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కారింగ్ నరేష్ గౌడ, కన్నబోయిన రంజిత్ యాదవ్ ,జక్కల పరమేష్ ,ఆవుల ప్రశాంత్, సతీష్ ,పృథ్వీరాజ్ ,అంద రాకేష్ ,ఎర్రబోయిన గణేష్ నిఖిల ,తదితరులు పాల్గొన్నారు.

## నేత్రదానం మానవత్వానికి ప్రతీక



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : లయన్స్ క్లబ్ అఫ్ నల్లగొండ ఎస్‌పిటి ప్లాటినం క్లబ్ సభ్యులు లయన్ మిరియాల ఇంద్రయ్య తల్లి మిరియా ల బుగ్గమ్మ ఆదివారం మృతి చెందారు. వారి కుటుంబ సభ్యుల అనుమతితో పట్టణంలోని పద్మా నగర్ లో వీరి స్వగృహం లో నేత్రదానం ద్వారా కార్ని యా అను కంటిపొరలను లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ టెక్నీషియన్ బచ్చలకూర జానీ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హరనాథ్, మేనేజర్ డాక్టర్ పుల్లారావు ఆధ్వర్యంలో సేకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ లయన్ కెవి ప్రసాద్,మేనేజర్ డాక్టర్ పుల్లారావు మా ట్లాడుతూ నేత్రదానం మహోన్నతమైనదని, ఒకరి నేత్రదానం ద్వారా ఇద్దరు నుండి నలుగురు కార్నియల్ అంధులకు కంటి చూపును ప్రసాదించే అవకాశం ఉందని తెలిపారు. నేత్రదానంపై మరింత సమాచారం కొరకు తమ కోఆర్డినేటర్లు లయన్ కోట సరితను, లేదా చంద్రశేఖర్ చిరునోముల ను ఏ సమయంలోనైనా సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ దామర యాదయ్య, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, కోశాధికారి డాక్టర్ కొనకంచి విజయకుమార్,క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ లయన్ దశరథ జెల్లా , ప్రెసిడెంట్ శ్రవణ్ కుమార్ మామిడి, ట్రెజరర్ శ్రీనివాస్ రాపోలు ఉన్నారు.

## అన్నదానం మహాదానం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మహాదానమని జిల్లా కాంగ్రెస్ స్టార్ క్యాంపెయిన్ ఛైర్మన్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పోలగాని వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో రూ.3వేల అయ్యప్ప స్వాములకు ఆదివారం అన్నప్రసాద వితరణను ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాధవి వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించకోని అయ్యప్ప స్వాములకు మండల కాలం అన్నప్రసాద వితరణ చేపట్టడం జరిగిందన్నారు. స్వాములు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

# రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కృషి

### ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/మోటకొండూర్** : రైతులు పండించిన వరి ధాన్యం సత్వరమే మిల్లులకు అందించాలనే సదుద్దేశంతో చామకూర సుగుణ శ్రీనివాస్ రెడ్డిల కుమారుడు శశిధర్ రెడ్డి సురేఖ ఆధ్వర్యంలో రైస్ మిల్లు ఏర్పాటు చేయడం శుభ పరిణామం అని, ఆలేరు నియోజకవర్గంలో అంత పెద్ద రైస్ మిల్లు ఏర్పాటు చేయడం అభివృద్ధికి బాటలు వేయడమేనని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. ఆయన ఆదివారం మోటకొండూరు మండలంలోని ఇక్కుర్తిలో అధునాతన పరికరాలతో ఏర్పాటు చేసిన నూతన రైస్ మిల్లును రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, రైస్ మిల్లర్ల సమస్యలు మంత్రి ఉత్తమకుమార్ రెడ్డితో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు మార్త వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు డివిఎన్ రెడ్డి, బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ రాజేంద్ర ప్రసాద్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్ పాల్గొన్నారు.

**మంత్రి పర్యటన సభ ప్రాంగణం పరిశీలన**

మోటకొండూరు మండల కేంద్రంలో నేడు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా మండల పరిషత్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ తహసిల్దార్ కార్యాలయాలకు శంకుస్థాపన నిమిత్తం జరిగే ఏర్పాట్లను సభా ప్రాంగణాన్ని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల నుండి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు పర్యవేక్షించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

**వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బీర్ల**

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మండలంలోని తీర్మాలపురం గ్రామంలో ఆదివారం పిఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దత్తాయపల్లి గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశానికి హాజరై లబ్ధిదారులు మార్త సంధ్య వెంకటేష్ దంపతులకు పట్టువస్త్రాలు, యాట పొట్టేలును అందజేశారు. ప్రజాప్రభుత్వంలో ప్రతి పేద కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, పిఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నర్సింహారెడ్డి, నాయకులు శంకర్ నాయక్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి : ముత్యాలు

**ప్రజాపక్షం/నల్లగొండ:** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పెండింగ్ తదితర బిల్లులు, వేతనాలు, బెనిఫిట్స్ కు నిధులను వెంటనే విడుదల చేయాలని సీనియర్ ఉపాధ్యాయులు భూతం ముత్యాలు డిమాండ్ చేశారు.2023 జూన్లో కుటుంబ అవసరాల నిమిత్తం తన భార్యకు అప్పుడు పక్షవాతం మెడికల్ ఖర్చులకోసం సరెండర్ లీవ్స్ పెట్టుకుంటే రెండు సంవత్సరాలు దాటిన ఇప్పటికీ ఆ డబ్బులు రాలేదు అనారోగ్య సమస్యలకు ఒక ఉద్యోగిగా తాను దాచుకున్న డబ్బులు సంవత్సరాలు దాటిన రావడంలేదని అనారోగ్యాల వలన తన భార్య 2024 జనవరి నెలలో నిమ్స్ లో మరణించింది ఆమె చావులకు దాచుకున్న డబ్బులు అక్కడకు రాలేదు ఆమె మరణించి సంవత్సరం అయినా సంవత్సరీకానికి కూడా రాకపోతే ఉద్యోగాలు చేసి ఏం ప్రయోజనం చనిపోయాక వచ్చే బిల్లులు ఎవరి పాలు కావాలి బ్రతికి ఉన్నప్పుడు కళ్ళ చూడలేమా ఎందుకు పాలకులకు ఉపాధ్యాయుల మీద ఇంత వివక్ష పాలకులు ఆలోచించాలన్నారు.ఏ రాష్ట్రంలో కూడ ఇన్ని విధాల బిల్లులు పెండింగ్‌లో లేవని ముఖ్యమంత్రి ఆలోచించాలన్నారు.ఉద్యోగులకు ఏ బిల్లులు ఇప్పించలేని స్థితిలో ఇప్పుడున్న సంఘ నాయకులు ఉన్నారని విమర్శించారు. కుటుంబ వ్యక్తిగత అవసరాలు అనారోగ్య సమస్యలు ఉన్నప్పుడు బిల్లులు అందితే కుటుంబాలు కుదురుకుంటాయి ఉద్యోగులు తమ విధులు సక్రమంగా నిర్వర్తిస్తారు ఇలాంటి సమస్యలతో ఉపాధ్యాయులు విధులు సక్రమంగా నిర్వహిస్తారా విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వ్యవస్థ అష్టకష్టాలు పడుతుందని వారి అవసరాల కోసం దాచుకున్న డబ్బులు రెండు సంవత్సరాలు దాటిన ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని అన్నారు. లేని పక్షంలో నిరాహార దీక్షకు దిగాల్సి ఉంటుందని ఆవేదనను వ్యక్తం చేశారు.

## రాధేయ సాహిత్య సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : మాతృకవి రాధేయ తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రముఖ సాహితీవేత్త ఉస్మానియా విశ్వవిద్యాలయ పూర్వ ఆచార్యులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో జరిగిన మాతృమూర్తి రాచమల్ల లచ్చమ్మ, మాతృకవి రాధేయ మారక పురస్కారాల ప్రధానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. డాక్టర్ ఎం పురుషోత్తమాచార్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తల్లి పేరు మీద అవార్డు ఇవ్వడం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక గొప్ప స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ సందర్భంగా మాతృమూర్తి లచ్చమ్మ పురస్కారాన్ని ప్రముఖ ప్రజాకవి జయరాజుకు మాతృకవి రాధేయ పురస్కారాన్ని ప్రముఖ అష్టావధాని అవుసుల భాను ప్రకాష్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల ఫ్యామిలీ ట్రస్ట్ చైర్మన్ ఆచార్య రాచమల్ల శ్యాంసుందర్, డాక్టర్ ఓగూరి నాగేశ్వరరావు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, పెరుమాళ్ళ ఆనంద్, రావిరాల అంజయ్య, డాక్టర్ అనిత కుమారి, డాక్టర్ సాదం ఐలయ్య, డాక్టర్ గోగు వెంకటేశ్వర్లు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, రాచమల్ల శ్రీవాణి, రాధా కిషన్, రాచమల్ల చంద్రకళ, డాక్టర్ చింతోజు మల్లికార్జున చారి, దాసరి శ్రీరాములు, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్లాలి

### రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ చేయాలి

### బిసి హక్కుల సాధన సమితి ధనుంజయనాయుడు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ కోసం అఖిలపక్ష బృందాన్ని అఖిలపక్ష బిసి నాయకులను ప్రధానమంత్రి వద్దకు తీసుకెళ్లేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చేయాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన మిర్యాలగూడలో బిసి భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి, సామాజి కార్యకర్తలతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిసి బిల్లు ఆమోదించి షెడ్యూల్ 9లో చేర్చాల్సిన బాధ్యత కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీదేనని ఇప్పుడు ఆ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నం చేస్తున్న ప్రధానమంత్రి వద్దకు బీజేపీతో కూడిన అఖిలపక్ష బృందాన్ని సీఎం తీసుకెళ్లాలని, బిసి రిజర్వేషన్ పట్ల బీజేపీ వైఖరి ఏంటో ప్రధానమంత్రి అఖిలపక్షాల ముందు స్పష్టం చేస్తే ఆ విషయాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న బిసిలకు తెలియచేయడానికి అవకాశం లభిస్తుందని బిసి రిజర్వేషన్ల పట్ల ప్రధాని ఏవిధంగా స్పందించారో రాష్ట్ర బీజేపీ నాయకులతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన అఖిలపక్ష పార్టీలు అఖిలపక్ష బిసి సంఘాలకు స్పష్టంగా అర్థమవుతుందని తద్వారా బిసిలే బీజేపీ పట్ల ఎలా వ్యవహరించాలో నిర్వహించుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. బిసిల వరకు బిసిల పట్ల అసలు ముద్దాయి బీజేపయే అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రచారం జరగాలని ఇప్పటికే బీసీలు బీజేపీని అసహ్యించుకుంటున్నారని ఈనెల 18న జరిగిన బంద్‌లో బీజేపీ పాల్గొనడం హాస్యాస్పదమని ప్రతి బీసీ నాయకులు అభిప్రాయపడుతున్నారని, ఈ ఉద్యమాన్ని మరింత ముందుగా తీసుకెళ్లి 2028 నాటికి బీజేపీని నామరూపం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రతి బీసీలపై ఉందని ధనుంజయనాయుడు పేర్కొన్నారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ జాడి రాజు, నరేందర్, సతీష్, ఉపేందర్‌లు ఉన్నారు.

## ఆర్కె హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**ప్రజాపక్షం/బీబీనగర్** : భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కె హాస్పిటల్ నిర్వహించు పల్లెకి వైద్యం కార్యక్రమంలో భాగంగా 125వ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బీబీనగర్ మండలం అన్నం పట్ల గ్రామం నందు చావా ఫౌండేషన్, కోట ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా ఎస్సై విజయ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం నందు శ్రీ ఆర్కె హాస్పిటల్ అధినేత జాతీయ వైద్యరత్న అవార్డు గ్రహీత డాక్టర్ చావా రాజకుమార్ గ్రామ ప్రజలకు వారి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమయానుగుణంగా చిన్న చిన్న వైద్య పరీక్షలు నిర్వహించడం వలన రానున్న కాలంలో రాబోయే పెద్ద పెద్ద రోగాలను నివారించుకోగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన లేక చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల అనుకొని పరిస్థితులలో కుటుంబ సభ్యులను కోల్పోతున్నారని చెప్పారు. డాక్టర్ చావా రాజ్ కుమార్‌ని వారి బృందాన్ని విజయ అభినందించారు. ఈ వైద్య శిబిరంలో బిపి షుగర్ న్యూరోపతి బిఎండి మొదలగు పరీక్షలు 150 మందికి పైగా గ్రామ ప్రజలకు నిర్వహించి వారికి అవసరమగు మందులు డాక్టర్ సలహా మేరకు పంపిణీ చేశారు.

## పంట నష్టపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : రైతు వరి పంటను నష్టపరిచిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మల్లు నాగార్జున్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ రైతుసంఘం మండల కమిటి ఆధ్వర్యంలో సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని 10వ వార్డు కుప్పిరెడ్డిగూడెంలోని మందాడి పద్మారెడ్డికి చెందిన రెండు ఎకరాల భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు కలపడంతో పూర్తిగా ఎండిపోయిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే చట్టపరంగా లేక పెద్దమనుషుల సమక్షంలో పరిష్కరించుకోవాలి తప్ప ఇలాంటి చర్యలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. పోలీసులు వెంటనే కలుగజేసుకొని ఈ చర్యకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మందడి రాంరెడ్డి, పందిరి సత్యనారాయణ రెడ్డి, చిట్లంకి యాదగిరి, దుబ్బాక వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బిక్షం రెడ్డి పాల్గొన్నారు.

# వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పెన్షనర్లకు అన్యాయం చేసే వాలిడేషన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆల్ ఇండియా పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్.అరుణ అన్నారు. ఆదివారం స్థానిక యుటీఎఫ్ భవనంలో ఆ సంఘం డివిజన్ మహాసభ డివిజన్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2026 నుంచి జనవరి 1 నంచి కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ దారులకు బెనిఫిట్స్ ఇవ్వకుండా కొత్తగా రిటైర్మెంట్ అయిన వారికి మాత్రమే బెనిఫిట్ ఇస్తామని వాలిడేషన్ చట్టాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఈ చట్టంతో పెన్షన్ దారులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈపీఎస్ పెన్షన్ దారులకు కనీస వేతనం రూ.9వేలు అందించాలన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నూకల జగదీశ్చంద్ర, వాడపల్లి రమేష్, శ్యాంసుందర్, పులి కృష్ణ మూర్తి, పరిమి రామావతారం, మల్లు గౌతంరెడ్డి, రామచంద్రరావు, లక్ష్మీ నారాయణ, రమణారెడ్డి, సత్యనారాయణరావు, కేశవులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీ ఎన్నుకోగా డివిజన్ అధ్యక్షుడుగా జి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా పి.రామావతారం, ఆర్.జ్ఞానేశ్వర్ రెడ్డి, స్వరూపరాణి, పులి కృష్ణమూర్తి, లక్ష్మీ నారాయణ, మాధవరెడ్డి, దుర్గా రాణి, వెంకటరమణారెడ్డి, ఇజాజ్ అహ్మద్, రామచంద్రు, రేణుక, నాగు వంచ నరసింహాలను ఎన్నుకున్నారు.



## క్రీడలతోనే ఉపాధి, ఉద్యోగాలు

**ప్రజాపక్షం / కోదాడ** : విద్యార్థులు, యువత ప్రభుత్వం, వివిధ కార్పొరేట్ సంస్థలు, కార్పొరేషన్లు అందిస్తున్న క్రీడా కోటాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి, ఉద్యోగాలను సాధించాలని మాజీ జాతీయ వాలీబాల్ క్రీడకారులు, పోలీసు అధికారి ఎడవెల్లి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం కోదాడ జడ్పీహెచ్‌ఎస్‌లో ది కోదాడ వాలీబాల్ అసోసియేషన్ వారి వాలీబాల్ కోచింగ్ సెంటర్‌ను సందర్శించి, అనంతరం క్రీడాకారులతో మాట్లాడుతూ తాను గరిడేపల్లి మండలంలోని మారుమూల ఆవాస గ్రామం ఎర్రకుంటకు చెందిన తాను వాలీబాల్ క్రీడాతో పోలీసు ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీవాకర్స్ అసోసియేషన్ వారు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మైహోం ఎస్టేట్ మేనేజర్ చెరుకు అశోక్, ఆర్.ఐ జానకిరాంరెడ్డి, అధ్యపకులు మంద శ్రీనివాస్, వేమూరి. నవీన్‌చౌదరి, జాతీయ వాలీబాల్ క్రీడాకారులు పంది కల్యాణ్, చిలుముల వెంకటేష్, తురక సాయిరాజ్, సతీష్, శ్యాం, మారుతి శ్రీనివాస్ పాల్గొన్నారు.


## ప్లాస్టిక్ రహిత సమాజానికి గ్రీన్ వాక్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరిని చైతన్యపర్చేందుకు గ్రీన్ వాక్‌లో పాల్గొడనం ఆనందంగా ఉందని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు మారం పవిత్ర అన్నారు. ఆదివారం మిర్యాల ఉమ సహకారంతో కుడకుడలోని పిఎన్ఆర్ టౌన్‌షిప్‌లో ఇంటింటికి చేతిసంచి అందజేసి మాట్లాడారు. మును ముందు తరాలు రక్షించబడాలంటే మంచి పర్యావరణం మనందరికి అందుబాటులో ఉండాలన్నారు. మన నిర్లక్ష్యంతో ముందు తరాల మనుగడ చాలా కష్టంగా మారుతుందన్నారు. ట్రస్ట్ సభ్యులు ముప్పారపు నరేందర్, డాక్టర్ తోట కిరణ్, దేవరశెట్టి నాగరాజు, ముప్పారపు నాగేశ్వర్‌రావు, గుండా కిరణ్, సోమ హేమ మాలిని తదితరులు పాల్గొన్నారు.



## నవంబర్ 2న జిల్లా ఆర్టిస్ట్స్ అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** వచ్చే నెల 2న జిల్లా ఆర్టిస్ట్స్ అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశాన్ని రామన్నపేటలో నిర్వహిస్తున్నట్లు ఆర్టిస్ట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లోజు సోమనరసింహాచారి(సుచిత్ర) తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టిస్టులందరు సకాలంలో సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఆర్టిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాల గురించి చర్చిండంతోపాటు అసోసియేషన్ అభివృద్ధికి తీసుకోవాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళిక ఉంటుందని తెలిపారు. దీంతోపాటు కార్యవర్గంలో మార్పులు, చేర్పులు ఉంటాయని తెలిపారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఎలుకల మందు తిని 50 నెమళ్లు మృతి



**చెన్నై :** తమిళనాడులో తీవ్ర విషాద ఘటన చోటు చేసుకుంది. ఓ రైతు చేసిన పనికి 50 నెమళ్లు మృతి చెందాయి. ఓ రైతు తన మొక్కజొన్న పంటను పక్షులు, జంతువుల నుంచి కాపాడేందుకు పొలం చుట్టూ ఆహార పదార్థాల్లో ఎలుకల మందుని కలిపి పెట్టారు. పొలం వద్దకు వచ్చిన నెమళ్ళు ఆ ఆహారం తిని మృత్యువాత పడ్డాయి. సుమారు 50 నెమళ్లు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. ఘటనాస్థలిని పరిశీలించి సదరు రైతుని అరెస్టు చేశారు. తెన్‌కాశీ జిల్లాలోని మీనాక్షిపురంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై జంతుప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ‘ఛత్’ తర్వాత బిహార్‌లో కాంగ్రెస్ ప్రచారం



**పాట్నా :** బిహార్‌లో ఛత్ పూజ తర్వాత కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం ప్రారంభమవుతుందని, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ భారత కూటమి తరఫున ప్రచారం చేస్తారని పార్టీ సీనియర్ నాయకుడు కెసి వేణుగోపాల్ ఆదివారం తెలిపారు. ప్రియాంక గాంధీ వాద్రా, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సహా ఇతర పార్టీ నాయకులు కూడా ఆగస్టులో జరిగిన ఓటరు అధికార్ యాత్ర పార్టీకి అవసరమైన ఊపునిచ్చిన రాష్ట్రంలో ప్రచారం చేస్తారని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థ) వేణుగోపాల్ తెలిపారు. ‘ఛత్ పూజ తర్వాత త్వరలో మా ప్రచారం ప్రారంభమవుతుంది. 29, 30 తేదీల్లో రాహుల్ గాంధీ ఇక్కడ ఉంటారని నేను భావిస్తున్నాను. ప్రియాంక గాంధీ వాద్రా, మల్లికార్జున్ ఖర్గే పర్యటనలు కూడా జరగనున్నాయి’ అని ఆయన పిటిఐతో పేర్కొన్నారు. ‘బిహార్‌లో ఎన్నికలు సాధారణ వ్యవహారం కాదు. దురహంకారపూరిత బిజెపి నేతృత్వంలోనిఎన్‌డిఎను ఓడించాలని కోరుకునే యావత్ దేశం వీటిని గమనిస్తోంది... పార్టీ కార్యకర్తలు చరిత్రను సృష్టించే దశలో ఉన్నారని గ్రహించాలని నేను కోరుతున్నా’ అని కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ అన్నారు. ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్‌ను ప్రకటించడం సానుకూల సంకేతాన్ని పంపిందని గెహ్లాట్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఒక యువ రాజకీయ నాయకుడు ఎల్లప్పుడూ కష్టపడి పనిచేయాలనే అభిరుచి కలిగి ఉంటాడు, ప్రజల అంచనాలకు తగ్గట్టుగా జీవించకపోతే, అతను తన కెరీర్‌ను పాడు చేసుకుంటున్నాడని గ్రహించి ఉంటాడు అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్, జెడి(యు) అధ్యక్షుడిపై గెహ్లాట్ మండిపడ్డారు. ‘అతను మలుపుల గురించి చాలా రాజకీయాలు చేయడం ద్వారా తన ప్రతిష్టను మసకబార్చుకున్నాడు. తన రాజకీయ జీవితం చివరి దశలో ఎంత లోతుకు దిగాడో ఆలోచించాలి. ఒకప్పుడు, ఆయన దేశ ప్రధానమంత్రి కావడానికి తగినవారని భావించారు. ఇప్పుడు బిహార్ ప్రజలు ఆయనతో విసిగిపోయారు. వారు మార్పు కోసంఓటువేయాలనుకుంటున్నారు’ అని చెప్పారు. బిజెపి అతిపెద్ద లబ్ధిదారుగా ఉన్న ఎలక్టోరల్ బాండ్ల ఉదాహరణను ఉటంకిస్తూ, బిజెపి ప్రజలను దోచుకుందని కూడా ఆయన ఆరోపించారు. అయితే ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వారు సంపాదించిన డబ్బు వారి వద్దే ఉందని, ఎన్నికల సమయంలో ఓటర్లకు లంచం ఇవ్వడానికి దీనిని ఉపయోగిస్తారని ఆరోపించారు. ఎన్నికలు ప్రకటించడానికి కొన్ని రోజుల ముందు బిహార్‌లో ఇటీవల ప్రారంభించిన పథకం కింద కోటి మంది మహిళల ఖాతాల్లోకి రూ. 10,000 బదిలీ చేయడం కూడా ఓట్లను కొనుగోలు చేసే ప్రయత్నం తప్ప మరొకటి కాదని, కానీ ప్రజలు ఆ ఆటను చూశారు అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేర్కొన్నారు.

# ‘పంచాయతీ’ ప్రతినిధులకు భత్యాలు రెట్టింపు

### రూ.50 లక్షల బీమా రక్షణ, పెన్షన్
### మహాఘట్‌బంధన్ అభ్యర్థి తేజస్వీ యాదవ్ ప్రకటన

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలవేళ ఓటర్లను ఆకర్షించేందుకు అధికార, ప్రతిపక్ష కూటమిలు రాష్ట్ర ప్రజలపై హామీల వర్షం కురిపిస్తున్నాయి. అందులో భాగంగా బిహార్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రతినిధుల భత్యాలను రెట్టింపు చేస్తామని ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్ వాగ్దానం చేశారు. వారికి రూ.50 లక్షల బీమా రక్షణ, పెన్షన్‌ను కూడా ఆయన ప్రకటించారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలో జిల్లా పరిషత్, పంచాయతీ సమితి, గ్రామ పంచాయతీ అనే మూడు స్థాయిల పాలన ఉంటుంది.. చైర్‌పర్సన్‌లను ‘ముఖియ’ (గ్రామ పంచాయతీ), ‘ప్రముఖ్’ (పంచాయతీ సమితి), ‘అధ్యక్ష’ (జిలా పరిషత్) అని పిలుస్తారు. నితీష్ కుమార్ ప్రభుత్వం జూన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్ సంస్థ కార్యనిర్వాహకులు, వార్డు సభ్యుల భత్యాలు, ఇతర ప్రయోజనాలను పెంచింది. జిల్లా పరిషత్ అధ్యక్షుల నెలవారీ భత్యాన్ని రూ.20,000 నుండి రూ.30,000, ఉపాధ్యక్షుల నెలవారీ భత్యాన్ని రూ.10,000 నుండి రూ.20,000, ‘ముఖియాలు’ (నెలకు రూ.5,000 నుండి రూ.7,500)కు పెంచారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8,053 గ్రామ పంచాయతీలు, 533 పంచాయతీ సమితులు, 38 జిల్లా పరిషత్‌లు పనిచేస్తున్నాయి. గ్రామీణ ప్రజలకు న్యాయం అందించడం కోసం ప్రతి గ్రామ పంచాయతీలో ఒక ‘గ్రామ కచహరి’ కూడా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఇండియా కూటమికి అధికారంలోకి వస్తే బిహార్ పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రతినిధుల నెలవారీ భత్యాలను రెట్టింపు చేస్తామని, రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) పంపిణీదారుల క్వింటాల్‌కు మార్జిన్ మనీని కూడా గణనీయంగా పెంచుతామని మహాఘట్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ ఆదివారం మీడియా సమావేశంలో ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పిడిఎస్ పంపిణీదారులకు కమీషన్‌గా క్వింటాల్‌కు రూ. 258.40 చెల్లిస్తున్నారు. అంతేకాకుండా, రాష్ట్రంలో క్షురకులకు, కుండల వ్యాపారంలో నిమగ్నమైన వారికి, వడ్రంగులకు రూ. 5 లక్షల వడ్డీ లేని రుణాలను అందిస్తామని కూడా హామీనిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ శాశ్వత ఉద్యోగి హోదా ఇస్తామని యాదవ్ గతంలో ప్రకటించిని విషయం విదితమే. రాష్ట్రంలో పనిచేస్తున్న ‘జీవిక దీదీలు’ సుమారు 2 లక్షల మంది ‘కమ్యూనిటీ మొబిలైజర్లకు’ ప్రభుత్వ ఉద్యోగి హోదా వారికి నెలకు రూ. 30,000 జీతం ఇస్తామని యాదవ్ ప్రకటించారు. అంతేకాకుండా, బిహార్‌లోని ప్రతి కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



**వక్ఫ్ చట్టాన్ని చెత్తబుట్టలో వేస్తాం**

ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వక్ఫ్ (సవరణ) చట్టాన్ని చెత్తకుప్పలో పడేస్తామని తేజస్వీ యాదవ్ స్పష్టం చేశారు. ముస్లిం ఆధిపత్యం ఉన్న కతిహార్, కిషన్‌గంజ్ జిల్లాల్లో బహిరంగ ర్యాలీలను ఉద్దేశించి యాదవ్ మాట్లాడుతూ తన తండ్రి, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ దేశంలో మతతత్వ శక్తులతో ఎప్పుడూ రాజీపడలేదని అన్నారు. కానీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఎల్లప్పుడూ అలాంటి శక్తులకు మద్దతు ఇస్తున్నారని, ఆ కారణంగానే ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు రాష్ట్రంలో, దేశంలో మత విద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నాయని మండిపడ్డారు. బిజెపిని ‘భారత్ జలావ్ పార్టీ’గా పిలవాలని సూచించారు. ఈ ఎన్నికలు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సోదరభావాన్ని కాపాడటానికి జరిగే పోరాటం అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు 20 ఏళ్ల నితీష్ కుమార్ ప్రభుత్వంతో విసిగిపోయారని, ముఖ్యమంత్రికి తెలివి లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంలోని ప్రతి విభాగంలోనూ అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా క్షీణించిపోయిందని ఆరోపించారు. సీమాంచల్ ప్రాంత అభివృద్ధికి ఎన్‌డిఎ ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం సీమాంచల్ అభివృద్ధి అథారిటీని ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం కేంద్రంతో పాటు ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయం నిర్మిస్తామ్నారు. నితీశ్ కుమార్ 20 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, నరేంద్ర మోదీ 11 సంవత్సరాలు ప్రధానిగా ఉన్నప్పటికీ బిహార్ దేశంలోనే అత్యంత వెనుకబడిన, పేద రాష్ట్రంగా మిగిలిపోయిందని యాదవ్ ఆరోపించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం చేస్తున్న ఎన్నికల వాగ్దానాలను కాపీ చేస్తోందని ఆర్‌జెడి నాయకుడు ఆరోపించారు.

## మరో 21 మంది మావోయిస్టుల లొంగుబాటు



**కాంకేర్ :** దేశ వ్యాప్తంగా మావోయిస్టుల లొంగుబాటు పర్వం కొనసాగుతోంది. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఆదివారం 21 మంది మావోయిస్టు కేడర్లు లొంగిపోయారు. 18 ఆయుధాలను అప్పగించినట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు. బస్తర్ రేంజ్ పోలీసులు ప్రారంభించిన ‘పూనా మార్గెమ్: పునరావాసం ద్వారా పునరావాసం’ చొరవ కింద వారు ఆయుధాలు అప్పగించారని అధికారి తెలిపారు. లొంగిపోయిన 21 మందిలో డివిజన్ కమిటీ కార్యదర్శి ముఖేష్, పదమూడు మంది మహిళా ఉగ్రవాదులు ఉన్నారు. నలుగురు డివిజన్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ఏరియా కమిటీ సభ్యులు, ఎనిమిది మంది నిషేధిత ఉద్యమం దిగువ స్థాయి సభ్యులు ఉన్నారు. వీరందరూ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) కేశ్కల్ డివిజన్ (నార్త్ సబ్‌జోనల్ బ్యూరో) కుమారి/కిస్కోడో ఏరియా కమిటీకి చెందినవారు అని అధికారి తెలిపారు. మూడు ఎకె 47లు, రెండు ఇన్సాస్ రైఫిల్స్, నాలుగు ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్స్, ఆరు .303 రైఫిల్స్, రెండు సింగిల్ షాట్ రైఫిల్స్, ఒక బారెల్ గ్రెనేడ్ లాంచర్ (బిజిఎల్)ను అందజేసినట్లు అధికారి తెలిపారు. ఈనెల 17న బస్తర్ జిల్లాలోని జగదల్‌పూర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడు రూపేష్ అలియాస్ సతీష్‌తో సహా మొత్తం 210 మంది నక్సలైట్లు లొంగిపోయారు. వీరి తలలపై రూ.9.18 కోట్ల సమష్టి రివార్డు ఉంది. వారు 153 ఆయుధాలను కూడా అప్పగించారు. 2న, బస్తర్ ప్రాంతంలోని బీజాపూర్ జిల్లాలో 103 మంది నక్సలైట్లు లొంగిపోయారు వారిలో 49 మంది రూరూ.1.06 కోట్లకుపైగా సమష్టిగా బహుమతి ఉంది.

# రక్తమార్పిడీ... ఐదుగురు పిల్లలకు హెచ్‌ఐవి

### జార్ఖండ్‌లోని సదరన్ ఆసుపత్రి సివిల్ సర్జన్ సస్పెన్షన్

**రాంచి :** జార్ఖండ్‌లో పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని సదర్ ఆసుపత్రిలో ఐదుగురు పిల్లలకు సోకిన రక్తం ఎక్కించడం ద్వారా హెచ్‌ఐవి సోకిందని ఆరోపణలు రావడంతో ఆరోగ్య అధికారుల నిర్లక్ష్యంపై ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సర్కార్ తీవ్రంగా దృష్టి సారించింది. ఈ లోపానికి కారణమైన సివిల్ సర్జన్, ఇతర అధికారులను సస్పెండ్ చేయాలని ఆదేశించింది. బాధిత కుటుంబాలకు ప్రతి ఒక్కరికీ రూ. 2 లక్షల ఆర్థిక సహాయం, ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న పిల్లలకు ఉచిత చికిత్సను కూడా ముఖ్యమంత్రి సోరెన్ ప్రకటించారు. చైబాసాలో తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు హెచ్‌ఐవి సోకిన రక్తం ఎక్కించబడుతున్నట్లు వచ్చిన నివేదికల తర్వాత, పశ్చిమ సింగ్‌భూమ్ సివిల్ సర్జన్, ఇతర సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని ఆదేశించినట్లు హేమంత్ సోరెన్ ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో తెలిపారు. సెప్టెంబర్ ప్రారంభంలో హెచ్‌ఐవి సోకిన రక్తం ఎక్కించిన వారాల తర్వాత, ఈనెల 18న ఏడేళ్ల తలసేమియా రోగికి హెచ్‌ఐవి పాజిటివ్‌గా తేలడంతో వైద్య నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. ఆ చిన్నారి కుటుంబం డిప్యూటీ కమిషనర్, రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేసింది. కాగా జార్ఖండ్ హైకోర్టు ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించి శుక్రవారం దర్యాప్తునకు ఆదేశించింది. శనివారం రాంచి నుండి ఐదుగురు సభ్యుల బృందం చైబాసాను సందర్శించి సదర్ ఆసుపత్రిలో విచారణ నిర్వహించింది. ఆ బృందంలో ఆరోగ్య సేవల డైరెక్టర్ డాక్టర్ దినేష్ కుమార్, డాక్టర్ శిప్రా దాస్, డాక్టర్ ఎస్.ఎస్. పాస్వాన్, డాక్టర్ భగత్, చైబాసా సివిల్ సర్జన్ డాక్టర్ సుశాంతో కుమార్ మాంఝీ, డాక్టర్ శివచరణ్ హన్సదా, డాక్టర్ మీను కుమారి ఉన్నారు. ఆ బృందం ఆసుపత్రి రక్తనిధి బ్యాంకు, పిఐసియు వార్డును తనిఖీ చేసి, బాధిత పిల్లల కుటుంబాల నుండి వివరణాత్మక సమాచారాన్ని సేకరించింది. దర్యాప్తు సమయంలో మరో నలుగురు పిల్లలకు హెచ్‌ఐవి పాజిటివ్ ఉన్నట్లు తేలింది. ఈ పిల్లలలో ఇద్దరు ఇప్పటికీ సదర్ ఆసుపత్రిలోని పిఐసియు వార్డులో ఉన్నారు. దర్యాప్తు తర్వాత, ఇన్ఫెక్షన్ మూలాన్ని గుర్తించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని డాక్టర్ దినేష్ కుమార్ తెలియజేశారు. పిల్లలు హెచ్‌ఐవి బారిన పడటానికి రెండు కారణాలు ఉండవచ్చని, వారికి హెచ్‌ఐవి సోకిన రక్తం ఎక్కించబడి ఉండవచ్చు లేదా బయటి వనరుల నుండి ఇన్ఫెక్షన్ వారి శరీరంలోకి వచ్చిందని, దీనిపై దర్యాప్తు జరుగుతోందని కుమార్ పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 515 మంది హెచ్‌ఐవి సోకిన రోగులు, 56 మంది తలసేమియాతో బాధపడుతున్న రోగులు ఉన్నారు. పూర్తి నివేదికను విభాగానికి సమర్పించనున్నట్లు ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా, వైద్య బృందం రక్తనిధి, ప్రయోగశాలను తనిఖీ చేస్తున్నప్పుడు అనేక లోపాలు, తీవ్రమైన అవకతవకలను కనుగొన్నారు. రక్తనిధి, ప్రయోగశాలలోని లోపాలను సరిచేయడానికి వారికి వారం రోజుల సమయం ఇచ్చామని డాక్టర్ కుమార్ చెప్పారు. ఈలోగా, రక్తనిధి రెండు నుండి మూడు రోజులు మాత్రమే అత్యవసర సౌకర్యంగా పనిచేస్తుంది.



## మన్ కీ బాత్‌లో కుమురంభీమ్‌కు ప్రధాని మోదీ నివాళి





**న్యూఢిల్లీ :** నిజాం పాలనపై తెలంగాణ పోరాట వీరుడు కుమురం భీమ్ చేసిన పోరాటాన్ని ప్రధానమంత్రి నరేం ద్ర మోదీ కొనియాడారు. 127వ మన్ కీ బాత్‌లో మా ట్లాడిన ప్రధాని, కుమురం భీమ్‌కు ని వాళులు అర్పించారు. ఆపరేషన్ సిందూర్, నక్సలిజం నిర్మూలన కోసం తీసుకున్న చర్యల కారణంగా ఈ ఏడాది పండుగలు మరింత ఉత్సాహంగా మారాయని మోదీ పేర్కొన్నారు. జిఎస్‌టిలో మార్పులు ఈ సారి పండుగ సీజన్‌లో అన్ని వర్గాల్లో సంతోషాన్ని తీసుకువచ్చాయని ప్రధాని మోదీ అభివర్ణించారు. ‘భారత్‌ను దోచుకోవడానికి బ్రిటిష్ పాలకులు అన్ని దోపిడీ మార్గాలను వాడారు. ఆ సమయంలో దేశభక్తి గల హైదరాబాద్ ప్రజల ప్రతిస్పందన వీరోచితంగా ఉంది. బ్రిటిష్ వారు నిజాం పాలనను బలపరిచారు. నిజాం పాలన అత్యంత క్రూరంగా ఉండేది. పేదలు, గిరిజనులపై నాడు జరిగిన వేధింపులు వర్ణనాతీతం. ప్రజల భూములను స్వాధీనం చేసుకున్నారు. భారీగా పన్నులు విధించారు. అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తే వారి చేతులను నరికివేశారు. అలాంటి కష్ట కాలంలో 20 ఏళ్ల కుర్రాడు ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా నిలబడ్డాడు. అతడి పేరు చెప్పబోయే ముందు, ఆ కుర్రాడి వీరత్వం గురించి తెలుసుకోండి. నిజాంపై ఒక్కమాట మాట్లాడటం కూడా నేరమే భావించే కాలంలో ఆ కుర్రాడు నిజాం అధికారి సిద్ధిఖీని బహిరంగంగానే సవాల్ చేశాడు. అమచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఈ పోరాటంలో ఆ యువకుడు సిద్ధిఖీని మట్టుబెట్టాడు. అరెస్టును కూడా తప్పించుకున్నాడు. అక్కడి నుంచి అతడు అసోంకు చేరుకున్నాడు. ఆ యువ వీరుడి పేరు కుమురం భీమ్’ అని ప్రధాని మోదీ తెలిపారు. అక్టోబర్ 22న కుమురం భీమ్ జయంతిని నిర్వహించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేవలం 40 ఏళ్లే బతికినా, ప్రజలపై చెరగని ముద్ర వేశారని చెప్పారు. నిజాంకు చాలా కాలంపాటు సవాలుగా నిలిచారని తెలిపారు. 1940లో నిజాం సైనికులు ఆయన్ను హత్య చేశారని అన్నారు. ఆయన గురించి తెలుసుకునేందుకు యువత వీలైనంత ప్రయత్నించాలని కోరుతున్నాని ప్రధాని మోదీ వెల్లడించారు. మరో ప్రముఖ గిరిజన నాయకుడు భగవాన్ బిర్సా ముండా గురించి ప్రధాని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం, గిరిజన సమాజ హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం గురించి కొనియాడారు.

## 16 మందిని బహిష్కరించిన జెడియు



**పాట్నా :** అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీలో తిరుగుబాటును అణిచివేస్తూ, బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జెడి(యు) సిట్టింగ్ ఎమ్మెల్యే, ఇద్దరు మాజీ మంత్రులు సహా 16 మంది నాయకులను బహిష్కరించింది. వీరిలో ఎక్కువ మంది అధికారిక ఎన్‌డిఎ అభ్యర్థులకు వ్యతిరేకంగా బరిలోకి దిగారు. బహిష్కరణలకు సంబంధించి శనివారం రాత్రి, ఆదివారం రెండు వేర్వేరు ప్రకటనలను జెడియు జారీ చేసింది. తిరుగుబాటు నాయకులపై పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు. జెడి(యు) సిద్ధాంతాలను ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బహిష్కరణకు గురైన వారిలో భాగల్‌పూర్ జిల్లాలోని గోపాల్‌పూర్ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే నరేంద్ర నీరాజ్ అలియాస్ గోపాల్ మండల్ ఉన్నారు. పార్టీ తనను అభ్యర్థుల జాబితా నుండి తొలగిస్తుందని తెలుసుకున్న మండల్ ఇటీవల పాట్నాలోని సిఎం నివాసం ముందు ధర్నా నిర్వహించారు. మండల్‌తో పాటు, ప్రశాంత్ కిషోర్ జాన్ సూరాజ్ పార్టీ అభ్యర్థిగా గయా జిల్లాలోని గురువా అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ సంజీవ్ శ్యామ్ సింగ్, కతిహార్ నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి హిమరాజ్ సింగ్ పేర్లు ఉన్నాయి. ముజఫర్‌పూర్‌లోని గైఘాట్ నుండి 2020లో రన్నరప్‌గా నిలిచిన మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ ప్రసాద్ యాదవ్, అతని మద్దతుదారు ప్రభాత్ కిరణ్‌లను కూడా పార్టీ తొలగించింది. వీరిద్దరూ జెడి(యు) టికెట్ గ్రీన్‌హార్న్ కోమల్ సింగ్‌కు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీరి తండ్రి పార్టీ ఎమ్మెల్సీ, తల్లి కేంద్ర మంత్రి చిరాగ్ పాస్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) ఎంపి. శనివాం 11 మంది నాయకులను జెడియు బహిష్కరించింది. బహిష్కరించబడిన సభ్యులను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుండి కూడా సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందన్ కుమార్ సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 11 మంది నాయకులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని గుర్తించిన తర్వాత పార్టీ క్రమశిక్షణా చర్య తీసుకుందన్నారు. బహిష్కరించబడిన వారిలో మాజీ మంత్రి శైలేష్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు శ్యామ్ బహదూర్ సింగ్, సుదర్శన్ కుమార్, మాజీ ఎంఎల్‌సిలు సంజయ్ ప్రసాద్, రణ్‌విజయ్ సింగ్ ఉన్నారు. ఈ పరిణామంపై జెడి(యు) సీనియర్ నాయకుడు ఒకరు మాట్లాడుతూ ‘ఈ బహిష్కరించబడిన నాయకులు పార్టీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థులకు, ఇతర ఎన్‌డిఎ కూటమి భాగస్వాములకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, పార్టీ సిద్ధాంతాలను ధిక్కరిస్తున్నారన్నారు.

# ఎస్‌ఐఆర్ ద్వారా ప్రతిపక్ష కూటమి గెలవాలని చూస్తోంది

### తమిళనాడులో ఈ చర్యలు ఫలించవు : సిఎం స్టాలిన్

**చెన్నై :** తమిళనాడులో ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ను వచ్చే వారం నుండి అమలు చేస్తామని ఇసి ప్రకటించిన నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ మండిపడ్డారు. ప్రతిపక్ష బిజెపి–ఎఐఎడిఎంకె కలిసి ప్రజల ఓటింగ్ హక్కులను లాక్కుంటూ ఎస్‌ఐఆర్ ద్వారా ఎన్నికల్లో గెలవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. పార్టీ కార్యకర్తలకు స్టాలిన్ లేఖ రాశారు. అందులో వచ్చే వారం నుండి తమిళనాడులో ఎస్‌ఐఆర్ అమలు చేయబడుతుందని ఎన్నికల కమిషన్ ప్రకటించిన విషయాన్నిఅధికారడిఎంకెఅధ్యక్షుడు ఎత్తి చూపారు. బిహార్‌లో ఇసి చేపట్టిన ప్రక్రియపై నెలకొన్న వివాదాన్ని కూడా గుర్తుచేశారు. ఆ రాష్ట్రంలో 65 లక్షల మంది తమ ఓటు హక్కులను కోల్పోయారని పేర్కొన్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమిలో కీలక భాగస్వామి డిఎంకె తమిళనాడులో కూడా ఎస్‌ఐఆర్‌ను ఎన్నికల లాభాల కోసం ఉపయోగిస్తారని విమర్శించింది. ‘బిజెపి, దాని మిత్రపక్షం ఎఐఎడిఎంకె ఎస్‌ఐఆర్ ద్వారా కార్మికవర్గ ప్రజలు, ఎస్‌సిలు, మైనారిటీలు, మహిళల పేర్లను తొలగించడం ద్వారా (2026 అసెంబ్లీ ఎన్నికలు) గెలవవచ్చని అంచనా వేస్తున్నాయి. ఎన్నికల రంగంలో ప్రజలను ఎదుర్కొనే శక్తి లేని వారు, ప్రజల ఓటు హక్కులను లాక్కొని గెలవగలమని అనుకునేవారు గుర్తుంచుకోవాల్సింది తమిళనాడు అది తప్పుడు లెక్కగా మారుతుంది’ అని ఆయన అన్నారు. డిఎంకె ఎస్‌ఐఆర్‌ను వ్యతిరేకిస్తుందని, ఓటర్ల జాబితాకు సంబంధించి ఇతర ప్రజాస్వామ్య చర్యలకు మద్దతు ఉస్తుందని, అయితే తగినంత సమయం ఇవ్వడం ఇస్తేనని చెప్పారు. డిఎంకె ఇతర ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను చట్టబద్ధంగా ఎదుర్కొంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎఐఎడిఎంకె అధినేత, ప్రతిపక్ష నాయకుడు ఎడప్పాడి కె పళనిస్వామిపై స్టాలిన్ విరుచుకుపడ్డారు. ప్రస్తుత ఈశాన్య రుతుపవనాలలో కూడా రాజకీయ మైలేజీని ఉత్పత్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి ప్రజలకు సహాయం చేయడానికి లేదా నిర్మాణాత్మకంగా ఏదైనా చేయడానికి ఆసక్తి చూపలేదని, ధాన్యం సేకరణపై ప్రభుత్వంపై ఆయన చేసిన ఆరోపణలు అబద్ధాల మూటలని నిరూపించబడ్డాయన్నారు. అబద్ధాలు, అపవాదులను విస్మరించి తాము ప్రజల కోసం పని చేస్తూనే ఉంటామని ఎంకె చీఫ్ నొక్కి చెప్పారు.



## మణిపూర్‌లో నలుగురు ఉగ్రవాదుల అరెస్టు

**ఇంఫాల్ :** మణిపూర్‌లో వివిధ నిషేధిత సంస్థలకు చెందిన నలుగురు ఉగ్రవాదులను భద్రతా దళాలు అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. అందరి అరెస్టులు శనివారం జరిగాయని వారు తెలిపారు. నిషేధిత పిఆర్‌ఇపిఎకె (ప్రో)కి చెందిన ఇద్దరు క్రియాశీల కార్యకర్తలను తౌబాల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి అరెస్టు చేయగా, నిషేధిత కాంగ్లీపాక్ కమ్యూనిస్ట్ పార్టీ (తైబాంగ్ న్గాన్బా)కి చెందిన మరొక సభ్యుడిని ఇంఫాల్ తూర్పులోని పోరోంపట్ నుండి అరెస్టు చేసినట్లు ఒక పోలీసు అధికారి తెలిపారు. అంతేకాకుండా, కాంగ్లీ యావ్ల్ కన్న లూప్ (కెవైకెఎల్)కి చెందిన ఒక క్రియాశీల కార్యకర్తను ఇంఫాల్ వెస్ట్‌లోని సింగ్జామీలోని అతని నివాసం నుండి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. భద్రతా దళాలు వారి వద్ద నుండి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి, వాటిలో హ్యాండ్ గ్రెనేడ్‌లు కూడా ఉన్నాయని అధికారి తెలిపారు.



## దేశవ్యాప్త ఎస్‌ఐఆర్ తొలివిడతపై నేడు ఇసి ప్రెస్‌మీట్

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు భారత ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి సోమవారం మ ధ్యాహ్నం 4.15 గంటలకు ఎన్నికల కమిషన్ మీడియా సమావేశం ఏర్పాటు చేస్తోంది. 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలతో సహా 10 నుంచి 15 రాష్ట్రాల్లో తొలి విడత ఎస్‌ఐఆర్ నిర్వహించే తేదీలను ఈసీ ఈ సందర్భంగా ప్రకటించే అవకాశం ఉంది. ఇసి వర్గాల సమాచారం ప్రకారం, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో సాధ్యమైనంత త్వరగా ఎస్‌ఐఆర్‌ను పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ భావిస్తోంది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరిలో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నందున తొలి విడత ఎస్‌ఐఆర్‌లో ఆ రాష్ట్రాలు చోటుచేసుకోనున్నాయి. అయితే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతున్న, జరగడానికి సిద్ధంగా ఉన్న రాష్ట్రాల్లో ఎన్నికల అధికారులు తలమునకలై ఉంటారు కావున వాటి జోలికి వెళ్లరాదని భావిస్తోంది. బిహార్‌లో ఇటీవలే ఎస్‌ఐఆర్ ప్రక్రియను ఎన్నికల కమిషన్ పూర్తి చేసి ఓటర్ల జాబితాను ప్రచురించింది. సెప్టెంబర్ 30వ తేదీ నాటికి తుది జాబితాలో 7.42 కోట్ల ఓటర్లు చోటుచేసుకున్నారు. నవంబర్ 6,11 తేదీల్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 14న ఫలితాలు వెలువడనున్నాయి.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS10UA 8377 | Mothe Srinivas | MARUHTI RITZ DIESEL-P | 2016 |
| 2 | TS03UC 5465 | Rajesh Mathangi | EICHER PRO 1110FBT | 2019 |
| 3 | TS12EY 8713 | Kranthi Kumar Vadlakonda | ETIOS | 2014 |
| 4 | AP29V 5008 | Ravindar Guguri | EICHER 11.10 FBT | 2010 |
| 5 | TS03UA 0770 | Jella Nagaraju | EICHER PRO 1110 FBT | 2014 |

AUCTION DATE: 28-10-2025

VENUE : SHRIRAM AUTOMALL KARIMNAGAR, ALUGUNURU, HYDERABAD ROAD, KARIMNAGAR

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No :12-209/1,1st floor, Upstairs of Telangana Grameena Bank, Warangal Road, Huzurabad. Cell : 9866244432




# సామాజిక సంఘర్షణలే 'కొకు' అక్షరాలు

తెలుగు సాహిత్యంపై తమదైన ముద్ర వేసిన కొద్దిమంది రచయితల్లో 'కొకు'గా సుప్రసిద్ధులైన కొడవటిగంటి కుటుంబరావు ముందు వరుసలో నిలుస్తాడు. ఆయన రచనలు.. సామాజిక సంఘర్షణలకు ప్రతిరూపాలు. కథలు లేదా నవలలు.. కొకు ఏవి రాసినా, వాటిలో సామాజిక స్పర్శ ఉంటుంది. అవి సామాజిక వాస్తవికతకు స్పష్టమైన చిహ్నాలు. గ్రామీణ జీవనం, కష్టాలు, విద్యాభావం, వలసపాలన సృష్టించే వెతలు ప్రధానంగా కొకు రచనల్లో కనిపిస్తాయి. కుటుంబ సంబంధాలు, పేదలే లక్ష్యంగా జరుగుతున్న దాడులు ఆయన ప్రతి అక్షరంలోనూ సాక్షాత్కరిస్తాయి. సమాజాన్ని ప్రశ్నిస్తాయి. ఈ అంశాలు కథల గమ్యాన్ని మాత్రమే కాదు, పాఠకుడి వ్యక్తిగత అభిరుచులను కూడా ప్రభావితం చేయగల స్థాయిలో, బలమైన వాదన వినిపిస్తాయి. ఆయన అక్షరాలలో గిరిజనుల జీవితాలు.. పల్లె ప్రాంతాలు పలకరిస్తుంటాయి. బలహీన వర్గాల వేదన, రోదనలు వినిపిస్తుంటాయి. ఆయన నవలలు సాధారణంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ వాస్తవాలను ఆవిష్కరించడమే కాకుండా, మానవ మనస్తత్వాల లోతులను వెలికితీసే ప్రయత్నం చేస్తాయి. ఆయన రచనలు వాస్తవవాద ధోరణిలో ఉంటాయి. కేవలం వాస్తవాన్ని చిత్రించడంలోనే కాదు, దాని వెనుక ఉన్న భావజాలాలను, శక్తి సంబంధాలను కూడా ప్రశ్నిస్తాయి. ఆయన సాహిత్యంలో చదువు, విద్య సంబంధిత అంశాలు.. సామాజిక అన్వేషణలు అప్రతిహతంగా పరుగులు తీస్తాయి. ఆయనది సజీవ భాషా శైలి. మానవతా విలువలు, క్షమా, దయ, సహనం వంటి లక్షణాలు అక్షరాలుగా మారుతాయి. వర్గ సంఘర్షణలను, పోరాటాలు అత్యంత శక్తివంతంగా వర్ణించిన అరుదైన రచయితల్లో కొకు ఒకరు. గ్రామీణ జీవిత పరిస్థితులను హద్దులు చెదరకుండా, చరిత్ర, రాజకీయ నేపథ్యాల వాస్తవికతలు చెదరకుండా, స్పష్టత కోల్పోకుండా రాయడం కొకుకు మాత్రమే చెల్లుతుంది. అందుకే ఆయన రచనలు పాఠకుడి మనస్సులో రంగుల పరిమళాలను అద్దుతాయి. అయన ఎంచుకునే పాత్రల అభిప్రాయాలు, తీసుకునే నిర్ణయాలు కథా గమనాన్ని వేగవంతం చేస్తాయి. సంకల్పాలు, ఆశయాలు, సంభాషణలు సజీవంగా, సామాజిక చర్చలతో పాటు కొలతపెట్టినట్టు సమతూకంలో వాడే పదాలు... చేసే వర్ణనలు.. రచనలకు కొత్త సొబగులు సంతరించుకుంటాయి. సామాజిక న్యాయం పట్ల నిబద్ధతతో గ్రామీణ జీవితాల్లోకి తొంగి చూస్తాడు కాబట్టి, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులను అనుభవించగలుగుతాడు. అందుకే, ఆయన రచనల్లో పాత్రలు, సన్నివేశాలు వాస్తవికతకు చాలా దగ్గరగా ఉంటాయి. వీటిని ఎంతో సరళంగా, అర్థవంతమైన దృశ్య నిర్మాణ నైపుణ్యంతో వివరించడం కొకు ప్రత్యేకత. ఆయన ఎంచుకునే వాక్యాల్లో పదాల లయ.. స్వర అనుకరణలు కథనాన్ని వేగంగా నడిపిస్తాయి. మిగతా భావనలతో అనుసంధానిస్తాయి. ఆయన రచనల్లో సాధారణ వ్యక్తులే ప్రధాన పాత్రలు. కానీ వారి ఆలోచనలలో తీవ్రత, ధైర్యం, సంకల్పం కనిపిస్తుంది. పిడికెడు సంఘర్షణల్లో వారు తలచుకునే అంశాలు, పునరుద్ధరణల ప్రత్యామ్నాయాలు కథా గమనాన్ని కొత్త పుంతలు తొక్కిస్తాయి. పాత్రల మధ్య సంబంధాలు, కుటుంబ పరిమళాలు, వృత్తివంతమైన ఆశయాలు వంటి అంశాలు స్వభావికతను పెంచుతాయి. పాఠక అనుభవాన్ని బలపరుస్తాయి. అక్షరాలను ఆయుధంగా చేసుకొని, సామాజిక సమస్యలపై చర్చలు.. మార్పు కోసం విధానా




ల రూపకల్పనలకు కొకు చేసిన ప్రయత్నాలు భావి తరాలకు మార్గదర్శకాలు. నవలల్లో మార్క్సిస్ట్ భావజాలం ప్రతిఫలిస్తుంది. వర్గ పోరాటం, ఉత్పత్తి సంబంధాలు, విద్య, యు ఆర్థిక శక్తుల మధ్య సంబంధం వంటి అంశాలు ప్రాముఖ్యత పొందుతాయి. ఆయన దృక్పథం బోధాత్మకం కాకుండా విశ్లేషణాత్మకంగా ఉంటుంది. సమస్యలు లేదా సామాజిక రుగ్మతలను సామాన్య మనుష్యుడి దృష్టితో చూపడం ద్వారా సాహిత్యానికి ఆయన కొత్త అర్థాన్ని ఇస్తాడు. దశలు దశలుగా అవగాహన కల్పిస్తాడు. అందుకే, ఆయన రచనలు చదివేటప్పుడు, ప్రాంతీయ ప్రాదాన్యతను, సమాజ రూపాన్ని, నిత్యంత వెంటాడే సమస్యలను అర్థం చేసుకునే దృష్టికోణాన్ని అలవరచుకోవాలి. అప్పుడే పాత్రలు తీసుకునే నిర్ణయాలపై స్పష్టత వస్తుంది. పాత్రల్లోకి రచయితలు చొచ్చుకుపోవడాన్ని తరచు చూస్తునే ఉంటాం. కానీ, కొకు మాత్రం పాత్రల వ్యక్తిత్వాలను, ఆలోచనలను, వారు అనుసరించే పంథాలను బలవంతంగా మార్చే ప్రయత్నం చేయడు. ఆయా పరిస్థితులకు అనుగుణంగానే పాత్రలు వ్యవహరిస్తాయి. నిర్ణయాలు తీసుకుంటాయి. అందుకే, ఆయన కథలు లేదా నవలల్లో రచయిత కాదు. .. పాత్రలే కనిపిస్తాయి. స్థానిక పదజాలంతో అవి పలకరిస్తాయి. ప్రత్యేకలు వినిపిస్తాయి. కొకు భాష స్పష్టంగా, సూటిగా ఉంటుంది. అలంకారముకంటే వాస్తవానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాడు. 20వ శతాబ్దపు మధ్య భాగంలో వెలిసిన సామాజిక వాదాలు.. గ్రామీణ జీవితానికి సంబంధించిన సమగ్ర చిత్రాలుగా ఉంటాయి. ఆయన రచనలు ఆంధ్రా కళా సాహిత్య నియమాలలో సామాజిక పరిణామాలతో అనుసంధానమవుతాయి. ఈ కారణంగానే ఆయన కథలు గ్రామీణ జనజీవితంలోని కష్టాలు, పేదరికం, సామాజిక అసమానతలు, వర్గ విభేదాలు, పాఠకుడికి స్పష్టంగా పరిచయం అవుతాయి. అద్భుతమైన పాత్రల నిర్మాణం సహజంగానే సామాజిక సమస్యల పరిష్కారాన్ని ప్రధానాంశంగా సూచిస్తుంది. శాసిస్తుంది. స్వాతంత్ర్య సమరం నుంచి సామాజిక న్యాయం వరకూ.. ఆధునిక భారతీయ మానవత్వ భావనల నుంచి సామాన్యుడి కష్టాల వరకూ, ఎన్నో అంశాలు ఆయన రచనల్లో ఇమిడిపోయాయి. స్వతంత్ర భావోద్వేగాలు పాత్రల జీవితాల్లో ప్రతిబింబిస్తాయి. ఆధునిక సమాజంలో మనం కోల్పోతున్న సంప్రదాయలు, కుటుంబ బంధాలు, ఆత్మీయత, అనురాగాలు దీనంగా చూస్తుంటాయి. పాఠకుడిని ఆలోచింప చేస్తాయి. ఆయన కథలలో పేద ప్రజలు, రైతులు, చిన్న వ్యాపారులు అనుభవించే ఆర్థిక ఇబ్బందులు విలయతాండవం చేస్తుంటాయి. గ్రామీణ పరిసరాల ప్రతిబింబాలుగా దర్శనమిస్తుంటాయి. కథల్లో స్త్రీ పాత్రలు సంస్కృతిలో, ఆర్థికంగా, సామాజికంగా తమ హక్కుల కోసం పోరాడుతుంటాయి. మహిళా చైతన్యానికి ప్రతీకలుగా నిలుస్తాయి. నూతన భావాలతో కూడిన స్త్రీవాదానికి పునాదులు వేసిన రచయితల్లో కొకు అగ్రగణ్యుడు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కులు, శ్రామికుల కష్టాలు.. ఇలా సమాజంతో ఆయన రచనలు సమేకమవుతాయి. అందుకే, ఆయన కథలు ప్రబలమైన సామ్యవాద ధోరణిపై ఆధారపడినట్లు ఉంటాయి. ఆయన పాత్రలు, సన్నివేశాలు సాధారణ ప్రజల ఒత్తిళ్లు, వారిని కాపాడే ఉద్యమాల చుట్టూ తిరుగుతాయి. ప్రజా జీవితాల అస్తిత్వాన్ని గాఢంగా ప్రతిబింబిస్తాయి. కొకు తన సాహితీ ప్రస్థానానికి మానవత్వం, సామాజిక బాధ్యతను రెండు చక్రాలుగా చేసుకున్నాడు. ఆర్థిక తేడాలు.. వర్గ విభేదాలు లేని సమాజాన్ని కోరుకున్న కొకు, తన సిద్ధాంతాన్ని ఎన్నడూ విడిచిపెట్టలేదు. అందుకే, తెలుగు సాహిత్యంపై అంతలా ముద్ర వేయగలిగాడు. కలకాలం నిలిచిపోయే యశస్సును పొందగలిగాడు.

**– సత్యశ్రీ**


"సృష్టిలో 'బుద్ధి' అనే మూడో కొలత ఉందని వాదించిన సుప్రసిద్ధ తెలుగు రచయిత, హేతువాది కొడవటిగంటి కుటుంబరావు (కొకు) తన యాభై ఏళ్ళ రచనా జీవితం లో విస్తారంగా రచనలు చేసాడు. జగత్తులో స్థలము (స్పేస్), కాలము (టైమ్) అనే రెండు కొలతలు ఉన్నాయన్నది అందరికీ తెలుసు. కానీ, మూడో కొలతగా బుద్ధి పని చేస్తుందని కొకు ప్రతిపాదించాడు. దీనినే 'బుద్ధి కొలత వాదం'గా పేర్కొన్నాడు. మరో వైపు రచయితగా ఉన్నత శిఖరాలు అధిరోహించాడు.'చందమామ' ను ఇంటింటి పత్రికగా తీర్చిదిద్దిన ప్రముఖులలో ఒక డు. సమకాలీన మానవ జీవితాన్ని పరామర్శించడం... సామాజిక రుగ్మతలను విమర్శించడం ఆయన నైజం. సగటు జీవి జీవితాన్ని సుసంపన్నం చేసేదే నిజమైన సా హిత్యమని నమ్మాడు. ఆచరణలో చూపాడు. గుంటూరు జిల్లా, తెనాలిలోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కు టుంబంలో జన్మించిన ఆయన, 1925 వరకు తెనాలి లో పాఠశాల విద్య అభ్యసించాడు. చిన్నతనంలోనే తల్లితండ్రీ మరణించడంతో మేమమామ వద్ద పెరిగాడు. దీనితో ఆయన చిన్నతనం గ్రామీణ జీవితంతో పెనవేసుకుపోయింది. కవీ, రచయితా అయిన అన్నయ్య వెంకటసుబ్బయ్య స్ఫూర్తితో సాహితీ రంగ ప్రవేశం చేసిన కొకు, పదమూడేళ్ళ లేత వయసులోనే కొన్ని పద్యాలు, ఒక అసంపూర్ణ థ్రిల్లరు నవలా రాసాడు. కానీ, కొద్దికా లం విరామం తీసుకున్నాడు. గుంటూరు ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాక, 1927–29 కాలంలో మహారాజా కళాశాల, విజయనగరంలో బిఎ ఫిజిక్సు చదివాడు. ఈ కాలంలోనే రచనా వ్యాసంగాన్ని సీరియస్‌గా మొదలుపెట్టాడు. బిఎ పూర్తయ్యే నాటికి నాస్తికునిగా మారిపోయాడు. అనంతరం కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో ఎంఎస్‌సి ఫిజిక్స్‌లో చేరా డు. 1930లో కొకు తొలి రచన 'సినిమా ఓరియంటల్ వీక్లీ'లో ప్రచురితమైంది. 'ప్రాణాధికం' పేరుతో ఆయన తొలి కథ గృహలక్ష్మి మాసపత్రికలో అగ్రస్థానం పొం దింది. అంతర్జాతీయంగా అలుముకున్న ఆర్థిక సంక్షోభం కారణంగా ఎంఎస్‌సి రెండో సంవత్సరంలోనే చదువు ఆగిపోయింది. 1931లో కొంతకాలం పాటు వ రంగల్‌లో నివాసం ఉన్నాడు. అప్పట్లో పిల్లలకు ప్రైవేట్లు చెప్పాడు. చక్రపాణి, పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి, పిల్లలమర్రి సాంబశివరావులతో కలిసి యువ ప్రెస్‌ను స్థాపిం చి యువ పత్రికను ప్రారంభించాడు. కొంతకాలం 'ఆంధ్ర పత్రిక'లో పని చేసాడు. ఆ కాలంలో జరుక్‌శాస్త్రి (జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి) ఆయనకు సహోద్యోగి. 1942లో నాలుగు నెలల పాటు ఒక లోహపు కర్మాగారంలో పనిచేసాడు. 1942 జులై నుండి 1943 జనవరి వరకు సిమ్లాలో జాతీయ యుద్ధ ప్రచారక సమితిలో కా పీరైటరుగా పనిచేసాడు. 1944లో ఒడిషా జయపూరు లో ఆరు నెలలపాటు ఇన్‌స్పెక్టరేట్ ఆఫ్ మెటల్ అండ్ స్టీల్‌లో ఫోర్మన్‌గా పని చేశాడు. మూడు నెలలు బొంబా యి ఎయిర్ ఇండియా కార్యాలయంలో క్లర్కుగా పనిచేసాడు. 1952, జనవరి 1 నుండి చనిపోయే వరకూ చం దమామలో పనిచేసి ఆ పత్రిక అత్యున్నత స్థితికి రావటానికి ఎంతో కృషి చేశాడు.




## 'చదువు'కోవాల్సిన పుస్తకం




కొడవటికంటి కుటుంబరావు (కొకు) రాసిన నవల్లో పెద్దది 'చదువు'. ఈ నవల పేరు సాదాసీదాగా కనిపించినా, దీని ద్వారా కొకు సమాజపు వివిధ కోణాలను చూపించాడు. వివిధ కుటుంబాలు... వివిధ నేపథ్యాలు. ఒకొక్కరిదీ ఒక్కో ఆలోచన. నవలలో రచయిత ప్రస్తావించిన కుటుంబాల్లో శ్యామల కుటుంబం ఒక్కటే మద్రాసు (నేటి చెన్నై) నగరంలో ఉంటుంది. మిగతావన్నీ గ్రామీణ, వ్యవసాయ కుటుంబాలే. కథా నాయకుడు సుందరం, అతని తల్లి సీతమ్మ చుట్టూ తిరుగుతుంది. సుందరం అంతర్ముఖుడు. సీతమ్మ తరం నుంచి ఆమె మనుమడు (సుందరం కొడుకు) అక్షరాలు నేర్చుకోవడం ప్రారంభించడం వరకూ కథ కొనసాగుతుంది. తరాల మధ్య అంతరాలను రచయిత గొప్పగా ఆవిష్కరిస్తాడు. అంతరాల కారణంగా ఏర్పడిన స్పర్థలు.. అంతరాలు.. సంఘర్షణలు పాఠకులను ఆలోచింప చేస్తాయి. మధ్యతరగతిలో ఘర్షణ సాదాసీదాగానే ఉంటుందనేది వాస్తవం. అందుకే భూస్వామ్య, ధనస్వామ్య వ్యవస్థలకు ప్రాతినిథ్యం వహించే పాత్రల మధ్య, భావాల మధ్య ఘర్షణను కొక అత్యంత తీవ్ర రూపంలో చిత్రీకరించలేదని అభిప్రాయపడతారు ఈ నవలకు ముందు మాట రాసిన కేతు విశ్వనాథ రెడ్డి. అయితే, రెండు దశాబ్దాల కాలంలో చోటు చేసుకున్న మార్పులు.. పరిణామాలు.. ఆలోచనల్లో వైరుధ్యాలను అద్భుతంగా చిత్రీకరిస్తాడు రచయిత. అందుకే దీనిని సంఘ చారిత్రాత్మక నవలగా, ఆత్మ చరిత్ర నవలగా అభివర్ణిస్తారు కెవి రమణారెడ్డి ఒక విశ్లేషణలో. ఇది కొకు ఆత్మకథా నవల కావచ్చని 'అంపశయ్య నవీన్' అభిప్రాయపడ్డారు. కాత్యాయని విద్మహే 'చదువు'ను కొకు ప్రాతినిధ్య నవలగా పేర్కొన్నారు. టిజిఆర్ ప్రసాద్ కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తారు. ఈ నవల్లో రచయిత స్వీయ అనుభవాలు ఎక్కువగా ఉన్నాయని



చెప్తారు. అయితే, ఇది తన ఆత్మకథా నవల కాదని ప్రసాద్‌కు కొకు తన చివరి ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. నాటి సమాజిక పరిస్థితులకు, చరిత్రకు అధిక ప్రాధాన్యం ఇచ్చానని స్పష్టం చేశాడు. చాలా వరకూ తాను చూసిన అంశాలనే ప్రస్తావించిట్టు వివరిస్తాడు. 'ఘోరకలి'కి ముందు రెండు దశాబ్దాల సాంఘిక వాతావరణాన్ని చిత్రీకరించడానికి ప్రయత్నించినట్టు మరో సందర్భంగా చెప్తాడు కొకు. ఎంతో మంది చేసిన విశ్లేషణలు... వెలిబుచ్చిన అభిప్రాయాలు అక్షరసత్యాలని 'చదువు' చదివితే స్పష్టమవుతుంది. కొకు పరిశీలనా సామర్థ్యానికి, కథాగమనాన్ని పరుగులు తీయించే విధానానికి, లోతైన మానసిక అధ్యయనాలతో పాత్రలను మలచే చాతుర్యానికి ప్రతీకగా నిలిచిన ఈ నవల తప్పక 'చదువు' కోవాల్సిన పుస్తకం.


### పుస్తకం పేరు

చదువు
రచయిత: కొడవటికంటి కుటుంబరావు
వెల: రూ.180

ప్రతులకు

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## జీవిత పాఠాలు నేర్పే 'దిల్ పే దస్తక్'




దక్షిణ పంజాబ్ ప్రాంతానికి చెందిన ప్రసిద్ధ రచయిత జుల్ఫికార్ అలీ బుఖారీ సరికొత్త ఉర్దూ పుస్తకం 'దిల్ పే దస్తక్' జీవిత సత్యాలు వివరిస్తుంది... పాఠాలు నేర్పిస్తుంది. జీవితం కష్ట సమయాలను ఎదుర్కొంటున్నప్పుడు, మనసుకు హత్తుకునే మాటలతో ఇది హృదయానికి స్వాంతన చేకూరుస్తుంది. ఈ పుస్తకంలో జీవిత అనుభవాలు, విజయ నిబంధనలు, సానుకూల ఆలోచనలు అక్షర రూపంలో నిక్షిప్తమై కనిపిస్తాయి. పాఠకులను పలకరిస్తాయి. ఎంతటి కష్ట సమయంలోనైనా సంయమనం కోల్పోకూడదనే ఆలోచనను ప్రేరేపించే ఈ పుస్తకం కేవలం యువతకు మాత్రమేకాదు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కూడా మార్గదర్శకం. ఇది పుస్తకాలు సేకరించే వారికి అత్యంత విలువైన ఆస్తిగా మారుతుంది. ఏ వయసువారైనా ఈ పుస్తకాన్ని చదవుకోవచ్చు. ప్రేరణ పొం దవచ్చు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడంలో ఈ పుస్తకం ఒక మంచి స్నేహితుడిలా ఉంటుంది. దీనిని చదివిన వెంటనే ఆలోచనలు కొత్త పంథాలు పరుగులు తీస్తాయి. ధైర్యం రెట్టింపు అవుతుంది. జీవితంపై కొత్త ఆశలు పుట్టుకొస్తాయి. ఇందులో ని మాటలు, అనుభవాలు, ఆలోచనలు మన జీవితానికి కొత్త వెలుగులు పంచుతాయి.

## ఇక బాల సాహిత్యానికీ 'చిల్డ్రన్స్ బుకర్ ప్రైజ్'

**లండన్:** ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మక సాహిత్య బహుమతులలో ఒకటైన బుకర్ ప్రైజ్ ఇప్పుడు బాల సాహిత్యానికి కూడా వర్తిస్తుంది. ఈ విషయాన్ని ఈ బహుమతిని ప్రదానం చేసే బుకర్ ప్రైజ్ ఫౌండేషన్ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ బహుమతి పిల్లల కోసం రాసిన ఉత్తమ కథాసాహిత్యానికి అందిస్తారు. విజేతల ఎంపికను ప్రత్యేక జడ్జింగ్ కమిటీ చేస్తుంది. ప్రతి ఏడాది ఫిక్షన్ రచనలకు 50,000 పౌండ్ల పురస్కారం ఇస్తున్నారు. అదే తరహాలో, ఇకపై బాల సాహిత్యం విభాగంలోనూ బహుమతి ప్రదానం ఉంటుంది. మొదటి 'చిల్డ్రన్స్ బుకర్ ప్రైజ్' కోసం నామినేషన్లు 2026లో ప్రారంభమవుతాయి. 2027 నుండి ప్రతీ ఏడాది ఈ బహుమతి అందచేస్తారు. 8 నుండి 12 సంవత్సరాల పిల్లల కోసం ఆంగ్లంలో రాసిన లేదా ఆంగ్లంలోకి అనువదించిన ఆధునిక కథాసాహిత్య రచనలకు ఇది వర్తిస్తుంది. ఈ పుస్తకాల ప్రచురణ యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె) లేదా ఐర్లాండ్‌లో జరిగి ఉండాలన్న నిబంధన ఉంది. రెండు దశాబ్దాల కాలంలో తీసుకున్న




అత్యంత సాహసోపేతమైన నిర్ణయంగా పిల్లల విభాగంలో బహుమతిని బుకర్ ప్రైజ్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ గాబీ ఉడ్ చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యాలు. ఇలాంటి ప్రతిపాదనను కూడా ఫౌండేషన్ ఇప్పటి వరకూ తీసుకురాలేదు. అయితే,పిల్లల కోసం రాసిన భవిష్యత్ క్లాసిక్స్‌కి ప్రోత్సాహం ఇవ్వడం, యువతను పఠనంపైన ఆసక్తి కలిగించడం, భవిష్యత్ తరాలకు పఠన సంస్కృతిని అందించడం వంటి లక్ష్యాలను సాధించడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని గాబీ పేర్కొంది. ఈ బహుమతికి ఎఒకె ఫౌండేషన్ (ఒక విద్యా సేవా సంస్థ) మద్దతు ఇస్తోంది. ఈ సంస్థ కనీసం 30,000 ప్రతులను పిల్లలకు బహుమతిగా అందిస్తుంది, తద్వారా ప్రపంచంలోని ఉత్తమ కథాసాహిత్యం మరింత మంది పిల్లల చేతుల్లోకి చేరుతుంది. గతంలో బుకర్ ప్రైజ్ పొందిన ప్రముఖ రచయిత, ఫ్రాంక్ కాట్రెల్ బాయిస్ ఈ తొలి చిల్డ్రన్స్ బుకర్ ప్రైజ్ జ్యూరీకి అధ్యక్షుడిగా ఎంపికయ్యాడు. ఆయనతో పాటు సీనియర్స్ విభాగంలో ఎంపిక జరిపేందుకు ఏర్పడిన కమిటీలోని ఇద్దరు సభ్యులు కూడా పిల్లల విభాగంలో విజేత ఎంపిక ప్రక్రియను కొనసాగిస్తారు. ఈ జ్యూరీ అందిన పుస్తకాలను వడబోసి, ఎనిమిది పుస్తకాలను షార్ట్‌లిస్ట్ చేస్తుంది. ఆ తర్వాత ముగ్గురు పిల్లలు జడ్జిలు వివిధ పాఠశాలలు, సాంస్కృతిక సంస్థల సాయంతో మరింత ప్రక్షాళన జరిపి, తుది విజేతను ఎంపిక చేస్తారు.

## ఆ యువ కవి.. పాటల గని..



సమ్మయ్య.. కొత్తగా పరిచయం చేయాలంటే, పోచయ్య, మదనమ్మ సంతానం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా.. వేల్లంపల్లి గ్రామం. కానీ, సాహితీ తోటలో విహరిస్తూ, ఎన్నెన్నో ఆలోచింపచేసే పాటలు రాసిన 'పుల్లూరి' సుపరిచితుడే. అతని కలానికి సామాజిక సమస్యలు తెలుసు. బాధలు.. కష్టాలు.. కన్నీళ్లూ తెలుసు. అలాగని గరిగీసుకొని కూర్చోలేదు. ప్రయోగాలకు కొదువ లేదు. ప్రణయాన్ని.. ప్రణవాన్ని ఒకే రీతిలో పండిస్తున్న యువకవి పుల్లూరి మాటల ఖని.. పాటల గని.

**' కూడు గుడ్డకు దూరం చేసావు నా కన్నా కొడుకా**
**కుక్క కంటే హీనంగా చూసావు నా కన్నా బిడ్డ**
**కన్నోళ్లు అన్న సంగతి మరిచావు నా కన్నా బిడ్డ**
**కష్టాల ఊబిలో వేశావు నా కన్నా కొడుకా**
**గూడును మేడలు అన్ని గుంజుకున్నావో.**
**పస్తులే ఆస్తులుగా నాకు ఇచ్చినావు'** అంటూ సాగే పాటలో, ఇంటికి దూరంగా వెళ్లిన పిల్లల నిరాదరణకు గురైన వేలాది మంది తల్లిదండ్రుల గొంతులు వినిపిస్తాయి. మనసును కదిలిస్తాయి. వయసు ఉడిగి.. శక్తి తరిగి... ప్రశాంతంగా కాటికి చేరే పరిస్థితి కూడా లేకపోవడాన్ని మించిన దారుణం ఏముంటుంది? ఆ తల్లిదండ్రుల అసహాయ ఆక్రందనలకు సమాధానం ఎక్కడ ఉంటుంది? అందుకే..

**'మరణం వచ్చిన బాగుండురో నా కన్నా కొడుకా**
**ఈ నరకాయాతన వదలేనురో నా కన్నా బిడ్డ'** అనిపిస్తాడు రచయిత. ఈ పాట మొత్తం అదే ఆర్తితో కొనసాగుతుంది. ఆ'వేదన' మనసును మెలివేస్తుంది. ఇది ఏ ఒక్కరి బాధో కాదు.. ఏ ఒక్కరికో పరిమితం కాలేదు. అందుకే బాధ్యత అతని కలమైంది. ఆర్ద్రత సిరాగా మారింది. అక్షరాలతో గుండెలు కోసే పుల్లూరిలో మరో కోణం కూడా ఉంది.

**'అడవిలో నేనొక మొక్కై మొలసిన బాగుండునేమోరా**
**ఈ అడివి అమ్మ ఒడిలోన పువ్వాయి పూసిన జన్మ ధన్యము రా**
**సల్లగాలి తాకుతుంటే నాకు తల్లిపిలిసినట్టు ఉండే**
**పాటకు పురుడున పోసిన కోయిల రాగాల బాణీలు వింటూ ఉంటే'**

అంటూ తన మనస్సును ఆవిష్కరిస్తాడు ఓ పాటలో.

**'తెల్లవారుజామున అలుకేసినట్లు మంచు కురిసి; మురిసి పోయెను**
**వాకిట్ల నిండారాముగ్గేసి నట్టు పొద్దు పలకరించుతుంటది**
**ఎండిన పండిన ఆకుల్లో దాగిన ఆశయాల సారాన్ని చూస్తే.....'**

అంటూ తత్వాన్నీ బోధిస్తాడు.

కల్లు సీసాలో ఏ మహత్యం ఉందని ఒక పాటలో ప్రశ్నిస్తే.. భర్తలను భార్యలే హత్య చేయిస్తున్న వైనాన్ని మరో పాటలో నిలదీస్తాడు. ఇరుకు చట్రాలను బిగించుకోకుండా, స్వేచ్ఛగా కదలాడే అతని మనసుకు హద్దులు లేవు. పాటలకు పరిమితులు లేవు. అందుకే ఆ యువకవి పాటల గని.

**— అంబాల రజనీకాంత్**

ఈ వారం కవితలు

### ఆళ్వార్‌కు అక్షర నివాళి

నల్లగొండ జిల్లా చెరువు మాదారంలో
మెరిసిన మందారమా..!
జోహార్ జోహార్ ఆళ్వారు
అందుకో జోహార్ ఆళ్వారు
ప్రజల మనిషివి నీవు ఆళ్వారు
పోరాట వీరుడా..ప్రజాభిమానుడా..!
అందుకో మా అక్షర నివాళి

రాచరికంపై వజ్రాయుధం నీవు
పాలకులకు భయం ఆళ్వారు
పరిపాలకులకు నీవు తల్వారు
స్వార్థమెరుగనివాడా నిస్వార్థ జీవుడా..!
నిండు జోహార్లు ఆళ్వారు..!
నీకు నిత్య నివాళి ఆళ్వారు

అలుపెరుగని యోధుడా.. ఆజానుబాహుడా.!
భయమెరుగని భల్లూకమై..
కరువు లేని రాజ్యంకై కలమెత్తిన మొనగాడా
అమరుడా..! ఆళ్వార్ అందుకో మా జోహార్లు
ఇవే ఇవే మా జోహార్లు

అక్షరాలకు పదును పెట్టి జనచేతన చేసినావు
నిజాం రాజులను గడగడలాడించి
నియంత పాలకుల నిప్పులతో కడిగినావు
ఉద్యమకారుడా.. పాత్రికేయుడా.!
లాల్ సలాం లాల్ సలాం
శ్రమజీవుల లాల్ సలాం

అక్రమాల పీడనపై తిరుగుబాటు తిలకమై
ప్రజల ఆస్తుల దోపిడిక సాగదని చెప్పినోడా
నిప్పుల వంతెన దాటి గమ్యం ముద్దాడినోడా
కడుపేద జీవితం సాగదీసినావు
నజహృదయ ఫలకపై సంతకమై నిల్చావు
అమరుడా..! ఆళ్వార్ అందుకో దండాలు
అక్షర సేద్యుడా.! అందుకో నివాళి

**– అంబర్కర్ మణికంఠ**

### స్వప్నం

జీవితం చిత్రపటంలో
మనం గీసుకున్నట్టు
తెల్లని కాగితంపై
గుండ్రటి అక్షరాలతో
లిఖించుకున్నట్లో ఉండదు

జీవితం ఆకాశ వీధుల్లో
మనం విహరిస్తున్నట్టు
నిదురిస్తున్న
మన కంటిపాపపై
స్వప్నమేదో తడిమేస్తున్నా
మన చెయ్యి దాటితే
చెయ్యగలిగేదేమి ఉండదు

అమాయకత్వాన్ని
నింపుకుంటేనో
అసూయతో గుండెను
బరువెక్కిస్తేనో
అనుమానంతో
నలిగిపోతేనో
అసమాధానంతో
అలసిపోతుంటేనో
జీవితమనే నదిలో
ఒడ్డుకు చేరుకోలేవు

కష్టం, నష్టం, ఇష్టం,
బాధ, భయం, భారం
అన్నిటి కలబోత
జీవనయానం
ఎదురుదెబ్బలెన్నో, ఎదు
రొచ్చి గాయపరిచేదెందరో
కావలసింది ఓపిక, సహనం,
నిజాయితీగా ఎదురీది
బ్రతకగలగడం

**– వాసి జ్యోత్స్న, 9866843005**

### ప్రయాణం

ప్రయాణం ప్రయాణం పరుగులు పెడుతున్నది
పరుగుల అవని అలుపు లేక అనుక్షణం !
సూర్యచంద్రుల హెడ్‌లైట్ల వెలుగులో
ఆకాశం నక్షత్రపు వాకిలిలో !

ఎక్కేవారు ఎక్కుతారు దిగేవారు దిగిపోతారు!
దిగ్ దిగంతాల దూరాలు దూర భారం లేక!
ఎక్కినట్లు దిగినట్లు తెలియదు దిగిపోయే వరకు
దిగాలంటేనే దిగులుగా ఉంటుంది

అందరికీ ఈ ప్రయాణం !
ప్రయాణాలు సాగాలి ప్రమాదాలు లేక
ప్రయాణ వాహనాలు అన్నీ
అవనిని ఆదర్శంగా తీసుకుంటే
ప్రమాదాలుండని ప్రయాణ పదనిసలు
ఒక జీవితకాలపు జ్ఞాపకాలు !

**– బక్కారెడ్డి పటోళ్ల**

## నిజాంసాగర్ ఒక గేటు ద్వారా నీటి విడుదల



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** నిజాంసాగర్ ప్రాజెక్టు ఒక గేటు ద్వారా ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరద నీటిని మాంజీరాలోకి వదలిపెడుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ ఆదివారం సాయంత్రం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. నిజాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతం నుండి 3548 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా అదే మోతాదులో 3548 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు 5వ నెంబర్ గేటు ద్వారా మాంజీరాలోకి వదులుతున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు, 17.802 టీఎంసీలకు గాను పూర్తిస్థాయి నీటిని నిల్వ ఉంచుతూ ఎగువ ప్రాంతం నుండి వస్తున్న నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. వరదనీటి ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో పశువుల కాపర్లు, రైతులు ఎవరూ వరద ప్రవాహంలోకి దిగరాదని వారు సూచించారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** విద్యుదాఘాతంతో వ్యవసాయ రైతు మృతిచెందిన ఘటన నిజాంసాగర్ మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, మృతుని కుటుంబీకులు తెలిపిన కథనం ప్రకారం మండలంలోని ఆరేడు గ్రామానికి చెందిన గాండ్ల బసప్ప(38) అనే వ్యవసాయ రైతు తన వ్యవసాయ పొలంలో గల మోటార్ తనిఖీ చేసేందుకు వెళ్ళి సాయంత్రం 4 గం.ల రపాంతంలో నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో దిగి బోరు మోటార్ తనిఖీ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్తు సరఫరా జరిగి ఘటనా స్థలంలోనే గాండ్ల బసప్ప మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుని భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నిజాంసాగర్ పోలీసులు తెలిపారు.




## బెల్లంపల్లి విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** తెలంగాణ విప్ర ఫౌండేషన్ జోన్ 16 ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవంలో బెల్లంపల్లికి చెందిన విద్యార్థులు సన్మానం అందుకున్నారు. హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని కెఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, బి.టెక్ విభాగాల్లో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు లేదా జిపిఎతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ అవార్డులు అందజేశారు. ఇందులో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన విద్యార్థులు ప్రతిభా అవార్డులను అందుకున్నారు. బిటెక్ మొదటి సంవత్సరంలో 9.88 జిపిఎతో ఉత్తీర్ణులైన వశిష్ట్ పాండే, తెలంగాణా సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల, షేక్‌పేట్ సిఒఇ నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 99 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ప్రథమ్ పాండే, ఇంటర్మీడియట్‌లో 90 శాతం జిపిఎతో ఉత్తీర్ణులైన ఛవి శర్మలను కండువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జోన్ 16 విప్ర ఫౌండేషన్ అధ్యక్షుడు హరికిషన్ ఓజా, మంత్రి రామ్‌దేవ్ నాగ్లా, కోఆర్డినేటర్ ఆనంద్ శర్మ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి



**ప్రజాపక్షం/దండేపల్లి :** దండేపల్లి మండలం గుడిరేవు గ్రామానికి చెందిన చీట్ల అన్వేష్ (22) అనే యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు దండెపల్లి ఎస్ఐ తహసీనోద్దీన్ తెలిపారు. ఎస్ఐ, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, అన్వేష్ టూర్ వెళ్తానని తండ్రి రాజిరెడ్డిని డబ్బులు అడగా, తన వద్ద లేవని చెప్పడంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ నెల 11 న గ్రామ శివార్లలో గడ్డి మందు సేవించాడు. గ్రామస్థులు విషయం చెప్పడంతో చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ అక్కడి నుండి ఎల్లారెడ్డిపేట కు తరలించారు. అప్పటి నుండి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. ఈ మేరకు తండ్రి రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## నిరాశతో జాబ్ మేళా నుంచి యువత నిష్క్రమణ

### ఎంఎల్ఎ ప్రసంగం మధ్యలోనే వదిలి వెళ్లిన నిరుద్యోగులు

**ప్రజాపక్షం /బెల్లంపల్లి :** బెల్లంపల్లిలో నిర్వహించిన జాబ్ మేళాలో నిరుద్యోగుల నుంచి తీవ్ర నిరాశ వ్యక్తమైంది. ఉద్యోగ అవకాశాల కల్పన పేరుతో ఆర్భాటంగా ప్రచారం నిర్వహించినప్పటికీ, ఇంటర్వ్యూలు సక్రమంగా జరగకపోవడం, ప్రాథమిక వసతులు లేకపోవడంతో యువతీయువకులు ఆవేదన చెందారు. దీనికి నిరసనగా ఎంఎల్ఎ గడ్డం వినోద్ ప్రసంగిస్తుండగా, యువతీయువకులు ప్రాంగణం నుంచి పెద్ద సంఖ్యలో నిష్క్రమించడం చర్చనీయాంశమైంది. ఉద్యోగాలు దొరుకుతాయని ఆశించి రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన నిరుద్యోగులకు సరైన ఇంటర్వ్యూలు నిర్వహించకపోవడం, కనీస అర్హతలకు తగిన ఉద్యోగాలు చూపకపోవడంతో చాలామంది నిరాశతో వెనుదిరిగారు. దీనికి తోడు, ఆహార, వసతి సౌకర్యాలు కూడా సరిగా లేకపోవడంతో వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ప్రచారం కోసమే ఇలాంటి మేళాలు నిర్వహిస్తున్నారని, నిరుద్యోగుల సమయాన్ని, డబ్బును వృథా చేస్తున్నారని స్థానికులు నిర్వాహకుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధి ప్రసంగిస్తున్న సమయంలోనే నిరుద్యోగులు వెళ్లిపోవడం ఈ మేళా నిర్వహణ వైఫల్యానికి అద్దం పడుతోంది.

## జమ్ముకశ్మీర్‌లో గుంజీళ్లపై కార్యశాల

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జమ్మూకాశ్మీర్ రాష్ట్రం అనంత్‌నాగ్ జిల్లాలోని కోకర్‌నాగర్ తహసీల్ హనుగుల్ గుండ్ గ్రామంలోని విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రంలో 'సూపర్ బ్రెయిన్ యోగ' అనే అంశంపై గుంజీళ్ల అంతర్జాతీయ ప్రచారకులు అందె జీవన్‌రావు కార్యశాల నిర్వహించి మాట్లాడారు. సూపర్ బ్రెయిన్ యోగాను పాఠశాలలో శిక్షణలో భాగంగానే పరిగణించి అమలు చేయటంతో విద్యార్థి లోకం సమగ్రాభివృద్ధికి దోహదపడవచ్చునని అందె జీవన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులతో 14 రౌండ్లు సూపర్‌బ్రెయిన్ యోగా చేయించారు. డాక్టర్‌రఫియా హసన్ అందె జీవన్‌రావు వివరించిన అంశాలను కాశ్మీర్ భాషలో తర్జుమా చేసి వివరించారు.



## ట్రాఫిక్ నియంత్రణ చర్యలు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** లింబాద్రిగుట్ట జాతర సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే అవకాశమున్నందున భద్రతాపరంగా వాహనాల రాకపోకల సౌకర్యార్థం ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టబోతున్నాయి. గత సంవత్సరం భక్తులు ఒకే మార్గం ద్వారా లింబాద్రి గుట్టకు వెళ్లటంతో రద్దీ ఏర్పడి కొంత అసౌకర్యం కలిగిన విషయం గుర్తుంచుకుని ఈసారి పోలీస్‌శాఖ ఒకే దిశగా వాహన రాకపోకలు అమలు చేయాలని నిర్ణయించింది. భీమ్‌గల్, పురాణీపేట్, లింబాద్రిగుట్ట వరకు మళ్లీ తిరుగు లింబాద్రిగుట్ట, పల్లికొండ, లింగాపూర్, సిద్ధపల్లె భీమ్‌గల్, భారీ వాహనాల నిష్క్రమణ కోసం పల్లికొండ, పిప్రి, ముచ్కూర్, బెజ్జొరా, భీమ్‌గల్ మీదుగా వెళ్లలాలన్నారు. పోలీసుశాఖ తరపున భక్తులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసు సిబ్బందికి సహకరించి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు సహాయపడాల్సిందిగా ప్రార్థించబడుతుంది. భక్తుల సౌకర్యం, భద్రత, నిరంతర రాకపోకల కోసం ప్రతిఒక్కరూ సహఖరించాలని కోరారు.

## జ్యుడిషియల్ రిమాండ్‌కు వ్యక్తి తరలింపు

**ప్రజాపక్షం/పిట్లం :** పిట్లం మండలంలోని గౌరారంతాండా గ్రామానికి చెందిన కెతావత్ వామన్‌రావ్ అనే వ్యక్తిని ఆదివారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించడం జరిగిందని బాన్సువాడ రూరల్ సీఐ తిరుపతయ్య పేర్కొన్నారు. సీఐ తెలిపిన కథనం ప్రకారం గౌరారంతాండాకు చెందిన కేతావత్ వామన్‌రావు తన తండ్రి దశరథ్ గత కొంత కాలం నుండి అనారోగ్యం సమస్యతో మంచానికే పరిమితం కావడంతో అతనికి సపర్యలు చేస్తూ ఇంటిపనులు చేస్తూ ఉండేవాడని, తనకు ఈ సేవలు భారం కావడంతో ఈనెల 24వ తేదీనా సాయంత్రం తన తండ్రికి కల్లులో ఏదో గుర్తు తెలియని పురుగుల మందు కలిపి తాగించి హతమార్చాడని మృతుని చిన్న కుమారుడు కేతావత్ శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేపట్టి నిందితుడు కేతావత్ వామన్‌ను జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు బాన్సువాడ రూరల్ సిఐ పేర్కొన్నారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్ళు సంతానం.

# మద్యం లాటరీ ప్రక్రియ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

### 49 మద్యం షాపులకు లాటరీ కార్యక్రమం నిర్వహణ

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్ :** అత్యంత పారదర్శకంగా మద్యం లాటరీ ప్రక్రియ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయడం జరిగిందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం మెదక్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్, బోధన్ రోడ్, మెదక్ ఫంక్షన్ లాటరీ నిర్వహణ ఏర్పాట్లలను కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 27 సంవత్సరాలకు మెదక్ జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎ4 మద్యం షాపుల దరఖాస్తు ప్రక్రియ తేదీ 23.10.2025 రోజున ముగిసిందని తెలిపారు. మెదక్ జిల్లాలోని మొత్తం (49) మద్యం షాపులకు గాను (1420) దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. దరఖాస్తు ఫీజు రూపంలో 42 కోట్ల 60 లక్షల రూపాయల ఆదాయం ఆర్జించడం జరిగిందన్నారు. తేదీ 27.10.2025 సోమవారం రోజున మద్యం షాపుల కేటాయింపుకు సంబంధించిన లాటరీ ప్రక్రియను మెదక్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్, బోధన్ రోడ్, మెదక్ ఫంక్షన్ హాల్ నందు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. మెదక్ జిల్లాలోని మద్యం షాపులకు దరఖాస్తు చేసిన దరఖాస్తుదారులు లేదా ఆర్థరైజ్డ్ రెప్రెసెంటేటివ్ తేదీ 27.10.2025 సోమవారం రోజున ఉదయం 9:30 గంటలకల్లా శ్రీ వెంకటేశ్వర గార్డెన్స్ నందు హాజరు కావాలన్నారు. దరఖాస్తుదారులు లేదా ఆర్థరైజ్డ్ రెప్రెసెంటేటివ్ ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి వారు దరఖాస్తు చేసిన సమయంలో వారికి ఇచ్చినటువంటి రసీదు కాం ఎంట్రీ పాస్ ఒరిజినల్ ను తీసుకొని హాజరు కావాల్సి ఉంటుందని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలసదనము భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి

### కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/నస్పూర్ :** బాలసదనము భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న బాలసదనము భవన నిర్మాణ పనులను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలల పరిరక్షణ, ఆశ్రయం కొరకు ప్రభుత్వం రూ.1 కోటి 34 లక్షల మిషన్ వాత్సల్య అంచనా నిధులతో బాలసదనము భవన నిర్మాణం చేపట్టిందని తెలిపారు. అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ గుత్తేదారుల సమన్వయంతో నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం రక్షణకు సిద్ధం కండి

### కావాలని కలెక్టర్ ఆదేశం

### కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు కలెక్టర్ ముఖ్య సూచనలు

**ప్రజాపక్షం/ఎడపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో ఈ నెల 28వ, 29వ తేదీన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జిలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారని ఎడపల్లి ఏవో సిద్ధి రామేశ్వర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న వరి ధాన్యం వర్షానికి తడవకుండా, పంట నష్టపోకుండా తక్షణమే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల ముప్పు ఉన్నందున, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు తమ సెంటర్ల వద్ద ఉన్న వరి ధాన్యం కుప్పలపై కప్పడానికి టార్పాలిన్ కవర్లను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. ధాన్యం నిల్వలను సురక్షితంగా ఉంచడం అత్యంత అవసరమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వరి ధాన్యం రక్షణ చర్యల్లో భాగంగా, తమ కేంద్రాలకు అదనంగా టార్పాలిన్ కవర్లు అవసరం ఉన్న ఏడల వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఎడపల్లి మండల అగ్రికల్చర్ ఆఫీసర్ సిద్ధిరామేశ్వర్ సూచించారు. ధాన్యం కొనుగోలు సెంటర్ పరిధిలో ఏమైనా టార్పాలిన్ కవర్ల కొరత ఉంటే, వెంటనే తమకు తెలపాలని, ఆ సమాచారం ఆధారంగా, మార్కెటింగ్ శాఖ అధికారుల నుంచి టార్పాలిన్ కవర్లను వెంటనే తెప్పించి సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌ఛార్జిలు అలసత్వం వహించకుండా తక్షణమే ఈ పక్రియను పూర్తి చేయాలన్నారు.



## పలు నిర్మాణాలకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి భూమి పూజ

**ప్రజాపక్షం/తిర్యాణి/రెబ్బెన :** ఆసిఫాబాద్ ఎంఎల్ఏ కోవ లక్ష్మి నియోజకవర్గంలో పలు అభివృద్ధి నిర్మాణాలకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆసిఫాబాద్ మండలంలోని జన్కాపూర్ వైఎస్ఆర్ కాలనీలో శ్రీ పోచమ్మ తల్లి గుడి నిర్మాణానికి, తిర్యాణి మండలం కన్నెపల్లి గ్రామం లో పెరుక సంఘం భవనము నిర్మాణానికి ఆమె భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా గుడి నిర్మాణం చేపట్టినందుకు ఎంఎల్ఏ లక్ష్మి కి జన్కపూర్ వైఎస్ఆర్ కాలనీ వాసులు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుతీ, రాజేష్ కుమార్, గణేష్, వినోద్, నవీన్, కన్నెపల్లి పెరుక సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యం రాజన్న, రాష్ట్ర నాయకులు చుంచు శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు హనుమండ్ల జగదీష్, గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మన్ కీ బాత్ వీక్షించిన సిర్పూర్ శాసన సభ్యులు

**ప్రజాపక్షం/దండేపల్లి :** దండేపల్లి మండలం మ్యాదరిపేట్ గ్రామంలోని భారత తీర్థ ఫంక్షన్ హాల్లో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కి బాత్ కార్యక్రమాన్ని సిర్పూర్ శాసన సభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు రైతులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్‌లో కొమురం భీంను గుర్తు చేసుకున్నారు. 20వ శతాబ్దం తొలినాళ్లలో స్వాతంత్ర్యం ఒక కళలా ఉండేదన్నారు. బ్రిటీష్ వారి దోపిడీకి అంతు లేకుండా ఉండేదని, 20 ఏళ్ల వయసులోనే కొమురం భీం ఉద్యమించారని ప్రధాని కొనియాడారు. నిజాం పోలీస్ అధికారిని కొమురం భీం హతమార్చారని, పోలీసులకు చిక్కకుండా తప్పించుకోగలిగారని ఆయన పేర్కొన్నారు. ఆదివాసీల మనసుల్లో కొమురం భీం సుస్థిర స్థానం సంపాదించారని ప్రధాని మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు చెల్లించాలి




**ప్రజాపక్షం/నస్పూర్ :** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియా తరహాలో హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ (బిఎంఎస్) నాయకులు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా యూనియన్ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా కొత్త కమిటీని ప్రకటించిన అనంతరం యాదగిరి సత్తయ్య మాట్లాడారు. సింగరేణి ఉత్పత్తి లక్ష్యాలు సాధించడంలో కాంట్రాక్ట్ కార్మికులు కీలకంగా ఉన్నారని, సంస్థ టర్నోవర్‌లో 70 శాతం వాటా వారిదేనని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికులను లాభాల భాగస్వాములుగా గుర్తించాలని, కోల్ ఇండియా మాదిరిగా 1965 బోనస్ చట్టం ప్రకారం దీపావళి బోనస్ కూడా చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బిఎంఎస్ డిమాండ్ మేరకు ఇప్పటికే రూ.5500 చెల్లించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎబికెఎంఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు మండ మాకాంత్ పర్యవేక్షకులుగా హాజరయ్యారు. సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీరాంపూర్ ఏరియా నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా నీరటి సురేష్, కార్యదర్శిగా కలవైన స్వామి, జాయింట్ సెక్రటరీలుగా మర్కారి క్రాంతి కుమార్, కాంపెల్లి రమేష్, బి. సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా నామిని వెంకటేష్, మానుగు విజయ్, రమేష్, కోశాధికారిగా ఇందూరి నరేష్‌లు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐలవేణి శ్రీనివాస్, ఏరియా కార్యదర్శి రాగం రాజేందర్, బొంపల్లి రమేష్, రాజారాం కిరణ్, కటుకూరి సతీష్, జల్లా తిరుపతి, కోమ్మ బాపు, మహేందర్, బుర్ర అరుణ్ గౌడ్, బోడకుంట శ్రీధర్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వైద్యానికి కాలానుగుణ ప్రాధాన్యత

### ప్రకృతి వైద్య ఆసుపత్రిని ప్రారంభించిన ఎంపి వంశీ కృష్ణ




**ప్రజాపక్షం/చెన్నూర్ :** ప్రకృతి వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వడం కాలానుగుణమని పెద్దపల్లి ఎంపి వంశీ కృష్ణ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని శివలింగాపూర్ గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన సత్వ ప్రకృతి వైద్య ఆసుపత్రిని ఆదివారం ఎంపి వంశీ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో ప్రజల జీవన విధానంలో మార్పులు రావడంతో సహజ సిద్ధమైన జీవనం కనుమరుగై రసాయనాల వాడకం పెరిగిపోయిందని, దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో చెన్నూర్ ప్రాంతంలో ప్రకృతి వైద్య ఆసుపత్రి ఏర్పాటు చేయడం ఆనందదాయకమని, ప్రజలు తిరిగి సహజ జీవన విధానాన్ని అలవాటు చేసుకోవడానికి ఇది దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రకృతి వైద్యం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, ఈ ఆసుపత్రి ప్రజలకు మేలు చేకూర్చాలని, మరింత అభివృద్ధి చెందాలని ఎంపి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, చెన్నూర్ ప్రాంతీయ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఓ వైపు వర్షం.. మరుక్షణం ఎండ

### అకాల వర్షాలతో అన్నదాతల గుండెల్లో గుబులు

### రైతులను కలవరపెడుతున్న అల్పపీడనం



**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న అకాల వర్షాలు నిజామాబాద్ జిల్లాలో రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. పంట చేతికొచ్చిన కీలక సమయంలో వరుణుడు ప్రతాపం చూపడంతో అన్నదాతలు అయోమయంలో పడుతున్నారు. భారత వాతావరణ విభాగం ప్రకటన ప్రకారం, బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ అల్పపీడనం ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందనే హెచ్చరికలు రైతుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు రైతులు. ప్రస్తుతం వరి పంట కోతలు దాదాపు ఆరబెట్టుకొని ఎదురుచూస్తున్నారు. సరిగ్గా ఈ తరుణంలోనే అకాల వర్షాలు కురుస్తుండటం వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. ఒకవైపు వర్షం కురుస్తుండటం, మరుక్షణమే ఎండ కాయడంతో రైతులు ఏంచేయాలో తెలియక దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. వర్షం పడగానే ధాన్యాన్ని హడావుడిగా కుప్పలు చేసి కప్పి పెట్టగా, వెంటనే ఎండ కాయడంతో మళ్లీ ఆరబెట్టాలా..? లేదా..? అనే తికమకలో పడిపోతున్నారు. చేతికొచ్చిన పంట నోటికందే సమయంలో వరుణుడు తమపై ప్రభాపం చూపుతున్నాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకచోట వర్షం, మరోచోట ఎండ అనే విచిత్ర వాతావరణ పరిస్థితి ధాన్యాన్ని త్వరగా ఆరబెట్టి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలనే రైతన్నల ప్రయత్నాలకు అడ్డుగా నిలుస్తోంది.

ప్రభుత్వం తక్షణమే స్పందించి అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలకు తగిన పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

## యువకుడి ఆత్మహత్య



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** ప్రేమ విఫలమైందని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ నాలుగో టౌన్ పరిధిలో జరిగిందని నాలుగో టౌన్ ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే డిచ్‌పల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఆకాష్ (23) నిజామాబాద్‌లోని వినాయకుల బావి వద్ద అద్దెకుంటు ఓ మాల్‌లో పనిచేస్తున్నాడు. శనివారం అద్దెకు ఉన్న ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవల ఆకాష్ ఓ అమ్మాయితో ప్రేమరాగం కొనసాగించాలని ప్రేమ విఫలం కావడంతో ఆత్మహత్యకు పాల్పడ్డట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం తెలుస్తుందన్నారు.

# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు



### నాణ్యమైన ఉచిత విద్యుత్ రైతాంగానికి అందాలి

### మెదక్ మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన

**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ మండలం రాజ్ పల్లి గ్రామంలో ఆదివారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ విస్తృతంగా పర్యటించి, ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రన్నీ , 33 /11 సబ్ స్టేషన్ ను తనిఖీ చేశారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో, సబ్ స్టేషన్ లో పలు రికార్డులను పరిశీలించారు. ధాన్యం సేకరణ తీరును, మాశ్చరైజేషన్ను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఏ విధంగా సరఫరా అవుతుందో ఎన్ని గంటలు రైతులకు అందిస్తున్నారని అధికారులనువివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా 498 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కేంద్రాల దగ్గర రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారని అందులో మాయిచ్చరైన ధాన్యానికి టోకెన్ అందిస్తున్నామని తెలిపారు. టోకెన్ అందించడంతోపాటు మిల్లులకు కూడా ట్యాగింగ్ ఇచ్చేస్తున్నామన్నారు. ధాన్యం సరఫరాకు వాహనాలన్నీ సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు బిల్లులు త్వరగా చెల్లించేందుకు కూడా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రైతులు దళారులను నమ్మి రైతులు మోస పోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్‌లోనే ధాన్యాన్ని విక్రయించాలని వెల్లడించారు. నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్ రైతులకు అందాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## నేరాల నియంత్రణకే సీసీ కెమెరాల ఏర్పాటు

**ప్రజాపక్షం/ముత్తారం :** ప్రజల భద్రత, నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని ముత్తారం ఎస్సై రవికుమార్ అన్నారు.ఆదివారం ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ బస్టాండ్ ఆవరణంలో మిర్చి వ్యాపారులు మారం శ్రీనివాస్, దేవేందర్ రెడ్డి, గాదం శ్రీనివాస్, రాజు మరికొందరు సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో నేరాలను నియంత్రించేందుకు, అసాంఘికకార్యకలాపాలు జరగకుండా ప్రశాంతమైన వాతవరణం కల్పించడంలో సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చి గుర్తు తెలియని వ్యక్తులు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎవరు లేని ఇంట్లో, రోడ్లపై వెళ్తున్న మహిళల మెడలోని బంగారు ఆభరణాలు దొంగతనాలు చేస్తున్న కారణంగా నేరాల నియంత్రణ కోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని ఎస్సై కోరారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/చొప్పదండి:** మండలంలోని భూపాలపట్నం, వెదురుగట్ట, రాగంపేట, రేవెల్లి, కుర్మపల్లి గ్రామాల్లో ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరు ప్రారంభించారు. రైతులు ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకుని మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల గంగయ్య గౌడ్, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, కొట్టె అశోక్, గుర్రం రమేష్, కడారి శంకర్, మునిగాల చందు, వల్లాల కృష్ణ హరి, నాయకులు, తదితరులున్నారు.

## పాముకాటుతో చిన్నారి మృతి



**ప్రజాపక్షం/చందుర్తి :** పాముకాటు తో చిన్నారి మృతి చెందిన ఘటన మండలంలోని ఆశిరెడ్డి పల్లి గ్రామం లో శనివారం రాత్రి చోటు చేసుకుంది.స్థానికుల కథనం మేరకు ఆశిరెడ్డి పల్లి గ్రామానికి చెందిని చేకుట రమేష్ సుమలత ల కుమార్తె చిన్నారి వేదాన్షి (ఏడాదిన్నర వయస్సు) శనివారం సాయంత్రం దాదాపు 8 గంటల ప్రాంతం లో ఇంటి బయట ఆడుకుంటూ ఒక్కసారిగా బిగ్గరగా ఏడవడం తో ఏదోవిష పురుగు కుట్టనట్టు నిర్ధారించుకొని వేములవాడ లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చిన్నారి పాముకాటుకు గురైందని , పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడం తో అంబులెన్సు లో ఎల్లారెడ్డి పేట ఆసుపత్రికి తరలించారు.అప్పటికే చిన్నారి చనిపోయిందని వైద్యులు తెలపడం తో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.చిన్నారి తండ్రి రమేష్ గత 6 నెలల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్ళాడు.కుటుంబ సభ్యుల ఫిర్యాదు తో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని చందుర్తి ఎస్సై రమేష్ తెలిపారు.

## చదువుతోపాటు ఆరోగ్యం కూడా ముఖ్యమే: కలెక్టర్



**ప్రజాపక్షం/జనగామ:** విద్యార్థులకు ఉన్నతమైన చదువుతోపాటు మెరుగైన ఆరోగ్యం దానిని నిరంతరం పరిరక్షించడం కూడా అవసరమే అని జిల్లా కలెక్టర రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. దిక్సూచి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు ఆదివారం కలెక్టర్ హెల్త్ కార్డులను అందించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య సంస్థలను నమ్మి తల్లిదండ్రులు తమ పిల్లలను జాయిన్ చేయించినందుకు వారిని బాగా చూసుకోవాలన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం రూపొందించిన దిక్సూచి కోసం కార్యక్రమంలో భాగంగా మారుతున్న కాలానికి అనుగునంగా భవిష్యత్‌లో విద్యార్థుల కెరీర్‌కు అవసరమయ్యేలా విద్యా, జ్ఞాన నైపుణ్యాలు, పౌర నైతిక నైపుణ్యాలు, సామాజిక నైపుణ్యాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. జిల్లాలో మొత్తం 39 రెసిడెన్షియల్ పాఠశాలల్లో 14993 మంది విద్యార్థులకు హెల్త్ కార్డు అందించగా స్పెషల్ డ్రైవ్ ద్వారా ఇప్పటి వరకు 4898 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పూర్తయిందని తెలిపారు.

## నేడు ప్రజావాణి రద్దు: కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం నిర్వహించే ఆడిటోరియంలో మద్యం దుకాణాల టెండర్‌కు సంబంధించిన డ్రా ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు గమనించాలని ఆమె సూచించారు.

### రాజన్న సిరిసిల్లలో

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో (సోమవారం) ఈ నెల 27 వ తేదీన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం నిర్వహించే ఆడిటోరియంలో ఎ4 మద్యం దుకాణాల టెండర్ కు సంబంధించిన లక్కీ డ్రా ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని ఆమెసూచించారు.

## ఉచిత నాచురోపతి ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు



**ప్రజాపక్షం/రామగిరి:** సెంటనరీకాలనిలో ప్రకృతి వైద్య నిపుణురాలు డాక్టర్ శరణ్య ఆధ్వర్యంలో, నొప్పి నిర్వహణ నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ సారథ్యంలో, లయన్స్‌క్లబ్ ఆఫ్‌సహకారంతో ఉచిత న్యాచురోపతి ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేయగా సుమారు 50 మంది రోగులకు ఉచితంగా వైద్య సలహాలు, చికిత్సలు ఆయుర్వేద మందులు వివిధ రకాల నడుం నొప్పులు, మోకాలి నొప్పులు, మైగ్రేన్, సైనస్, చర్మ వ్యాధులు, డయాబెటిస్, రక్తపోటు వంటి సమస్యలపై ప్రత్యేక న్యాచురోపతి పద్ధతుల్లో అంది చారు డాక్టర్ శరణ్య,డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి వైద్యం అనేది కేవలం చికిత్స పద్ధతి మాత్రమే కాదు, అది ఒక జీవన శైలి మన శరీరంలోని స్వీయ నయం చేసుకునే శక్తిని పెంపొందించడమే న్యాచురోపతి లక్ష్యం. క్రమం తప్పకుండా సహజ ఆహారం, యోగా, ధ్యానం,సూర్యస్నానం వంటి పద్ధతులను అనుసరించడం ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చు అని వివరించారు.ప్రస్తుత జీవన విధానంలో ఎక్కువ మంది మసిల్ పెయిన్, జాయింట్ పెయిన్, స్పైన్ సమస్యలు వంటి బాధలతో బాధపడుతున్నారు. అలాంటి వారికి మందులపై ఆధారపడకుండా, ప్రకృతి చికిత్స ద్వారా సహజంగా ఉపశమనం కలిగించవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్ క్లబ్ డైరెక్టర్ మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి, టీవీ సురేష్ బాబు వైద్య సిబ్బంది చక్రవర్తి, పుదరిరాజు,సారిక,రమ్య, అజయ్,తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ కో ఎఇగా రాజేందర్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలం ట్రాన్స్కో ఏఈగా దురిశెట్టి రాజేందర్ ఆదివారం ముత్తారం మండల కేంద్రంలోని కాసర్ల గడ్డ ట్రాన్స్కో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలకి మెరుగైన నాణ్యతతో కూడిన విద్యుత్తును 24 గంటలు సరఫరా చేయడానికి కృషి చేస్తామన్నారు. కాగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏ ఈ రాజేందర్ కి సిబ్బంది ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

# అర్బన్ బ్యాంకు ఎన్నికలకు కాంగ్రెస్ ప్యానెల్‌ను ప్రకటించలేదు


### ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంచార్జి మంత్రిగా హైదరాబాదు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో ఉండగా జిల్లాకు చెందిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంతో పాటు ఇతర ముఖ్య నేతలతో జరిపిన చర్చల అనంతరం తీసుకున్న నిర్ణయం మేరకు కరీంనగర్ అర్బన్ బ్యాంకు ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పక్షాన ఎలాంటి ప్యానెల్‌ను ప్రకటించలేదని మానకొండూర్ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఇటీవల కొన్ని దినపత్రికల్లో ఆ ప్యానెల్ సభ్యులకే మంత్రుల అండ, దండ ఉందని, అర్బన్ బ్యాంకులో చైర్మన్ సీటును కైవసం చేసుకోబోయేది వారేనని వస్తున్న ప్రకటనలను జిల్లాకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అర్బన్ బ్యాంకు ఓటర్లు నమ్మవద్దని కోరారు. ఇది పూర్తిగా అసత్య ప్రచారమని తెలిపారు. అర్బన్ బ్యాంకు ఎన్నికల బరిలో నిలిచిన వారిలో ఎక్కువ మంది కాంగ్రెస్ పార్టీ వారే ఉన్నందున కచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యులు మాత్రమే పాలకవర్గాన్ని ఏర్పాటు చేయుటకు అవకాశాలు ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. అర్బన్ బ్యాంకు చరిత్రలో ఎక్కువ కాలం పాలక వర్గాన్ని నడిపించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని, ఈ సారి అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో విజయం సాధించేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. అర్బన్ బ్యాంకు వినియోగదారులు, ఖాతాదారుల సలహాలు, సూచనలు, అభిప్రాయాలు తీసుకోవడంతో పాటు త్వరలో కొలువుదీరనున్న నూతన అర్బన్ బ్యాంకు పాలకవర్గానికి, బ్యాంకు అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ తోడ్పాటు అందిస్తుందన్నారు. కార్పోరేట్ స్థాయిలో బ్యాంకును ఆధునీకరించడం, సేవలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

## లైసెన్స్‌డ్ సర్వేయర్ స్పెల్ 2 పరీక్షలు ప్రశాంతం: కలెక్టర్

**ప్రజాపక్షం /సిద్దిపేట:** లైసెన్సడ్ సర్వేయర్ పరీక్షలు నిర్వహించినట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె . హైమవతి తెలిపారు. అదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్వేయర్‌లుగా శిక్షణను పొందిన అభ్యర్థులకు నిర్వహించిన పరీక్ష కేంద్రంను కలెక్టర్ సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ లైసెన్స్‌డ్ సర్వేయర్ 2 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగునంగా పరీక్షలు నిర్వహించామన్నారు. లైసెన్సడ్ సర్వేయర్ల పరీక్షలకు సంబందించి ఉదయం సెషన్ లో 10 గంటల నుండి 1 గంట వరకు మద్యాహ్నం 2 నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షల్లో 153 మంది హాజరైన్లు పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఏ డి సర్వేలాండ్ వినయ్ డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలి: ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** జూబ్లిహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పిలుపునిచ్చారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ డివిజన్‌లో నిర్వహించిన పాలమూరు నివాసుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోరుతూ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరై మాట్లాడుతూ పాలమూరు ప్రాంతానికి చెందిన ప్రజలు ఎల్లపుడు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారన్నారు. అదే ఉత్సాహాన్ని ఎన్నికలలో చూపి కాంగ్రెస్ జెండా ఎగరేసేలా విజయదుందుబి మోగించాలన్నారు. ఈ సమ్మేళనంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు పూర్తి సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజా పక్షం/ వేములవాడ :** ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆదివారం వేములవాడ పట్టణంలోని బాల నగర్ గ్రామంలో ప్యాక్స్ (PACS) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మరియు డైరెక్టర్లు చీకోటీ నాగ రాజు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా, కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, రైతులకు ఏ విషయంలోనైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా, ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదని కఠిన హెచ్చరిక జారీ చేశారు.రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి రైతు కష్టం ఫలించేలా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉండడమే తెలంగాణ అభివృద్ధికి మూలం అని వారు పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తెలియజేశారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండేందుకు కృషి చేస్తున్నామని, తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టే పరికరాన్ని కూడా అందుబాటులో ఉంచామని, అవసరమున్న రైతులు ఈ పరికరాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరూ అండగా నిలిచి, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, డైరెక్టర్లు ఖమ్మం గణేష్, కత్తి కనకయ్య, విద్యాసాగర్, పరశురాం, నాయకులు కూరగాయల కొమరయ్య, సంఘ స్వామి యాదవ్, తోట రాజు, పులి రాంబాబు, అన్నారం శ్రీనివాస్, పుల్కం రాజు, పీర్ మహమ్మద్, దాడి మల్లేశం, అంబాటి చందు, సాయిని అంజయ్య, కుతాడి రాజేశం, కొక్కుల బాలు, కొండ శేఖర్, నాగుల విష్ణు, రమేష్, గంటల ప్రకాష్, బాబున్, మరియు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అసంఘటిత కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలి




### సిపిఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** అసంఘటిత కార్మిక రంగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు 55 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క కార్మికునికి రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కడవెండిలో ఏఐటీయూసీ, అనుబంధ హమాలీ కార్మిక సంఘం ఎన్నిక జరిగింది. ఈ సమావేశానికి పరుశరాములు అధ్యక్షతన వహించగా ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో లేబర్ కార్డు, తంబ్ సిస్టంను ఎత్తివేయాలని, ప్రభుత్వ కార్మికులకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలయ్య, వానకొండయ్య, సుధాకర్, నరసింహ, భిక్షపతి, మహేష్, కుమార్ పాల్గొన్నారు.

**కడవెండి గ్రామ కమిటి ఎన్నిక...**

ఏఐటీయూసీ, అనుబంధ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షునిగా మైల అశోక్, ఉపాధ్యక్షునిగా చింత మహేష్, ప్రధాన కార్యదర్శిగా నవీన్, సహాయ కార్యదర్శిగా ఐలయ్య, కోశాధికారిగా సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## అకాల వర్షానికి నేలకూలిన వరి



**ప్రజాపక్షం/ముత్తారం :** ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికి వచ్చే సమయంలో మబ్బులు కమ్ముకొని ఒక్కసారిగా ఆకాల వర్షం కురవడంతో వరిపంట పూర్తిగా నేలకూలింది. వరి పంట నెల కూలడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు, అడవి శ్రీరాంపూర్, ముత్తారం, ఖమ్మంపల్లి గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో వరి పంటలను సాగు చేశారు. కొద్ది రోజులైతే పంట చేతికి వస్తుంది. అలాంటి తరుణంలో ఆకస్మాత్తుగా రెండు రోజులుగా గాలితో కూడిన వర్షం భారీగా కురిసింది. ఒక ఎకరాకు సుమారుగా రైతు రూ 40 వేలు ఖర్చు చేసి వరి పంటను సాగు చేసినట్లు రైతులు అంటున్నారు. ఒక్క సారిగా గాలివాన రావడంతో పంట పూర్తిగా దెబ్బ తిని రైతులకు నష్టం కలిగించిందని రైతులు వాపోతున్నారు.ఒడేడు గ్రామానికి చెందిన ఎర్రవెల్లి పాపారావు, లింగారావు తో పాటు పలువురు రైతులు సాగు చేసిన వరి పంట దెబ్బతిన్నదని చెప్పారు. వరి పంటను కాపాడుకొంటూ వచ్చే తరుణంలో ఆకాల వర్షం వలన రైతులకు నష్టం కలిగిందని రైతులు వాపోతున్నారు. అకాల వర్షం కారణంగా నష్ట పోయిన వరి పంట సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని పలు గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు.

## నూతన దంపతులను ఆశీర్వదించిన కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని అశ్వరావుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టి సీనియర్ నాయకుడు నామాల బుచ్చయ్య కుమారుని వివాహం ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని మాంగళ్య కన్వెన్షన్ హాల్‌లో జరుగగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్‌రెడ్డి, లింగాల ఘనపూర్ మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నరేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మార్కెట్ డైరక్టర్ సిద్దయ్య, కాంగ్రెస్ నాయకులు మల్లేష్, శ్రవణ్ కుమార్, సురేందర్ రెడ్డి, అంజిరెడ్డి, నగేష్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**నూతన వస్త్ర ఫలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న కడియం**

**లింగాలఘణపురం:** స్టేషన్ ఘణపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పిఏ ముఖ్య సహాయకులు, ముక్క రాకేష్, కుమార్తె, నూతన వస్త్ర పలంకరణ, హన్మకొండ, నయీమ్ నగర్ శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో, కార్యక్రమం నిర్వహించగా, కడియం శ్రీహరి, ముఖ్య అతిథిగా పాల్గొని, రాకేష్ కుమార్తెను, ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో, మాజీ జెడ్పిటిసి, గుడి వంశీధర్ రెడ్డి, జనగామ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కొల్లూరి శివకుమార్ (నర్సింహులు) కాంగ్రెస్ నాయకులు, బొల్లంపల్లి నాగేందర్, నెల్లుట్ల గ్రామ శాఖ అధ్యక్షులు, బత్తిని అశోక్ కుమార్ గౌడ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బొల్లారంలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ రూరల్ మండలంలోని బొల్లారం గ్రామంలో పీఏసీఎస్ ప్యాక్స్ (ఫ్యాక్స్ ) ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు లాంఛనంగా ప్రారంభించారు. రైతులకు మరింత చేరువగా, పూర్తి పారదర్శకతతో ధాన్యం కొనుగోళ్లను చేపట్టేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు మాట్లాడుతూ, రైతులు ధాన్యం అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను విస్తృతం చేస్తున్నామని తెలిపారు. కొనుగోళ్లలో ఎక్కడా అవకతవకలకు తావు ఇవ్వకుండా, ప్రతి రైతుకు కనీస మద్దతు ధర దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ త్వరలోనే అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ రూరల్ ఎంఆర్ఓ మరియు ఏఓ, వేములవాడ రూరల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వకుళభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేష్, జిల్లా డీసీసీ సెక్రెటరీ బాలసాని శ్రీనివాస్ గౌడ్, వేములవాడ రూరల్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఆదిల్ పాషా, బొల్లారం గ్రామ మాజీ సర్పంచ్ ఇరువాల మల్లేశం, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కైలాసం, దశరథం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మరియు గ్రామ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండల రోడ్ల నిర్మాణ అభివృద్ధికి రూ.120 కోట్ల 40 లక్షల నిధులు మంజూరు చేసినందుకు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పీఏసీఎస్ చైర్మన్ కర్ణాకర్ రావు, మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏ మండలానికి ఇవ్వనన్ని నిధులు రోడ్ల నిర్మాణానికి నిధులు మన మండలానికి ఇచ్చినందుకు కడియం శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. స్టేషన్‌ఘనపూర్ నుండి వర్ధన్నపేట వైపు వెళ్లే రోడ్డుకు రూ.40కోట్ల 77 లక్షలు, మండల కేంద్రంలో సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు , జపర్‌గడ్ నుండి సూరారం, హిమాయత్ నగర్ వరకు 13 కోట్ల 60 లక్షలు, మండలంలోని ఇతర గ్రామాల రోడ్లకు నిధులు మంజూరుచేయడం జరిగిందన్నారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు.

# క్రీడ

## వర్షం అంతరాయం

### భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్ 43 ఓవర్లకు కుదింపు



మహిళల ప్రపంచకప్ చివరి లీగ్ మ్యాచ్‌నూ వరుణుడు వదలడం లేదు. భారత్, బంగ్లాదేశ్ పోరుకు టాస్ తర్వాత ఆటకు అడ్డుపడిన వర్షం.. పవర్ ప్లే పూర్తికాగానే మళ్లీ మొదలైంది. డీవై పాటిల్ స్టేడియలో ప్రస్తుతం భారీగా వాన పడుతోంది. దాంతో.. అంపైర్లు ఆటను నిలిపివేశారు. వర్షం అంతరాయం కలిగించే సరికి బంగ్లాదేశ్ రెండు వికెట్లు కోల్పోయి 39 పరుగులు చేసింది. ఓపెనర్ షర్మీన్ అక్తర్(18 నాటౌట్), కెప్టెన్ నిగర్ సుల్తానా(2 నాటౌట్)లు అజేయంగా ఉన్నారు.

గంటలోపే మరోసారి వర్షం రావడంతో 43 ఓవర్ల ఆటపై సందేహాలు నెలకొన్నాయి. ఒకవేళ వాన తగ్గినా ఔట్‌ఫీల్డ్ సిద్ధం చేసేసరికి కనీసం గంట సమయం పట్టే అవకాశముంది. అదే జరిగితే.. మ్యాచ్‌ను మరిన్ని ఓవర్లకు తగ్గించడం ఖాయం. వర్షం బ్రేక్ ఇవ్వకుంటే.. ఆటను రద్దు చేసే ఛాన్సూ ఉంది.

డీవై పాటిల్ స్టేడియంలో న్యూజిలాండ్‌పై నిప్పులు చెరిగిన రేణుకా సింగ్(1–23) బంగ్లాదేశ్‌పైనా చెలరేగుతోంది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌లో బంగ్లా ఓపెనర్ సుమైయా అక్తర్(2)ను ఔట్ చేసింది. చివరి బంతికి షార్ట్ థర్డ్‌మ్యాన్‌లో ఆడిన అక్తర్.. అక్కడే కాచుకొని ఉన్న శ్రీ చరణి చేతికి చిక్కింది. 2 పరుగులకే తొలి వికెట్ కోల్పోయిన బంగ్లాను రుబియా హైదర్(13), షర్మీన్ అక్తర్(15 నాటౌట్) ఆదుకున్నారు. కానీ.. వీరి భాగస్వామ్యాన్ని బ్రేక్ చేస్తూ పవర్ ప్లే ముగియగానే రెండో వికెట్ అందించింది దీప్తి శర్మ.



## ప్రపంచ కప్‌తో వన్డేలకు వీడ్కోలు..

### న్యూజిలాండ్ దిగ్గజానికి 'గార్డ్ ఆఫ్ ఆనర్'



మహిళల వన్డే ప్రపంచ కప్‌లో న్యూజిలాండ్ ప్రయాణం ముగిసింది. ఫేవరెట్‌గా టోర్నీలో అడుగుపెట్టిన వైట్ ఫెరన్స్ లీగ్ దశలో ఓటమితో ఇంటిదారి పట్టింది. టీమిండియా చేతిలో ఓడిన తర్వాత సెమీస్ చేరలేకపోయామనే బాధ ఆ జట్టు సభ్యుల్లో స్పష్టంగా కనిపించింది. కానీ, ఆదివారం ఇంగ్లాండ్ దెబ్బకు ఆ జట్టుకు దారుణ పరాజయం ఎదురైంది. కానీ, అంతకంటే మరొక విషయం కివీస్ క్రికెటర్లను ఎంతగానో బాధిస్తోంది. అదేంటంటే.. ఇన్నాళ్లు తమను నడిపించిన.. పెద్దక్కలా వ్యవహరిస్తూ వచ్చిన కెప్టెన్ సోఫీ డెవెనె కెరీర్ ముగించనుంది. ప్రపంచకప్ ఆరంభానికి ముందే దేశం తరఫున నేను ఆడబోయే చివరి టోర్నీ ఇదే అని ఈ ఆల్‌రౌండర్ వెల్లడించింది. నిరుడు న్యూజిలాండ్‌ను తొలిసారి టీ20 వరల్డ్ కప్ విజేతగా నిలిపిన ఆమె వన్డే వరల్ కప్‌ను ముద్దాడాలనుకుంది. కానీ, అమె ఈసారి టీమ్‌తో అద్భుతం చేయలేకపోయింది. ఫలితంగా.. ఏడు మ్యాచుల్లో ఒకేఒక విజయంతో సెమీస్ అవకాశం చేజార్చుకుంది. చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి సంతృప్తిగా స్వదేశం వెళ్దామనుకుంటే.. ఇంగ్లాండ్ స్పిన్నర్లు ముప్పతిప్పలు పెట్టి.. ఘోర పరాభవాన్ని అందించారు. వైజాగ్‌లో ఓటమితో అంతర్జాతీయంగా వన్డేల్లో డెవెనె ప్రస్థానం ముగిసిపోయింది. ఇక కివీస్ లెజెండ్ తానే స్వయంగా నేను వీడ్కోలు పలికాను అని మరో ప్రకటన చేయడమే తరువాయి. అందుకే.. మ్యాచ్ ముగియగానే ఇంగ్లాండ్ క్రికెటర్లు 'గార్డ్ ఆఫ్ ఆనర్'తో డెవెనెకు వీడ్కోలు పలికారు. ఇరుజట్ల క్రికెటర్లు. ఇరువైపులా నిలబడి.. చప్పట్లు కొట్టారు. ఆలింగనం చేసుకొని.. సుదీర్ఘ కెరీర్ గొప్పగా సాగినందుకు అభినందనలు తెలిపారు.

**పేస్ ఆల్‌రౌండర్‌గా..**

క్రికెట్‌కు ఏమంత ఆదరణ లేని న్యూజిలాండ్‌లో యువతరానికి స్ఫూర్తిగా నిలిచింది సోఫీ డెవెనె. 2006 అక్టోబర్ 22న తొలి వన్డే ఆడిన ఆమె.. అనతికాలంలోనే జట్టులో కీలకమైంది. పేస్ ఆల్‌రౌండర్‌గా రాణిస్తూ.. ఓపెనర్‌గా శుభారంభాలు ఇస్తూ ఎన్నో చిరస్మరణీయ విజయాల్లో భాగమైంది డెవెనె. 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్లో 159 వన్డేలు ఆడిన తను.. 9 శతకాలు, 18 హాఫ్ సెంచరీలతో కలిపి 4,279 పరుగుల చేసింది. బంతితోనూ సత్తా చాటి 111 వికెట్లు పడగొట్టింది. అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన.. 3/24.

## భారత్‌తో సెమీ ఫైనల్‌కు ఆస్ట్రేలియా కెప్టెన్ దూరం!



మహిళల వన్డే ప్రపంచ కప్ 2025 సెమీ ఫైనల్‌లో భారత్‌కు కఠిన ప్రత్యర్థి ఎదురైంది. వరల్డ్ కప్ కలను నెరవేర్చుకోవాలంటే ముందుగా సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించాల్సి ఉంటుంది. అక్టోబర్ 30న నవీ ముంబయిలో జరగనున్న ఈ కీలక మ్యాచ్‌కు ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ దూరమయ్యే అవకాశముంది. ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌కు ముందు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా హీలీ గాయపడింది. పిక్క కండరానికి గాయమవడంతో ఇంగ్లాండ్, సౌతాఫ్రికా మ్యాచ్‌లకు దూరమైంది. అయితే, ఆ రెండు మ్యాచ్‌ల్లో అలీసా లేని లోటు కనిపించలేదు. రెండింటిలోనూ ఆస్ట్రేలియా భారీ విజయం సాధించింది. తాజాగా అలీసా గాయం గురించి ఆసీస్ హెడ్ కోచ్ షెల్లీ నిట్కే అప్‌డేట్ ఇచ్చారు. హీలీ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదని ఆదివారం పేర్కొన్నారు. 'అలీసా పూర్తి స్థాయిలో కోలుకోలేదు. ఆమె పరిస్థితిని ఎప్పటికప్పుడు వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. సెమీ ఫైనల్‌కు ఇంకా సమయం ఉంది. అప్పటికల్లా హీలీ కోలుకుని సెమీస్‌లో ఆడుతుందని ఆశిస్తున్నాం' అని ఆసీస్ హెడ్ కోచ్ తెలిపారు. ఈ టోర్నీలో ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లే ఆడిన హీలీ 294 పరుగులు చేసింది. భారత్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో అలీసా ఆకాశమే హద్దుగా చెలరేగింది. 107 బంతుల్లోనే 21 ఫోర్లు, 3 సిక్స్‌లతో 142 పరుగులు చేసి టీమ్‌ఇండియా నుంచి మ్యాచ్‌ను లాగేసుకుంది. బంగ్లాదేశ్‌పై కూడా సెంచరీ (113*) చేసింది. టీమ్‌ఇండియా చివరగా 2017 వన్డే ప్రపంచకప్‌లో ఫైనల్ చేరింది. అప్పుడు సెమీస్‌లో ఆస్ట్రేలియాపైనే గెలిచింది.

# ఫోకస్ ఆరోగ్యం

## ఎనర్జీ డ్రింక్స్‌లో కేన్సర్ కారకాలు!



వివిధ కారణాలతో చాలా మంది తీసుకునే ఎనర్జీ డ్రింక్స్‌లో కేన్సర్ కారకాలు ఉన్నాయన్న వార్త ఇప్పుడు సంచలనం సృష్టిస్తున్నది. తాజా అధ్యయనాలను ఉటంకిస్తూ, అంతర్జాతీయ మీడియా వార్తా కథనాల ప్రకారం టౌరీన్ అనే అమినో ఆమ్లం శరీరంలో సహజంగా ఉంటుంది. అయితే, దీనిని ఎనర్జీ డ్రింక్స్‌లోనూ శాస్త్రవేత్తలు గుర్తించారు. టౌరీన్ అనేది ఎముక మూలుగులో, లుకేమియా (బ్లడ్ కేన్సర్) కణాలను వేగంగా అభివృద్ధి చేస్తుంది. టౌరీన్ అందుబాటును నిలిపివేసినప్పుడు, కేన్సర్ పెరుగుదల మందగించింది. దీనిని బట్టి, కేన్సర్ కణాలు తమ శక్తిని పెంచుకోవడానికి కేవలం జన్యు మార్పులను మాత్రమే కాకుండా, టౌరీన్ వంటి ఇతర ఇంధనాన్ని కూడా పొందుతున్నాయని అర్థమవుతున్నది. టౌరీన్ అధిక మొతాదులో ఉండే ఎనర్జీ లేదా సప్లిమెంటరీ డ్రింక్స్ తీసుకోవడం వల్ల కేన్సర్ కణాలు, ప్రత్యేకించి లుకేమియా కణాలు ప్రమాదకర స్థాయికి పెరుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాగా, ప్రస్తుతం ఈ పరిశోధన ప్రయోగాల దశలో ఉంది. క్లినికల్ రీసెర్చ్ జరుగుతున్నది. అందులోనూ ఇదే విషయం ఖరారైతే, ఎనర్జీ లేదా సప్లిమెంటరీ డ్రింగ్స్ వాడకంపై నిషేధం విధించే అవకాశాలు ఉన్నాయి. ఏదిఏమైనా, సహజసిద్ధంగా శక్తిని పెంచుకోవడానికి ప్రయత్నించాలే తప్ప, సప్లిమెంటరీలపై ఆధారపడి కాదనే వాస్తవాన్ని ఎంత త్వరగా తెలుసుకుంటే, ఆరోగ్యానికి అంత మంచిది.

## ఎలా తింటున్నామో కూడా కీలకమే!



చాలా సందర్భాల్లో మనం ఏం తింటున్నాం అనే విషయం కంటే, ఎలా తింటున్నామన్నది మన ఆరోగ్యంపై కీలక ప్రభావం చూపుతుంది. శాస్త్రీయ పరిశోధనలను అనుసరించి, టర్కీ (సీమ కోడి) మాంసం, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ (సూక్ష్మ క్యాబేజీని పోలిన తృణ ధాన్యాలు)ను కలిపి తీసుకుంటే, అత్యంత అధిక పోషకాలు శరీరానికి లభిస్తాయి. ఈ రెండింటినీ కలిపి తింటే, కేవలం ఆకలి తీరడమేగాక, శరీరానికి అవసరమైన జీవరసాయన సమన్వయాన్ని కూడా అందిస్తాయి. టర్కీ మాంసంలో ఉన్న లీన్ ప్రోటీన్ కండరాల పునరుద్ధరణకు, కణాల మరమ్మతుకు సహాయపడుతుంది. ఇందులో ఉన్న ట్రిప్టోఫాన్ అనే అమినో ఆమ్లం సెరోటోనిన్ స్థాయిని పెంచి, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఇక బ్రస్సెల్స్ స్ప్రౌట్స్లో ఆంటీఆక్సిడెంట్స్, ఫైబర్, విటమిన్ 'కె', సల్ఫర్ కలిగిన సమ్మేళనాలు ఉంటాయి. ఇవి కండరాల్లోని వాపును తగ్గించి, శరీర డీటాక్స్ లో సహాయపడతాయి. టర్కీలోని ప్రోటీన్, స్ప్రౌట్స్‌లోని ఫైబర్ కలయిక వల్ల స్థిరమైన రక్తంలో చక్కెర స్థాయిలు లభిస్తాయి. వ్యాయామం తర్వాత వచ్చే వాపు తగ్గి, శరీర పునరుద్ధరణ వేగంగా జరుగుతుంది. టర్కీలోని జింక్, స్ప్రౌట్స్‌లోని విటమిన్ 'సి' రోగనిరోధక శక్తిని సహజ మానవ కవచంలా పెంచుతాయి. ఈ కలయిక ఎక్కువ శ్రమ ఉన్న వ్యాయామం తర్వాత, జలుబు/ఫ్లూ కాలంలో, లేదా శక్తి తగ్గినప్పుడు ప్రత్యేకంగా ప్రభావవంతంగా ఉంటుంది. ఇది తక్కువ కేలరీలు కలిగి, సహజ రుచులతో నిండి ఉంటుంది. ఎటువంటి ప్రాసెస్ చేయబడిన పదార్థాలు అవసరం లేదు. అందువల్ల తదుపరి తీసుకునే ఆహారంలో కేలరీల గురించి కాకుండా సమన్వయం గురించి ఆలోచించడం అవసరం.

## రద్దీ ప్రదేశాల్లో ఇబ్బంది..

విపరీతమైన రద్దీ ఉన్న ప్రదేశాలు ఎవరికైనా చికాకు తెప్పిస్తాయి. అవి కేవలం చూడడానికి ఇబ్బందికరంగా ఉండడమేకాదు, శరీరం, మనసుపై నేరుగా ప్రభావం చూపిస్తాయని తాజా పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సమస్య పురుషుల కంటే మహిళలపైనే ఎక్కువగా ఉంటుందని పేర్కొంటున్నాయి. నివేదికలను అనుసరించి, రద్దీగా, అపరిశుభ్రంగా ఉండే వాతావరణంలో మహిళలు తీవ్రస్థాయిలో ఒత్తిడికి గురవుతున్నారు. ఈ పరిస్థితి కారణంగా కార్టిసాల్ అనే ప్రధాన ఒత్తిడి హార్మోన్ శరీరంలో అధికమవుతుంది. ఇది శరీరంలోని అనేక వ్యవస్థల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. నిరంతర ఒత్తిడి, రాత్రిపూట నిద్రలో అంతరాయం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అంతేగాక, కార్టిసాల్ రక్తపోటును పెంచుతుంది. రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది. కొవ్వు నిల్వలను, ముఖ్యంగా పొట్ట చుట్టూ పెంచే ప్రమాదం ఉంటుంది. ఇల్లు లేదా కార్యాలయం రద్దీగా ఉండడం వల్ల మానసిక ఏకాగ్రత తగ్గి, పనులపై కేంద్రీకరించడం కష్టమవుతుంది. దీని వల్ల పనితీరు తగ్గిపోగా, భావోద్వేగ స్థిరత్వం కూడా దెబ్బతింటుంది. ఈ తాజా పరిశోధనలో వాతావరణం మన శరీరంలోని బయోలాజికల్ ప్రతిస్పందనలపై స్పష్టమైన ప్రభావం చూపుతుందని గుర్తించారు. ముఖ్యంగా మహిళలు కనబడే అవ్యవస్థ, అస్తవ్యస్తత వంటి దృశ్య ఒత్తిడి తత్వాలకు మరింత సున్నితంగా స్పందించే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. అయితే, ఈ ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడం సాధ్యమే. ప్రతిరోజు లేదా వారానికి ఒకసారి అయినా ఇంట్లో, కార్యాలయంలో ఉన్న వస్తువులను సక్రమంగా సర్దుకోవడం, అవసరం లేని వస్తువులను తొలగించడం ద్వారా మన వాతావరణాన్ని ప్రశాంతంగా, శుభ్రంగా ఉంచుకోవచ్చు. ఇలాంటి అలవాట్లు శారీరకంగా కార్టిసాల్ స్థాయిలను తగ్గించడమే కాకుండా, మానసికంగా ప్రశాంతతనూ, ఉత్పాదకతనూ పెంచుతాయి. 'మైండ్‌ఫుల్‌నెస్' క్లీనింగ్ లేదా 'చింతనాత్మక శుభ్రత' అలవాటు చేసుకోవడం ద్వారా మనలో నియంత్రణ భావన, సాధించిన అనుభూతి పెరుగుతుంది. చిన్నచిన్న శుభ్రపరచే చర్యలే దీర్ఘకాలికంగా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. మొత్తానికి, రద్దీతో నిండిన ఇల్లు కేవలం దృష్టికే అసౌకర్యం కలిగించేది మాత్రమేకాదు... దీని ప్రభావం మన శరీరంలోనూ, మనసులోనూ లోతుగా ప్రతిధ్వనిస్తుంది. చుట్టూ ఉన్న స్థలాన్ని సరళతగా, పరిశుభ్రంగా మార్చుకోవడమే ఒత్తిడిని తగ్గించడానికి, ఏకాగ్రతను పెంచడానికి, దీర్ఘకాలిక ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడానికి అత్యుత్తమ సహజమైన మార్గం.



ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## ప్రజల సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోదీ

### ఎల్ఐసి నిధుల మళ్లింపుపై విచారణ జరపాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రజల సంపదను మోదీ సర్కార్ కార్పొరేటర్లకు కట్టబెడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. ఇప్పుడు జీవిత బీమా సంస్థకు సంబంధించిన రూ. 32వేల కోట్లను కేంద్ర ప్రభుత్వ అనుమతితో అదానీ ఖాతాలకు మళ్లించినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే దేశ సంపదను మొత్తం కార్పొరేట్ల పరం చేసిన మోదీ దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉండి కోట్లాది మంది ప్రజల జీవితాలతో ముడిపడిన ఎల్ఐసిని కూడా అదానీకి దారాదత్తం చేసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని సురేష్ తెలిపారు. దేశ ప్రజల కోసం కాకుండా మోదీ కేవలం అంబానీ, అదానీల కోసమే పాలన చేస్తున్నారన్నారు. దేశంలో ఆర్థిక పరిస్థితులు నానాటికి దిగజారుతున్నాయని దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న వారి సంఖ్య పెరుగుతుందని ఇటువంటి పరిస్థితుల్లో కనీస చర్యలు తీసుకోవడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే ఎల్ఐసి నిధుల తరలింపుపై సమగ్ర విచారణ జరిపించాలని అంబానీ, అదానీ ఆస్తులకు సంబంధించి నిధుల మళ్లింపుపై కేసులు నమోదు చేయాలన్నారు. సిపిఐ ఆధ్వర్యంలో ఎల్ఐసి నిధుల మళ్లింపుపై ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

## మతతత్వ బీజాలు నాటే విద్యా విధానాన్ని నిలిపేయండి

### ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం నూతనంగా పిఎంశ్రీ స్కూల్స్ ఏర్పాటు చేయడం ద్వారా నూతన విద్యా విధానం పేరుతో పసిపిల్లల మెదళ్లలో మతతత్వ బీజాలు నాటే ప్రయత్నం చేస్తుందని వెంటనే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో గల గిరి ప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 2022 23 నుండి 2026 2027 వరకు ఐదేండ్ల కాలంలో దేశ వ్యాప్తంగా పిఎంశ్రీ సుమారుగా 14,500 పాఠశాలలను నెలకొల్పాలని, ప్రాథమిక విద్య నూతన విద్యా విధానం ద్వారా మతతత్వ బోధనలు చేయాలని తలపెట్టిందని ఇది అభివృద్ధి నిరోధక విధానమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి మండలానికి పిఎంశ్రీ పాఠశాల ఏర్పాటు చేయడానికి పూనుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై పునరాలోచన చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా విద్యావేత్తలు, ప్రగతిశీల మేధావులు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యా విధానం సరైంది కాదని చాలా కాలంగా నిరసనలు చేస్తున్నారన్నారు. నూతన విద్యా విధానం ప్రణాళికను రద్దు చేయాలని మొదటి నుండి ఏఐఎస్ఎఫ్ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయకపోతే దేశ వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, జిల్లా నాయకులు గోపి, పవన్, నరేందర్, సందీప్, వెంకట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పక్షాన నిరంతర పోరాటం

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్

### వేములవాడలో ఎఐటియుసి 4వ మహాసభ విజయవంతం





ప్రజాపక్షం/ వేములవాడ టౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని గుమ్మి పుల్లయ్య భవన్‌లో ఎఐటియుసి 4వ మహాసభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిధులుగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్, ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఏం. నర్సింహా, సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్, తెలంగాణా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, ఎఐటియుసి కరీంనగర్ జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎఐటియుసి 1920 అక్టోబర్ 31 న స్థాపించిన నాటినుండి నేటి వరకు ఈ జిల్లాలో రాష్ట్ర, కేంద్ర, ఎఐటియుసి నాయకులు సహకారం తో ఎన్నో పోరాటాలు చేసి, కొన్ని విజయాలు, హామీలు అమలు చేసుకున్నామన్నారు. భవిష్యత్తులో అన్ని రంగాల కార్మిక వర్గాలను కలుపుకొని భవిష్యత్తు పోరాటానికి ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నుకోవడం జరిగింది అన్నారు. అధ్యక్షులుగా అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, ఉపాధ్యక్షులు కె.వి. అనసూర్య, పందుల మల్లేశం, దుంద్రపెల్లి రవీందర్, వడ్లూరి కేతవ్వ, గాజుల రాధ, కోశాధికారి బచ్చుపల్లి శంకర్, సహాయ కార్యదర్శి గా మీసం లక్ష్మ న్, గాజుల పోశెట్టి, భూంపెల్లి భూంరెడ్డి, అనవేణి భూదన్న, శ్రీరామ్ నర్సయ్య, కౌన్సిల్ సభ్యులుగా పండుగ పోచమల్లు, ఎల్ల దేవరాజు, కట్కూరి రాజేశ్వరి,ఈసరిదేవయ్య,తాళ్లపెల్లి రాములు, ఎదురుగట్ల మమత, చొప్పరి అంజలి, ఓరుగంటి శ్యామల, కొండికోప్పుల పద్మ, సుంకణపెల్లి శాంత, సామనపెల్లి జ్యోతి, బీరేటి. లక్ష్మి ,మల్లమారి సుధారాని, సుంకపాక పుష్ప, మండల లీలావతి, ములుగు పద్మ, కన్నం రజిత, నర్సిం గోజీ మారుతి, గాజుల వజ్రవ్వ, కుమ్మరి మంగ, కొత్తపెల్లి రవి, దప్పు స్వామి, బర్ర రాజయ్య, మెతుకు లచ్చయ్య, సురువు మొండయ్య, లింగంపల్లి సుమలత తదితరులను ఎన్నుకున్నారు.

## కార్మిక వర్గానికి కనీస వేతనాలు ఎప్పుడిస్తారు?

### కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్

ప్రజాపక్షం/వెంకటాపూర్ (రామప్ప) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో బండి నరసయ్య అధ్యక్షతన జరిగిన ఎఐటియుసి వెంకటాపూర్ మండల మహాసభకు, ముఖ్యఅతిథిగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ఎఐటియుసి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిన ఎఐటియుసి 105 సంవత్సరాలు దాటుకొని ముందుకు సాగుతున్నదన్నారు. కార్మిక వర్గానికి సుప్రీంకోర్టు నిర్ణయించిన ప్రకారంగా సమాన పనికి సమాన వేతనాలు ఎందుకు చెల్లించడం లేదన్నారు. మధ్యాహ్న భోజన వంట కార్మికులకైతే కేవలం నెలకు రూపాయలు 600 మాత్రమే చెల్లిస్తూ, శ్రమ దోపిడీకి గురిచేస్తుందన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును, ప్రైవేటుపరం చేసిభవన నిర్మాణ కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మిక వర్గానికి అధికారంలోకి రాగానే కనీస వేతనాలు అందిస్తామని చెప్పి, ఇప్పటికీ అమలు చేయడంలేదన్నారు.కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, థర్డ్ పార్టీ విధానం విరమించుకొని,అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్ల అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డును తిరిగి ప్రభుత్వం ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్లకు చెల్లిస్తామన్న డబ్బులు, ఇప్పటికీచెల్లించడంలేదన్నారు.పాఠశాల మధ్యాహ్న భోజన వంట కార్మికులకు రూపాయలు 10 000 చెల్లిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు.అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.హమాలీ కార్మిక సంఘం జిల్లా నాయకులు గాలి సమ్మయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేందర్, మధ్యాహ్న భోజన వంట కార్మికసంఘం జిల్లా అధ్యక్షురాలు సామల రమ, స్కావెంజర్స్ యూనియన్ జిల్లా నాయకులు లావణ్య, ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా నాయకులు తోట సంపత్, ములుగు, ఏటూరు నాగారం, మంగపేట, వెంకటాపురం, మండల ఏఐటీయూసీ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గుంజే శ్రీనివాస్, పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి, కుడుముల సమ్మక్క, జిల్లా ఉపాధ్యక్షురాలు అజిత, విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి సాగర్,రాధ, రాధిక, స్వరూప, నర్సయ్య,శ్రీనివాస్, స్వరూప, పార్వతి, సుశీల, రామలక్ష్మి, గుర్రం రమేష్, గుర్రం మురళి, దేవేందర్, నర్సయ్య, వీరస్వామి పాల్గొన్నారు.





### పాఠశాలలో పనిచేస్తున్న వంట కార్మికులకు న్యాయం చేయాలి

ములుగు: ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న వంట కార్మికులకు న్యాయం చేయాలని వివిధ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వెంకటాపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వంట కార్మికుల సమస్యల పరిశీలన కోసం జంపాల రవీందర్అధ్యక్షతనఏర్పాటుచేసిన ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యార్థి, మహిళ, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎస్‌టియూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, హమీద్, టిటియూ, ఎండి సర్వర్ అహ్మద్, ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాడపాక శ్యామ్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అహ్మద్ పాష, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేందర్‌లు మాట్లాడారు. వంట కార్మికులకు, వంట బిల్లులు పెండింగ్‌లో ఉంటే ఎలా వంటలు చే స్తారన్నారు. అతి తక్కువగా వచ్చే వేతనాలు కేవలం రూ.3 వేలు, కేంద్ర ప్రభుత్వం అయితే కేవలం రూ.600 మాత్రమే చెల్లిస్తూ నెలలకు నెలలు పెండింగ్‌లోఉండడంతో ఇబ్బంది పడు తున్నారు. మధ్యాహ్నభోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నాల రాజకుమారి, పోరెడ్డి ప్రమీల, కమలక్క, రాధక్క, గడ్డం భారతి, కుడుముల సమ్మక్క, రాధిక పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెల బిల్లులు, వేతనాలు చెల్లించాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్: రాష్ట్రంలో పేద బలహీన వర్గాల విద్యార్థులను పాఠశాలకు రప్పించడం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం కోసం 2003లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు.ఆదివారం ఏఐటియుసి కార్యాలయంలో మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేండ్ సమావేశానికి జిల్లా కార్యదర్శి చక్రపాణి అధ్యక్షత వహించగా పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, టిపిటిఎఫ్ అధ్యక్షులు సురేష్, విద్యార్థిసంఘాలప్రజా సంఘాలనాయకులు పాల్గొన్నారు. ఓమయ్య మాట్లాడుతూ ఆనాడు ఒక రూపా యి 25 పైసలతో ప్రారంభమైన పథకం ఈరోజు ఆరున్నర రూపాయలకు పెంచడం జరిగిందని, నేటి పరిస్థితిలో విద్యార్తులకు భోజనం పెట్టడానికి ఈ డబ్బులు ఏ మాత్రం సరిపోవన్నారు. ఒక విద్యార్తికి నాణ్యమైన ప్రభుత్వ మెను ప్రకారం భోజనం పెట్టాలంటే 25రూపాయలు ఖర్చవుతుందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఆర్థికంగా ప్రభుత్వం సహకరించాలని సూచించారు. ఉపాధ్యాయ విద్యార్థి సంఘాల నాయకులు ఏఐటియుసి నిర్వహించే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం నాయక్, పిడిఎస్‌యు నాయకులు గణేష్, రాజేశ్వర్, ఏఐపిఎస్‌యు అనిల్, ఎస్ఎఫ్ఐ సుజిత్, ఇన్సాఫ్ ఇమ్రాన్ అలీ, ఫిరోజ్ అలీ, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు గంగామని, నాగలక్ష్మి, సుబోద్, వంశీ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## శతాబ్ది ఉత్సవాలకు భారీగా తరలిరండి



**ప్రజాపక్షం/ఇల్లందు:** సిపిఐ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలకు నియోజకవర్గంలో భారీగా తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్ అన్నారు. ఆదివారం ఇల్లందు మండలంలోని 21 ఏరియాలో గడప గడపకు సిపిఐ కార్యక్రమంలో ప్రచారాన్ని విస్తృతం చేసి, విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ పేద గిరిజన బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం, ప్రజా సమస్యల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవాల బహిరంగ సభకు మండలం నుండి భారీ సంఖ్యలో ప్రజలు కార్యకర్తలు తరలి రావాలనిపిలుపునిచ్చారు. బొప్పిశెట్టి సత్యనారాయణ, బాస శ్రీనివాస్, గుడిపల్లి భాస్కర్, మంచాల వెంకటేశ్వర్లు, కృష్ణ, వడ్ల శ్రీను, బసిపాక రవి, రాందాస్, లక్ష్మీ నారాయణ రాఘవేంద్రరావు, పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి: సంక్షేమ** హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని పిడిఎస్‌యూ కారేపల్లి మండల కార్యదర్శి సంజయ్ అన్నారు. ఆదివారం కారేపల్లి మండల కేంద్రంలోని పిడిఎస్‌యు మండల కమిటీ ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ హాస్టల్‌లో పిడిఎస్‌యు బృందం సందర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 20 నెలలు కావస్తున్న సంక్షేమ హాస్టల్స్‌లో సరిగా వసతులు లేక సొంత బిల్డింగులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి డేట్ బిల్లులు పడక విద్యార్థులు ఇబ్బందులు గురవుతున్నారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.స్కాలర్షిపు లు, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా ఉన్న పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఉందని, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగస్తులను భర్తీ చేయాలన్నారు. ఇప్పటికైఆన రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలలో మౌలిక వసతులు కల్పించి సమస్యలను పరిష్కరించాలన్నారు. తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పిడిఎస్‌యు ఉద్యమాలు కొనసాగిస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పిడిఎస్‌యు నాయకులు లోకేష్, జీవన్, సాయి, పాల్గొన్నారు.

## గంజాయి రవాణాపై పోలీసుల ఉక్కుపాదం




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడి జిల్లాలో పలు పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తిపై ఇల్లందు పోలీసులు పిడి యాక్ట్‌ను ఆదివారం నమోదు చేశారు. ఇలాంటి నేరస్థుల వలన ఎంతో మంది యువత మత్తుకు బానిసలై తమ ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకొంటున్నారని అందుకే ఇలాంటి వారిపై పిడి యాక్ట్ నమోదు చేయటం జరిగిందని ఎస్‌పి రోహిత్ రాజు చెప్పారు. గంజాయి సమూల నిర్మూలన కొరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చైతన్యం డ్రగ్స్‌పై యుద్ధం అనే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. దీనితో గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంతో పాటుగా జిల్లా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలవాటుగా ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి వారిపై కూడా పిడి యాక్ట్‌ను నమోదు చేస్తామని అన్నారు. నిందితుడు సపావట్ వెంకన్నపై పిడి యాక్ట్ నమోదయ్యేలా కృషి చేసిన ఇల్లందు డిఎస్‌పి సురేష్‌ను, సిబ్బందిని అభినందించారు.

## యువతకు వాలీబాల్ కిట్ అందజేత



**ప్రజాపక్షం/పినపాక:** గ్రామాల్లోని ప్రతిభను రాష్ట్రానికి ఉపయోపడేందుకు గ్రామాల్లోని యువత కృషి చేయాలని వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన యువతకు పాతరెడ్డిపాలెం గ్రామ నివాసి కాంగ్రెస్ పార్టీ నాయకులు సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం వాలీబాట్ కిట్టు, 30 టీ షర్ట్స్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత చెడువ్యాసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలతో పాటు చదువుల్లో రాణించి, తల్లి దండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. గ్రామంలో ఉన్నటువంటి క్రీడాకారులకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొప్పుల లక్ష్మ ణ్, ప్రవీణ్, మంచర్ల వంశీ, రాజు, శ్రీను, వినోద్, కృష్ణ, నాగరాజు, చిరంజీవి, నరేష్, హరీష్, అశోక్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, గ్రామస్తులు,పాల్గొన్నారు.

## సిపిఐ బహిరంగ సభ విజయవంతనికి కరపత్రాల ప్రచారం



**ప్రజాపక్షం/మణుగూరు:** ఖమ్మం జిల్లా లో డిసెంబర్ 26వ జరుగు సిపిఐ బహిరంగ సభ విజయవంతం చేయగలరని కోరుతూ మణుగూరులో సీపీఐ మండల, పట్టణ కమిటీ ల ఆధ్వర్యంలో మూడు గ్రూప్ లుగా ఏర్పడి ఆదివారం మణుగూరు మండలం లోనీ గ్రామాలు సమితి సింగారం, పట్టణంలో శ్రీ శ్రీ నగర్ గ్రామంలో , సుందరయ్య నగర్ గ్రామం లో కరపత్రం పంచుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు.సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీపీఐ జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు నాయకత్వం వహించగా సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ పట్టణ కమిటి కి నాయకత్వం వహించగా సిపిఐ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి నాయకత్వం వహించగా యూసీ మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శిలు రాయల బిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్, మంగి వీరయ్య, మండల సహాయ కార్యదర్శి వేర్పుల నరేష్,రాములు, ఎస్టీ ఉమర్, దుబ్బాక నిర్మల,ఆంజనేయులు, రంజిత్, సాంబ పాల్గొని ప్రచారం చేశారు.

## ‘వైరా’ సిఐగా బాధ్యతలు చేపట్టిన ఎల్లావుల వెంకటప్రసాద్



**ప్రజాపక్షం/వైరా:** వైరా నూతన సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా ఎల్లావుల వెంకటప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన వెంకటప్రసాద్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా వరంగల్ జిల్లాలో బాధ్యతలు నిర్వహించారు. అనంతరం సిఐగా పదోన్నతి పొందిన తర్వాత ఇంటిలిజెన్స్‌లో సుమారు నాలుగు సంవత్సరాల పైన ఇంటిలిజెన్స్‌లో బాధ్యతలు నిర్వహించిన వెంకటప్రసాద్ బదిలీపై వైరా సిఐగా వచ్చారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం వెంకటప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల నేరుగా నన్ను కలవచ్చు అని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

# జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు
ఎంపి రామ సహాయం
రాష్ట్రంలో ఆరు చోట్ల జాబ్ మేళాలు
72 కంపెనీలు.. 4611 ఉద్యోగాలు
హజరైన 14,300మంది నిరుద్యోగులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా దంపతుల కృషితో, సింగరేణి, టాస్క్ వారి సౌజన్యంతో సత్తుపల్లి పట్టణంలో ఆదివారం జరిగిన మెగా జాబ్ మేళా గ్రాండ్ సక్సెస్ అయింది. సుమారు 14,300 మంది నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరుకాగా, 72 కంపెనీలు పాల్గొని, 4611 మంది నిరుద్యోగులను ఉద్యోగులుగా నియమించుకున్నాయి. సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కు మార్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎ ంపీ రామ సహాయం రఘురాం రెడ్డి ముఖ్య అ తిథిగా హాజరయ్యారు.ఎంపి రామసహాయం మా ట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే నిరుద్యోగుల కోసం రాష్ట్రంలో జాబ్ మేళా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. 140 కోట్ల జనాభా కలిగిన ఈ దేశంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని ఆ ందోళన వ్యక్తం చేశారు. ఏమైనా కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలు విడుదలైతే పోటీ ఎక్కువగా కనిపిస్తుందని, అందుకే ప్రైవేట్ కంపెనీల ఇంటర్వ్యూలకు భారీగా స్పందన కనిపిస్తుందని పేర్కొన్నా రు. ముఖ్యంగా రూరల్ ఏరియాలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని తెలిపారు. అందుకే జాబ్ మేళాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. సత్తుపల్లిలో నిర్వహి ంచిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించిందని ఆశాభావం వ్యక్తం చేశారు. సత్తుపల్లిలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు తన వం తు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే డా క్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ పెద్ద పెద్ద ప్యాకేజీలు, ఇంటి దగ్గర్లోనే ఉద్యోగం అనే ఆలోచ న లేకుండా లభించిన ఉద్యోగాన్ని సద్వినియోగపరుచుకోవాలని శాసన సభ్యులు డాక్టర్ మట్టా రాగమయి కోరారు. పిల్లలు తల్లిదండ్రులకు భారం కాకూడదని విజ్ఞప్తి చేశారు. ఏరియా అయిన సత్తుపల్లిలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చే శారు. నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సింగరేణి డైరెక్టర్ తిరుమలరావు, కొత్తగూడెం ఏరియా మేనేజర్ శాలెం రాజు, డి ప్యూటీ జిఎం కోటిరెడ్డి, కిష్టారం ప్రాజెక్టు మేనేజర్ నరసింహారావు, జివిఆర్ ఓసి పిఓ ప్రహ్లాద్, సత్తుపల్లి ఎమ్మార్వో పున్నం సత్యనారాయణ, ఎంపీడీ వో నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ నరసిం హ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సుజలరాణి, సీనియర్ కాంగ్రెస్ నాయకుల్లు శ్రీనివాసరావు, కమల్ పాషా పాల్గొన్నారు.

# పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఐ జిల్లా నాయకుడు చింతల రమేష్ డిమాండ్

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** అధిక వర్షాలతో నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా నాయకులు చింతల రమేష్ డిమాండ్ చేశారు. కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) నిబంధనలు సడలించి పత్తి కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలన్నారు. మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామంలో సిపిఐ బృందం అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిసిఐ పత్తి కొనుగోలులో తీసుకు వచ్చిన మార్పుల మూలంగా జిన్నింగ్ మిల్లుల యజమానులు కూడా సిసిఐ సెంటర్లకు అవకాశం ఇవ్వటం లేదని రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. తేమ శాతం ఎనిమిది ఉంటేనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.8,110 మద్దతు ధర రైతులకు చెల్లిస్తామనే నిబంధనలు సడలించాలన్నారు. ఎనిమిది నుంచి 12 శాతం ఉండాలనే నిబంధనను 12 నుంచి 15 శాతంకు మార్చాలని ఆయన డిమాండ్ చే శారు. స్మార్ట్ ఫోన్లు వినియోగించలేని రైతుల దగ్గర పత్తి కొనుగోలు నిరాకరించడమే అవుతుందన్నారు. అధిక వర్షాలతో ఈ ఏడాది పత్తి రైతులు తీ వ్రం గా నష్టపోయారన్నారు. పండిన కొద్ది పాటి పత్తిని కూడా దళారులు ఆరువేల లోపే కొనుగోలు చేస్తున్నారని దీనితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోయిన పత్తి రైతులకు ఎకరాకు రూ. 30వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.సిపిఐ మండల సహాయ కార్యదర్శి జుల వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు ప్రొద్దుటూరు వెంకటరెడ్డి, గ్రామశాఖ కార్యదర్శి గాడిచర్ల సత్యనారాయణ, గ్రామ నాయకులు రాచర్ల లక్ష్మి నారాయణ, కాళంగి చిన్న పిచ్చ య్య, పెద్దరెడ్డి, గాడిచర్ల నాగేశ్వరరావు, ఉ ప్ప య్య, పావురాల వెంకటేష్, తోట రఘుపతిరా వు, పరిమిశెట్టి కృష్ణయ్య, పావురాల రాముడు, మల్లెంపాటి రమేష్ పాల్గొన్నారు.



## చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



**ప్రజాపక్షం/పాల్వంచ :** తల్లిదండ్రులు పిల్లలకు చదువు చెప్పించాలని దానితోనే సామాజికంగా, ఆర్థికంగా మార్పు వస్తుందని, ఉజ్వల భవిష్యత్‌ను అందుకొంటారని జిల్లా కలెక్టర్ జితేష్‌వి. పాటిల్ అన్నారు. మండల పరిధి బంద్రుగొండ పంచాయితీ కోయగట్టు గ్రామాన్ని ఆదివారం సంధర్శించారు. ఈ సంధర్భంగా కంప్రెస్డ్ స్టెబిలైజ్డ్ ఎర్తన్ బ్లాక్ లను ఎలా తయారు చేయాలో స్వయంగా పార, పలుగు చేతబట్టి మట్టి కలిపి చేసి చూపించారు. అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ దానికి ప్రభుత్వం పై ఆధారపడవద్దని సూచించారు.ఉదయం, సాయంత్రం సమయంలో గ్రామస్తులు ఉమ్మడిగా బ్రిక్స్ తయారు చేసి గ్రామంలోని పాఠశాలకు ఉపయోగించుకోవాలన్నారు. అడవిలో చెట్ల ద్వంసం చేయకుండా ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పథకంలో భాగంగా చేపల పెంపకం, కౌజు పిట్టల పెంపకం, వెదురు పెంపకం చేపట్టి ఆదాయాన్ని పొందాలని తెలిపారు. చదువుకొన్న పిల్లలకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారాశిక్షణను ఇప్పించి ఉపాధి కల్పించే బాద్యతను తీసుకొంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ విజయ భాస్కర్‌రెడ్డి, ఎంపిఒ చెన్న కేశవులు, ఏపిఒ పోరండ్ల రంగా, ఆర్ఐ. ప్రసాద్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, ఈసీలు రాజు, తిరుపతయ్య, కార్యదర్శులు నారాయణ, ప్రవీన్ కుమార్, శంకర్, రాములు పాల్గొన్నారు.

## ప్రజల సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోడీ

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజల సంపదను మోడీ సర్కార్ కార్పొరేటర్లకు కట్టబెడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. ఇప్పుడు జీవిత బీమా సంస్థకు సంబంధించిన రూ. 32వేల కోట్లను కేంద్ర ప్రభుత్వ అనుమతితో అదానీ ఖాతాలకు మళ్లించినట్లు వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే దేశ సంపదను మొత్తం కార్పొరేట్ల పరం చేసిన మోడీ దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉండి కోట్లాది మంది ప్రజల జీవితాలతో ముడిపడిన ఎల్ఐసిని కూడా అదానీకి దారాదత్తం చేసేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని సురేష్ తెలిపారు. దేశంలో ఆర్థిక పరిస్థితులు నానాటికి దిగజారుతున్నాయని దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న వారి సంఖ్య పెరుగుతుందని ఇటువంటి పరిస్థితుల్లో కనీస చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే ఎల్ఐసి నిధుల తరలింపుపై సమగ్ర విచారణ జరిపించాలని అంబానీ, అదానీ ఆస్తులకు సంబంధించి నిధుల మళ్లింపుపై కేసులు నమోదు చేయాలన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాలకు వేలాదిగా తరలిరావాలి

పార్టీ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు

**ప్రజాపక్షం/పాల్వంచ :** భారత కమ్యూనిస్టి పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సంధర్భంగా డిసెంబర్ 26న, ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు మండల వ్యాప్తంగా వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు పిలుపునిచ్చారు. మండల పరిధి జగన్నాధపురంలో బహిరంగ సభకు సంభందించిన ప్రచార కరపత్రాలను ఆదివారం పంచిపెట్టారు. ఈ సంధర్భంగా పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఘన చరిత్రను ప్రజలకు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో అధికారం లేకపోయినా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాం చేసింది కేవలం సిపిఐ పార్టీ మాత్రమేనన్నారు. ప్రజల పక్షాన నిలబడుతూ అనేక ఉద్యమాలను నిర్వహించి ప్రజలకు కార్మికులకు హక్కులు సాధించి పెట్టిన ఘన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. ఈ క్రమంలో ఎందరో పార్టీ అగ్ర నాయకులు అసువులు బాశారన్నారు. 1925.12.25వ, తేదీన పార్టీ ఆవిర్భవించన నాటి నుండి నేటి వరకు అనేక పోరాటాలు చేసిన సిపిఐ పార్టీ వచ్చే డిసెంబర్ 25 శతాబ్ది ఉత్సవాల ముగింపు సంధర్భంగా నిర్వహించే సభకు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ జన సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరు అవుతున్నారని పేర్కొన్నారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, మేదావులు, అన్ని వర్గాల ప్రజలు సభకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా సమితి సభ్యులు ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, మండల కార్యవర్గ సభ్యులు లావుడియా చందూలాల్, శాఖ నాయకులు ధరంసోత్ సీతారాం పాల్గొన్నారు.



# పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రఘునాథపాలెం మండల జనరల్ బాడీ సమావేశం బానోత్ మంగీలాల్, కాలిపొగు లింగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందికి పని భారం ఎక్కువైందన్నారు. గ్రామ పంచాయతీలో కొంత మంది సిబ్బంది తమ సొంత ఇబ్బందుల వల్ల విధులు మానేశారని కానీ అధికారులు వారి స్థానంలో కొత్త వారిని నియమించకుండా ఉన్న వారితోనే పని చేయిస్తున్నారని దీనితో పని భారం ఎక్కువైందన్నారు. పని చేయకపోతే ఉద్యోగం నుండి తొలగిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. కొంత మంది పంచాయతీ కార్యదర్శులు జీతాలు వ్రాయకుండా ఇబ్బందులు పెడుతున్నట్లుమా దృష్టికి వచ్చిందన్నారు. జిల్లా నాయకులు గుగులోత్ రాందాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు మంగీలాల్, రాజగోపాల్, నాయ నారాయణ, రేణుక, తోట మధు, ఎ. రాము, ఉపేందర్, వీరయ్య, పాల్గొన్నారు.

# ఎరువు మరింత బరువు

పెరగనున్న కాంప్లెక్స్ ఎరువుల ధరలు
డీలర్లకు సమాచారమిచ్చిన కంపెనీలు

**ప్రజాపక్షం/చింతకాని:** వచ్చే యాసంగి సీజన్ లో సాగుచేసే పంటలకు వేసే ఎరువుల ధరలు మరింత భారం కానున్నాయి. తాజాగా కొన్ని కాంప్లెక్స్ ఎరువుల ధరలు సంచికి రూ.50 పెరగ్గా మరి కొన్నింటికి 50 కిలోల బస్తాపై ర.25 నుంచి రూ.100 వరకు ధరల పెంపు ఉంటుందని ఎరువుల దుకాణాల డీలర్లకు ప్రముఖ కంపెనీలు సమాచారం ఇచ్చాయి. ప్రస్తుతం పాత నిల్వలు ఉండటంతో గతంలో ఉన్న ధరలకే విక్రయిస్తున్నారు. ముడి సరుకు ధరలు పెరిగిన కారణంగానే యాసంగి సీజన్‌లో రైతులు వినియోగించే ఎరువుల ధరలు పెరగబోతున్నాయని కంపెనీలు చెబుతున్నాయి. అయితే పెరగనున్న ఎరువుల ధరల భారం రైతులపైనే పడనుంది.

### కాంప్లెక్స్ ఎరువుల ధరలే పెంపు

ప్రస్తుతం వానాకాలం సీజన్ పూర్తయి రైతులు యాసంగి సీజన్ పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు సాధారణం కంటే ఎఉ్కవగా కురవడంతో చెరువులు జలకళను సం తరించుకున్నాయి. ఫలితంగా భూగర్భ జలాలు వృద్ధిచెందడంతో పంటల సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేశారు. వానాకాలం సీజన్ కంటే ముందుగా పెరిగిన ఎరువుల ధరలకు తోడు తాజాగా మళ్లీ పెరగడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. యూరియా, డీఏపీలను మినహాయించి కాంప్లెక్స్ ఎరువుల ధ రలను మాత్రమే పెంచారు.యాసంగిలో యూరియాతో పాటు డిఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. వినియోగంలో ఎక్కువగా ఉండే కాంప్లెక్స్ ఎరువుల ధరలను ఎరువుల కంపెనీలు పెంచడం.. ధరల పెరుగుధలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో రైతులకు మరింత భారంగా మారుతున్నాయి.

### సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి

సోములపల్లి మానస

రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి , సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి. సేంద్రియ ఎరువులు వినియోగిస్తే పంటల దిగుబడి పెరగడంతో పాటు పెట్టుబడులు తగ్గుతాయి. యూరియా, డీఏపీకి బదులు నానో ఎరువు వాడితే ఖర్చు తక్కువ.. లాభం ఎక్కువగా ఉంటుంది.

**ధరల పెంపు ఇలా..**
**(50కిలోల బస్తా రుపాయల్లో..)**

| కాంప్లెక్స్ ఎరువు | ప్రస్తుతం | పెరిగన ధర |
|---|---|---|
| 202013 1350 | 1400 | |
| 143514 1850 | 1900 | |
| 102626 1800 | 1825 | |
| 2020013 1300 | 1375 | |
| 24240 | 1800 | 1900 |
| 16160 | 1600 | 1650 |
| 28280 | 1800 | 1800 |
| డిఏపీ | 1350 | 1350 |



# ఆ ముగ్గురు ఎవరు.. అందులో అధ్యక్షుడెవరు?

డిసిసి అధ్యక్ష ఎంపికలో ఉత్కంఠ
భట్టి మార్కు ఉంటుందా ?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మండల స్థాయి నుంచి జిల్లా వర కు వివిధ స్థానాల్లో పార్టీకి నూతన బాధ్యులను నియమించనున్నారు. ఇందు కోసం కాంగ్రెస్ పార్టీ పెద్ద కసరత్తె మొదలు పెట్టింది. జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి పరిశీలకులు పదవులను ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ము ఖ్యంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవులకు సంబంధించి ప్రతి జిల్లా నుంచి ముగ్గురి పేర్లను అధిష్టానానికి పంపించారు. దీనిపై కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలతో చర్చించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమం త్రి, పిసిసి అధ్యక్షుడు, కాంగ్రెస్ వ్యవహారాల ఇం చార్జి సహా ఢిల్లీ వెళ్లి పలువురితో చర్చించారు. ఇప్పుడు ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని రెండు జిల్లాల కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులకు తీవ్ర పోటీ ఏర్పడింది. ప్రస్తుతం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా పువ్వాళ్ల దుర్గాప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులుగా పొదెం వీరయ్య కొనసాగుతున్నారు. పిసిసి అధ్యక్షుడు ప్రకటన ప్రకారం వీరిద్దరికి మరోసారి అధ్యక్ష పదవిలో కొనసాగే అవకాశం లేదు. పొదెం వీరయ్య ఇప్పటికే కార్పోరేషన్ చైర్మన్‌గా కొనసాగుతుండగా, పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను సైతం గత కొంత కాలంగా పదవి ఊరిస్తుంది. సుడా చైర్మన్‌గా నియామకపు ఉత్తర్వులు రానున్నట్లు ప్రచారం జరిగింది. అయితే పరిస్థితి ఇప్పుడు అలా లేదు భట్టితో పాటు మరో ఇద్దరు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి కూడా తమ అనుచరులను నియమించుకునేందుకు ప్రయత్నం చేయవచ్చు. పార్టీలో ఐదేండ్లు పనిచేయాలన్న నిబంధన అమలైతే తుమ్మల, పొంగులేటి వెంట కాంగ్రెస్‌లో చేరిన వారికి అవకాశం దక్కకపోవచ్చు. కాంగ్రెస్ కష్ట కాలంలోనూ పార్టీకి దన్నుగా ఉన్న దుర్గాప్రసాద్, జావిద్‌లకు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పదవులు దక్కుతాయని ఆశించిన ఇంత వరకు ఆ అవకాశం రాలేదు. రెండు సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరి పేర్లు ప్రముఖంగా వినపడుతున్నాయి. గిరిజన సంఘాలు, డిసిసి అధ్యక్ష పదవి గిరిజనులకే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. శాసనసభ్యులు కూడా డిసిసి అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేశారని, జోడు పదవులు అడ్డుకాదని పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ ప్రకటించిన నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష పదవి ఎవరికి దక్కనున్నాయో అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.







# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## మంగపేట బిసి గ్రామ ఐక్యవేదిక కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/మంగపేట:** మండలంలో బిసి మండల ఐక్యవేదిక మండల అధ్యక్షులు కోడెల నరేష్ ఆధ్వర్యంలో ఆదివారం మంగపేట బిసి ఐక్యవేదిక గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. బిసి మండల ఐక్యవేదిక గ్రామ అధ్యక్షుడిగా చల్లా రాంకి ప్రధాన కార్యదర్శిగా ఎర్రావుల రమేష్ ఉపాధ్యక్షుడిగా జవంగుల రవీంద్ర చామకూరి కృష్ణ, మానుపల్లి వేణు, కార్యదర్శులు గా పుణ్యం భాస్కర్, లిక్కి రమేష్ రావుల రామస్వామి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నిక అయిన సభ్యులు మాట్లాడుతూ, మాకు ఇచ్చిన మంచి అవకాశాన్ని బిసి ఐక్యవేదిక ద్వారా బిసిలకు 42శాతం రిజర్వేషన్ సాధించే వరకు ఉద్యమాల ద్వారా పోరాడుతామణి దీనిని సద్వినియోగం చేసుకుంటామని బిసి ఐక్యవేదిక మండలకమిటీకిధన్యవాదములు తెలియజేశారు.

## గ్రామాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

రూ.120 కోట్ల 40 లక్షలు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండల రోడ్ల నిర్మాణ అభివృద్ధికి రూ.120 కోట్ల 40 లక్షల నిధులు మంజూరు చేసినందుకు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి పిఎసిఎస్ చైర్మన్ కర్ణాకర్‌రావు, మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపి కడియం కావ్య చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏ మండలానికి ఇవ్వనన్ని నిధులు రోడ్ల నిర్మాణానికి నిధులు మన మండలానికి ఇచ్చినందుకు కడియం శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. స్టేషన్‌ఘనపూర్ నుండి వర్ధన్నపేట వైపు వెళ్లే రోడ్డుకు రూ.40కోట్ల 77 లక్షలు, మండల కేంద్రంలో సెంటర్ లైటింగ్ సిస్టం ఏర్పాటు , జపర్‌గడ్ నుండి సూరారం, హిమాయత్ నగర్ వరకు రూ.13 కోట్ల 60 లక్షలు, మండలంలోని ఇతర గ్రామాల రోడ్లకు నిధులు మంజూరుచేయడం జరిగిందన్నారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు.

## నేడే మద్యం టెండర్లకు లక్కీ డ్రా

జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నేడు మంజూరు నగర్ లోని ఇల్లంద క్లబ్ హౌస్‌లో మద్యం టెండర్లకు లక్కీ డ్రా తీయడం జరుగుతుందని జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం జరిగే లక్కీ డ్రా లో షాప్ నెంబర్ 49 చల్వాయి గ్రామము, 50 గోవిందరావుపేట, ములుగు జిల్లా మద్యము దుకాణములకు కమీషనర్, ప్రోహిబిషన్ మరియు ఎక్సజ్, హైదరాబాద్ వారి ఉత్తర్వులు మేరకు నేడు జరుగబోయే మద్యం దుకాణంల లక్కీ డ్రా తీయడంలో నిలిపివేయడం (వాయిదా) జరిగిందని పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు వాయిదా వేయడం జరిగిందని ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. భూపాలపల్లి ఎక్సైజ్ పరిధిలో 59 మద్యం షాపులు ఉన్నాయని అందుకుగాను 1,863 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు ఈ రెండు మద్యం షాపులు మినాయిస్తే మిగిలిన షాపులన్నిటికీ లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమక్షంలో మద్యం టెండర్లకు లక్కీ డ్రా నిర్వహించడం జరుగుతుందని శ్రీనివాస్ తెలిపారు.

## అసంఘటిత కార్మికులకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలి

సిపిఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** అసంఘటిత కార్మిక రంగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు 55 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క కార్మికునికి రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కడవెండిలో ఎఐటియుసి, అనుబంధ హమాలీ కార్మిక సంఘం ఎన్నిక జరిగింది. ఈ సమావేశానికి పరుశరాములు అధ్యక్షతన వహించగా ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో లేబర్ కార్డు, తంబ్ సిస్టంను ఎత్తివేయాలని, ప్రభుత్వ కార్మికులకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పలయ్య, వానకొండయ్య, సుధాకర్, నరసింహ, బిక్షపతి, మహేష్, కుమార్ పాల్గొన్నారు.

**కడవెండి గ్రామ కమిటీ ఎన్నిక:** ఎఐటియుసి, అనుబంధ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షునిగా మైల అశోక్, ఉపాధ్యక్షునిగా చింత మహేష్, ప్రధాన కార్యదర్శిగా నవీన్, సహాయ కార్యదర్శిగా ఐలయ్య, కోశాధికారిగా సుధాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## కాళేశ్వరం ఆలయంలో కార్తీక భక్తుల సందడి

త్రివేణి సంగమంలో భక్తుల కార్తీక పుణ్య స్నానాలు



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** శివకేశవుల ఆరాధనకు ప్రత్యేకత సంతరించుకున్న కార్తీకమాసం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన కాళేశ్వరం ఆలయంలో ఆదివారం కార్తీక భక్తుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ తదితర సుదూర ప్రాంతాల నుండి ఉదయం నుండే క్షేత్రానికి తరలి వచ్చిన భక్తులు త్రివేణి సంగమ గోదావరిలో కార్తీక పుణ్యస్నానాలు ఆచరించి గోదావరిలో కార్తీక దీపాలు వదిలారు. అనంతరం తీరం వద్ద ఇసుకతో సైకత లింగాలు ఏర్పాటు చేసి వాటికి పూజలు నిర్వహించారు.అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, సుభానంద అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి,తులసి చెట్ల వద్ద భక్తులు లక్షవత్తులతో కార్తీక దీపాలు వెలిగించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

## పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ

**ప్రజాపక్షం/ నర్సంపేట :** పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ జరిగిన సంఘటన నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామంలోని లోడెం సమ్మక్క, మిడిమాలపు మల్లమ్మ ఇళ్లకు తాళ్లాలు వేసి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లిపోయారు. ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు ఆరెండు ఇళ్లలో తలుపులు పగలగొట్టి ఇంట్లో ఉన్న రెండున్నరతులాల బంగారం, రూ. 5వేల నగదు, వెండి ఆభరణాలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# భూభారతి, పిఒబి రికార్డుల పరిశీలన

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం / వరంగల్ :** కలెక్టరేట్‌లో వర్ధన్నపేట, దుగ్గొండి మండలాలకు సంబంధించిన భూభారతి, పిఒబి రికార్డులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం పరిశీలించారు. సంబంధిత అధికారులతో సమగ్రంగా చర్చించి, పెండింగ్‌లో ఉన్న అంశాలను నిబంధనల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన నిర్ణీత గడువులోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైనట్టయితే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పిఒబిలకు సంబంధించిన అప్లికేషన్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని వెంటనే నోటీసులు జారీ చేస్తూ క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూసంబంధిత రికార్డుల ప్రామాణికత, డేటా అప్‌డేట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పారదర్శకత, వేగం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత అధికారులను సమన్వయంతో పని చేయాలని, పెండింగ్ ఫైళ్లను నిర్దిష్ట గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాజేశ్వర్, విజయ్ సాగర్, కలెక్టరేట్ సిబ్బంది, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఎంజిఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వేటు

ఆస్పత్రిలో వరుస ఘటనలపై వైద్య మంత్రి సీరియస్



**ప్రజాపక్షం/హనుమకొండ :** వరంగల్ ఎంజిఎం ఆస్పత్రిలో వరుస ఘటనలపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియాలో ఎంజిఎం ఆస్పత్రిలో ఒకే ఆక్సీజన్ సిలిండర్ ఇద్దరు పిల్లలకు ఎక్కించిన ఘటన వార్తలు రావడంతో ఆస్పత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ కిషోర్‌పై వేటు వేశారు. నేడో, రేపో సమర్థులైన మరో వైద్యుడికి ఆ బాధ్యతను అప్పగించనున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆస్పత్రిని గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని రాష్ట్ర హెల్త్ సెక్రటరీ క్రిస్టినాకు సూచించారు. ప్రతి వారం ఎంజిఎంపై సమీక్ష చేసి తనకు నివేదికివ్వాలని వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ నరేంద్ర కుమార్‌ను ఆదేశించారు.

## నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడండి

నగర మేయర్ గుండు సుధారాణి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం కాకతీయ ఫిల్టర్ బెడ్, దేశాయిపేటలోని ప్రతాపరుద్ర ఫిల్టర్, బెడ్‌లను మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేసి నీటి సరఫరా తీరు, నీటి నాణ్యతను గురించి అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నీటి నాణ్యతను పరిశీలించిన అనంతరం మేయర్ మాట్లాడుతూ ధర్మసాగర్ రిజర్వాయర్‌ల నుండి వచ్చే రా వాటర్‌లో సమస్య ఏర్పడిందని వర్షాకాలం ముగింపు సమయంలో ఇలాంటి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుందని, గత సంవత్సరం కూడా ఈ సమస్య ఉత్పన్నం అయ్యిందని, శనివారంతో పోల్చితే ప్రస్తుతం నీటి సరఫరా బాగానే జరుగుతుందని, పూర్తిగా సమస్యను పరిష్కరించి సోమవారం నుండి శుద్ధమైన నీరు సరఫరా జరుగుతుందని మేయర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, ఇఇ రవికుమార్, డిఈ సతీష్, ఎఇ హరికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మారనున్న జిల్లా కోర్టు భవన సముదాయం

సింగరేణి కమ్యూనిటీ హాల్ భవనంలోకి కోర్టు

బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రావణ్ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తహసీల్దార్ ఆఫీస్ ఎదురుగా ప్రైవేటు భవనంలో నిర్వహిస్తున్న జిల్లా కోర్టును పాత పోలీస్ హెడ్ క్వార్టర్స్ భవన సముదాయంలోకి త్వరలో మార్చనున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రావణ్ రావు తెలిపారు. ఆదివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కోర్టు ప్రైవేటు భవనంలో నిర్వహించడం అసౌకర్యంగా ఉన్నందున జిల్లా ప్రధాన న్యాయమూర్తి సింగరేణి యాజమాన్యాన్ని స్థానిక బస్టాండ్ దగ్గరలో పాత పోలీస్ హెడ్ క్వార్టర్ భవన సముదాయంను కోర్టు నిర్వాహణ కోసం కేటాయించాల్సిందిగా కోరగా సానుకూలంగా స్పం దించిన సింగరేణి యాజమాన్యం స్పందించి కేటాయించుటకు అంగీకరించినట్లు తెలిపారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) నేతృత్వంలో పాత హెడ్ క్వార్టర్స్ భవనాలకు కిరాయి నిర్ధారణ చేసినట్లు తెలిపారు. కోర్టు నిర్వహణ కోసం నెలకు రూ. 64 వేల అద్దె చెల్లించే విధంగా ఉత్తర్వులు బి/48/2025 తేదీ 10.10.2025 అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. త్వరలో కోర్టు భవనాన్ని అన్ని హంగులతో ఒకే చోట కక్షిదారులకు, ప్రభుత్వ ప్రైవేటు శాఖలకు సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. త్వరలో కోర్టు భవనాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పోర్ట్ పోలియో న్యాయమూర్తులు ప్రారంభిస్తారని తెలిపారు. పాత పోలీస్ హెడ్ క్వార్టర్లు కోర్టు భవనం ఏర్పాటుకు సహకరించిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సింగరేణి సిఎం డి బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేలకు సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి తోపాటు సింగరేణి కార్మిక సంఘాల నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ సంగెం రవీందర్, సాంస్కృతిక కార్యదర్శి కుందారపుశివకుమార్, కోశాధికారి మంగళపల్లి రాజ్ కుమార్, ఇసి మెంబర్ భూక్య రమేష్ నాయక్, సభ్యులు ఆ రెల్లి వెంకటస్వామి, బారాసోసియేషన్ సభ్యులు ఎస్‌కె మోహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం





**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రత్యేక లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం హన్మకొండ హంటర్ రోడ్డులోని న్యూ శాయంపేట వెలమ భవన్ ప్రాంగణంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో రైతు సదస్సు, మెగా హెల్త్ క్యాంప్, నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ముందుగా అక్కడ రైతుల కోసం ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను కలియతిరుగుతూ పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సభా వేదికపై ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతుల సంక్షేమమే సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రాధాన కర్తవ్యమని, రైతుల ఆర్థిక స్థితి బలోపేతానికి ఆధునిక పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం కోసం వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రశంసించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి, మెమొంటో అందజేసి సన్మానం చేశారు.

## బుగులోని జాతర అభివృద్ధి పనులు పూర్తి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారులో వచ్చే నెల 5 నుండి జరిగే శ్రీబుగులోని వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ప్రజల భాగస్వామ్యంతో జరుగుతున్న విధ అభివృద్ధి పనులను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లు మరియు సంబంధిత శాఖల అధికారులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర త్యనారాయణ రావు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం జాతర ప్రాంగణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బుగులోని జాతర తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు, సందర్శకులు స్వామి వారిని దర్శించుకుని వారి మొక్కలు తీర్చుకుంటారన్నారు. జాతరకు వచ్చే క్తుల సౌకర్యార్థం రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి సదుపాయాలను మెరుగుపరచడం అత్యవసరమని పేర్కొన్నారు. జాతర సమయానికి ముందే అన్ని పనులు పూర్తవ్వాలనే ఉద్దేశ్యంతో ప్రతి రోజు పనుల పురోగతిని సమీక్షించనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ప్రజల సహకారంతో బుగులోని జాతరను రాష్ట్ర స్థాయి వేడుకగా మార్చే లక్ష్యంతో సిఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

## ఓరుగల్లు గాన కళా వైభవంలో ఎమ్మెల్యే నాయిని



**ప్రజాపక్షం/హనుమకొండ:** కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన ‘ఓరుగల్లు గాన కళా వైభవం’ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దాదాపు 100కు పైగా పాటలు, ఐదు గంటల పాటు సాగిన గానామృత యజ్ఞంలో కళాకారులు సమాజ హితాన్ని కోరుతూ స్ఫూర్తిదాయకంగా ప్రదర్శనలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో పాట ఉద్యమానికి ఊపునిచ్చిన ఘనత పాటకే చెందిందని పేర్కొన్నారు. కవులు, కళాకారులు సమాజంలో మార్పు తేగల శక్తి కలవారని గుర్తుచేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తక్కువ కాలంలోనే కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించి కవులకు, కళాకారులకు అంకితం చేశామని తెలిపారు. అదేవిధంగా, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని కళాకారులు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, కళాకారులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో లేబర్ ఆఫీస్ ద్వారా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గురిజేపల్లి సుధాకర్ రెడ్డి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. లేబర్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా మెడికల్ టెస్టులను నిర్వహించడం జరుగుతుందన్నారు. లేబర్ కార్డు కలిగిన ప్రతి వ్యక్తి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసిజిల్లా కార్యదర్శి క్యాతరాజు సతీష్, 5 ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీ దోర్నాల తిరుపతి, ఎఐటియుసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి రద్దు

కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం / వరంగల్ :** వరంగల్ జిల్లా కలెక్టరేట్లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, కలెక్టరేట్ కు రావద్దని కలెక్టర్ కోరారు.

## కుళ్లి పోయిన బిర్యాని అమ్ముతున్న సితార గ్రాండ్ హోటల్

ఎంఆర్‌పిఎస్ టిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ మాది







**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లా కేంద్రంలోని సితార గ్రాండ్ హోటల్‌లో చెడిపోయిన బిర్యాని అమ్ముతూ జనాల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని రేణుకుంట్ల మహేష్ మాదిగ అన్నారు. పాడైన బిర్యాని అమ్ముతున్నారని బాధితుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న ఎంఆర్‌పిఎస్ టిఎస్ జిల్లా నాయకులు హోటల్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. భాధితులు పుల్ల మహేష్ మొగుళ్లపల్లి హాస్టల్‌లో ఉంటున్న వారి అబ్బాయి కోసం బిర్యానీ తీసుకువెళ్లగా ఓపెన్ చేసి వాళ్ళ బాబుకి తినిపించగా వెంటనే ఆ అబ్బాయి పూర్తిగా వామిటింగ్ చేసుకున్నాడని తెలిపారు. తీరా పూర్తిగా ఓపెన్ చేయగా బిర్యానీ మొత్తం పాడై పోయి జిగటగా చెడు వాసన వస్తూ ఉందని తెలిపారు. వెంటనే ఆ పార్సెల్ ని భూపాలపల్లి హోటల్‌కి తీసుకురాగ యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానం చెప్తూ ఏం చేసుకుంటావో చేసుకో అని పుల్ల మహేష్ వారి భార్య పైన దౌర్జన్యం చేసారు. తీసుకువచ్చిన పార్సెల్ కూడా గుంజుకుని దాన్ని బయట పడేసి అన్యాయంగా ప్రవర్తించారు. వెంటనే ఇలాంటి కల్తీ ఆహారం సరఫరా చేస్తున్న సితార గ్రాండ్ హోటల్‌పై వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులు, కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలు కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ టిఎస్ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శీలపాక హరీష్ మాదిగ, అడ్వకేట్ మంత్రి రాకేష్, బాధితులు పాల్గొన్నారు.

# రీల్

## పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో 'కిల్లర్'



'శుక్ర', 'మాటరాని మౌనమిది', 'ఏ మాస్టర్ పీస్' వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ తాజాగా 'కిల్లర్' అనే సెన్సేషనల్ సైఫై యాక్షన్ థ్రిల్లర్ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన హీరోగా నటిస్తుండటం విశేషం. జ్యోతి పూర్వజ్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఉర్వీష్ పూర్వజ్ సమర్పణలో ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ.పద్మనాభరెడ్డి ఈ కొలాబ్రేషన్‌లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు తుది దశకు చేరుకుంటున్నట్లు దర్శక నిర్మాత తెలిపారు. ఇండియా ఫస్ట్ సూపర్ షీ మూవీగా 'కిల్లర్' ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన గ్లింప్స్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్, సూపర్ హీరో.. ఇలాంటి ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఆద్యంతం ఆసక్తికరంగా రూపొందుతోంది. త్వరలోనే 'కిల్లర్' సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు. జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, విశాల్ రాజ్, దశరథ, చందూ, గౌతమ్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్ ఆశీర్వాద్, సుమన్ జీవ, లైన్ ప్రొడ్యూసర్ దశరథ, రచన దర్శకత్వం పూర్వాజ్.



## శర్వా సిక్స్ ప్యాక్

హీరో శర్వానంద్ తన 36వ చిత్రం 'బైకర్'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. స్పోర్ట్స్, ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తుండగా, యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రొఫెషనల్ మోటార్సైకిల్ రేసర్ పాత్రలో కనిపించబోతున్న శర్వా తన పాత్ర కోసం జాడ్రాపింగ్ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. తాజాగా విడుదలైన ఫోటోషూట్ స్టిల్స్‌లో ఆయన ఫిజిక్, కాన్ఫిడెన్స్ కొత్తగా శర్వాను ప్రజెంట్ చేశాయి. షర్ట్‌లెస్ లుక్స్‌లో అదరగొట్టాడని చెప్పవచ్చు. శర్వా తన పాత్రకు సరిపడేలా లీన్ అండ్ అథ్లెటిక్ బాడీని తీర్చిదిద్దుకున్నారు. నెలల తరబడి వర్కౌట్స్, డైట్, డెడికేషన్‌తో ట్రాన్స్ఫర్మేషన్ సాధించారు. ఈ చిత్రంలో మాళవిక నాయర్ హీరోయిన్గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకి సినిమాటోగ్రఫీకి జె.యువరాజ్, మ్యూజిక్కు జిబ్రాన్, అనిల్ కుమార్ పి ఎడిటర్. రాజీవన్ ప్రొడక్షన్ డిజైనర్. ఎ పన్నీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు, ఎన్ సందీప్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.



## వరుణ్ యాక్షన్

వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో మూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్లపై నిర్మిస్తున్న సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాదులో శరవేగంగా జరుగుతోంది. వరుణ్ తేజ్‌తో పాటు ముఖ్య తారాగణం పాల్గొంటున్న ఈ షెడ్యూల్లో అత్యంత కీలకమైన సన్నివేశాలను త్రీకరిస్తున్నారు. హార్రర్ కామెడీ, ఇండియన్ కొరియన్ బ్యాక్ డ్రాప్ యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే ఇండియా, విదేశాల్లో మూడు మేజర్ షెడ్యూల్స్ కంప్లీట్ అయ్యాయి. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్ థమన్ కాంబో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ రానుందని నిర్మాతలు భావిస్తున్నారు.



## ఆడియన్స్ వల్లే ఇది సాధ్యమైంది

ప్రదీప్ రంగనాథన్

యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ లేటెస్ట్ దీపావళి బ్లాస్ట్ డ్యూడ్. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్ గా పరిచయం అయ్యారు. మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. అక్టోబర్ 17న విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్‌తో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకొని హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ డ్యూడ్ బ్లాక్ బస్టర్ సక్సెస్ పేరుతో ఓ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ.. డ్యూడ్ సినిమా 100 కోట్లు కలెక్షన్స్‌ని క్రాస్ చేసింది. ఆడియన్స్ లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. లవ్ టు డే. డ్రాగన్ చిత్రాలకు ఎంత ఆదరణ ఇచ్చారో ఈ చిత్రానికి కూడా అంత కంటే ఎక్కువ ఆదరణ అందించారు. అని అన్నారు. నిర్మాత ఎస్‌కెఎన్ మాట్లాడుతూ తమిళ్ స్టార్స్ కూడా మా స్టార్స్ గానే ఫీల్ అవుతాము. కమల్ హాసన్, రజినీకాంత్, సూర్య, అజిత్, ధనుష్, విజయ్ సేతుపతి ఇలా ఎవరొచ్చినా సరే మా సొంత సినిమా లానే ప్రేమిస్తాం. ప్రదీప్ కూడా ఇప్పుడు ఈ ఎలైట్ క్లబ్‌లో జాయిన్ అయ్యారు. మూడుసార్లు ఇండస్ట్రీని షేక్ చేసి వరుసగా మూడు వంద కోట్ల సినిమాలు ఇచ్చారు. ప్రదీప్ కేవలం హీరో మెటీరియల్ కాదు యాక్టర్ మెటీరియల్ స్టార్ మెటీరియల్. ప్రదీప్ ఇంకా ఎన్నో విజయవంతమైన సినిమాలు చేయాలని కోరుకుంటున్నానని చెప్పారు. హీరోయిన్ మమిత బైజు మాట్లాడుతూ ఈ సక్సెస్‌ని సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. సినిమా 100 కోట్లు కలెక్షన్స్ క్రాస్ చేసింది. ఈ సినిమాకి ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. మై కోస్టార్ ప్రదీప్‌కి, డైరెక్టర్ కీర్తికి థాంక్యూ సో అని తెలిపారు. నిర్మాత వై రవిశంకర్ మాట్లాడుతూ డ్యూడ్ సినిమా సక్సెస్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. మా సంస్థలో పరిచయమైన భరత్ కమ్మ, నితీష్ రానా, బుచ్చిబాబు సనా చాలా పెద్దదర్శకులు అయ్యారు. ఇప్పుడు అదే కేటగిరిలో కీర్తి చేయడం చాలా ఆనందంగా వుంది. ఇంత మంచి సక్సెస్ ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు అని చెప్పారు. డైరెక్టర్ కీర్తి ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రదీప్ రంగనాథన్ కి ఇది హ్యాట్రిక్ మూవీ. ఇది నా ఫస్ట్ సినిమా. ఇలాంటి కొలబరేషన్లో అద్భుతమైన విజయం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. సినిమా అద్భుతంగా రన్ కావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన నిర్మాతలు నవీన్ గారికి రవికి థాంక్యూ అని పేర్కొన్నారు. మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ సినిమా థియేటర్స్‌లో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. కొన్ని సీన్స్ ఎన్నిసార్లు చూసినా థియేటర్స్‌లో బోర్ కొట్టడం లేదు. ప్రదీప్ మమిత యాక్టింగ్ సూపర్బ్. ఇంటర్వెల్ బ్లాక్స్ సీన్ అయితే గూజ్ బంప్స్ తెప్పించింది. థియేటర్ మొత్తం రియాక్ట్ అవుతున్నారు. సెకండాఫ్ సూపర్ అని అందరు అంటున్నారు. థియేటర్లో సినిమా సూపర్‌గా రన్ అవుతుంది. బ్యూటిఫుల్ మ్యూజిక్ ఎమోషన్ లవ్ స్టోరీ ఉన్న సినిమాని తప్పకుండా థియేటర్స్‌లో వాచ్ చేయండి అన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## నా ప్రాణమంత పాట ఆవిష్కరణ

ఏకే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న 'దేవ్ పారు' చిత్రం నుంచి నా ప్రాణమంత అనే పాట విడుదల అయింది. సింగర్ కాలభైరవ పాడిన ఈ పాట డైరెక్టర్ కృష్ణ చైతన్య విడుదల చేశారు. ఈ పాట ఆదిత్యమ్యూజిక్‌లో శ్రోతలను ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ కాలభైరవతో కలిసి పనిచేశాను. ఈ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దేవ్ పారు మూవీ ఒక ఫ్రెష్, ఎమోషనల్ లవ్ స్టోరీ అని యూత్ను ఆకట్టుకుంటుందని చెప్పారు. సినిమాకు అందరూ రిలేట్ అవుతారని చెప్పారు. పాట కూడా చాలా బాగుంది. ఆడియెన్స్ సపోర్ట్‌తో సినిమా పెద్ద విజయం సాధిస్తుందని చెప్పారు. దర్శకుడు అంజి మాట్లాడుతూ మ్యూజిక్ డైరెక్టర్ అద్భుతమైన సంగీతాన్ని, ధ్రువ్ అద్భుతమైన బ్యాక్గ్రౌండ్ స్కోర్ను అందించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హీరో మిహాస్ రోమి, హీరోయిన్ యష్ణ, కామెడియన్ ధీరజ్ బండి, దర్శకుడు అఖిల్ రాజు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ప్రియా పాల్గొన్నారు.



## ఇండియన్ సినిమా క్వీన్

నేషనల్ క్రష్ రశ్మిక మందన్న ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో 9 ఏళ్ల జర్నీ పూర్తి చేసుకుంది. 9 ఏళ్ల కెరీర్‌లో నాలుగు భాషల్లో మొత్తం 25 మూవీస్‌లో నటించింది. ఈ సినిమాల్లో హిట్స్, సూపర్ హిట్స్, బ్లాక్ బస్టర్స్‌తో పాటు బాక్సాఫీస్ రికార్డులు తిరగరాసిన సినిమాలు ఎన్నో ఉండటం విశేషం. హీరోయిన్‌గా రశ్మిక పాన్ ఇండియా స్థాయిలో వరుస విజయాలు సాధిస్తూ తన స్టార్ డమ్ క్రేజ్ చూపిస్తోంది. అందం, నటన, ఆకర్షణతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ప్రేక్షకుల్లో విపరీతమైన క్రేజ్‌ను సంపాదించుకుంది. వెయ్యి కోట్ల రూపాయల సినిమాలను అలవోకగా అందుకుంటూ ఇండియన్ సినిమా క్వీన్‌గా మారింది. రశ్మిక నటించిన పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, థామా చిత్రాలు బాక్సాఫీస్ రికార్డులు తిరగరాశాయి. అయితే బాక్సాఫీస్ నెంబర్స్ కంటే ప్రేక్షకుల ప్రేమే తనకు ముఖ్యమని చెబుతుంటుంది రశ్మిక మందన్న. ఈ అందాల తార తన విజయాలను కొనసాగిస్తూ మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్స్‌లో నటిస్తోంది. రశ్మిక నటించిన ది గర్ల్ ఫ్రెండ్ సినిమా నవంబర్ 7న పాన్ ఇండియా రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా రిలీజ్ చేసిన ఈ సినిమా ట్రైలర్‌లో రశ్మిక పర్ ఫార్మెన్స్ మెస్మరైజ్ చేస్తోంది. ది గర్ల్ ఫ్రెండ్ సినిమా తన కెరీర్‌లో మరో మైల్ స్టోన్ కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది రశ్మిక.

## నెపోలియన్ రిటర్న్స్ గ్లింప్స్ విడుదల

ఆచార్య క్రియేషన్స్ బ్యాన్ర ప్రముఖ రైటర్, డైరెక్టర్ ఆనంద్ రవి దర్శకత్వంలో భోగేంద్ర గుప్త నిర్మించిన ప్రొడక్షన్ నెంబర్ 4 చిత్రానికి సంబంధించిన టైటిల్, గ్లింప్స్‌ను లాంఛ్ చేశారు. ఆనంద్ రవి, దివి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి 'నెపోలియన్ రిటర్న్స్' అనే టైటిల్ను ఖరారు చేశారు. ఆనంద్ రవి రూపొందించిన నెపోలియన్, ప్రతినిధి, కొరమీను చిత్రాలు ఎంత పాపులర్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పుడు ఈ యాక్టర్ డైరెక్టర్ ఆనంద్ రవి మరోసారి యూనిక్, ఫ్రెష్ కాన్సెప్ట్‌తో నెపోలియన్ రిటర్న్స్‌గా మన ముందుకు రాబోతున్నారు. ఈ మూవీ టీమ్ టైటిల్ గ్లింప్స్ను హైదరాబాద్లో రిలీజ్ చేశారు. 'నెపోలియన్' రిటర్న్స్' టైటిల్ గ్లింప్స్ విషయానికి వస్తే.. ఆనంద్ రవి ఇద్దరితో కలిసి పోలీస్ స్టేషన్కు వెళ్లి కంప్లైంట్ ఇవ్వటానికి వెళతాడు. ఓ గెద ఆత్మ సమస్యగా మారిందని పోలీసుతో చెబుతాడు. మరో వైపు ఆనంద్ రవి విజువల్స్‌తో పాటు తను ఏం కంప్లైంట్ చేయాలనుకుంటున్నాడో దానికి సంబంధించిన విజువల్‌ను చాలా వేగంగా చూపించారు. పోలీస్ రఘుబాబు సహా అందరూ ఆ గెద ఆత్మ గురించి మరింత సమాచారం తెలుసుకోవాలనుకుంటారు. ఆటో రామ్ ప్రసాద్, రఘుబాబు, సూర్య పింగ్ పాంగ్, శ్రవణ్ రాఘవేంద్ర, యాంకర్ రవి, రవి వర్మ, మీసాల లక్ష్మణ్ తదితరులు ఇందులో నటించారు.



# చెన్నై సూపర్ కింగ్స్‌కు కిరీటం

విద్యార్థులను చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలి

ఎంపి వంశీ కృష్ణ




**ప్రజాపక్షం/కాసిపేట్ :** కాసిపేట్ మండలంలోని ముత్యంపల్లి అంబేద్కర్ గ్రౌండ్‌లో జరిగిన కెఎంపిఎల్ మినీ సీజన్1 క్రికెట్ టోర్నమెంట్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, పల్లంగూడ టైటాన్స్ జట్టుపై 8 పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 70 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో పల్లంగూడ టైటాన్స్ జట్టు 62 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథులుగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, బెల్లంపల్లి శాసనసభ్యులు వినోద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి వంశీ కృష్ణ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి చాలా ముఖ్యమని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో కూడా రాణించాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడతారని తెలిపారు. అనంతరం విజేతలకు, రన్నరప్‌లకు బహుమతులు అందజేశారు. మైదానం అభివృద్ధి పనుల కోసం తన నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎంపి ప్రకటించారు. టోర్నమెంట్‌లో రాజ్ కుమార్ రాయల్స్, గోవా సూపర్ కింగ్స్, ఎస్ఆర్‌హెచ్ కాసిపేట్, దేవాపూర్ చార్జెస్, గోవా సూపర్ కింగ్స్ కాసిపెట్, ఎస్‌పిటి, పల్లంగూడ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్, కాసిపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, మైదం రమేష్, అప్పల భాస్కర్, నస్పూరి నర్సింగ్, ముత్తురు సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## 'ఇందిరమ్మ ఇండ్ల' బిల్లుల చెల్లింపు ప్రక్రియలో
# స్వల్ప మార్పులు

మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులకు నాలుగు విడతలుగా అందచేస్తున్న బిల్లుల చెల్లింపుల ప్రక్రియలో ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. ఇంటి స్లాబ్ వేసిన తరువాత చెల్లించాల్సిన రూ.2లక్షలకు బదులుగా, ఉపాధి హామి పథకం ద్వారా కలుగుతున్న లబ్ధి (90 రోజుల పనిదినాల మొత్తం, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం నిమిత్తం నిర్దేశించిన మొత్తం) నేపథ్యంలో రూ.1.60లక్షలుగా అందచేయాలని ప్రభుత్వం నిర్ణయించనట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మిగిలిన మొత్తాన్ని కూడా లబ్ధిదారుల ఖాతాల్లో ఉపాధి హామీ పథకం కింద అందచేయనున్నట్టు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఇందిరమ్మ ఇండ్ల' నిర్మాణంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద 90పని దినాలు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం (ఐహెచ్‌హెచ్ఎల్ ) పనులను చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చి నేపథ్యంలో మార్పు అనివార్యమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. అందుకే ఇకపై స్లాబ్ పూర్తయిన తరువాత రూ.1.60లక్షలను మాత్రమే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. అలాగే ఇంటి నిర్మాణం పూర్తయిన తరువాత మిగిలిన లక్ష రూపాయలను కూడా విడుదల చేస్తామన్నారు. కేవలం చెల్లింపుల షెడ్యూల్‌లో మాత్రమే మార్పులు జరుగుతున్నాయని, లబ్ధిదారులకు మంజూరు చేసే రూ.5 లక్షల మొత్తంలో ఎటువంటి మార్పులు ఉండబోదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో బేస్ మెంట్ వరకూ నిర్మాణం పూర్తి అయితే ఒక లక్ష రూపాయలు, రూఫ్ లెవల్ వరకు వచ్చిన తరువాత మరో లక్ష రూపాయలు విడుదల చేస్తున్నారని ఆయన తెలిపారు. పరిపాలనా సౌలభ్యం రీత్యా ఈ మార్పులు అనివార్యమయ్యాయని, లబ్ధిదారులు ఈ మార్పును గమనించి ప్రభుత్వానికి సహకరించాలని పొంగులేటి శ్రీనివాస రెడ్డి కోరారు.

## 'యాప్స్‌ను, డిజిటల్ ఇంటర్వెన్షన్'ను సద్వినియోగం చేసుకోండి

విద్యాశాఖ డైరక్టర్ నవీన్ నికోలస్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యాశాఖ ఉపయోగిస్తున్న యాప్స్‌ను, డిజిటల్ ఇంటర్వెన్షన్‌ను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ సూచించారు. పాఠశాల విద్యాశాఖ ఉపయోగిస్తున్న వివిధ యాప్స్, డిజిటల్ ఇంటర్వెన్షన్‌పై హైదరాబాద్‌లోని ఎంసిహెచ్ఆర్‌డిలో విద్యాశాఖ జిల్లా విద్యాశాఖ అధికారులకు,డైట్ ప్రిన్సిపాల్స్‌కు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్, ఎఎక్స్ఎన్, ఎఎక్స్ఎల్, ఐఎస్ఎంఎస్, యుడిఐఎస్ఇ ప్లస్, వివిఎస్‌కె. ఎఫ్ఆర్ఎస్ తదితర యాప్స్ నిర్వహణపైన పాఠశాల విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్స్, జాయింట్ డైరెక్టర్లు సమగ్రంగా తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానంలో పూర్తిగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసినందుకు అన్ని జిల్లాల అధికారులను నవీన్ నికోలస్ అభినంధించారు. అతి తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి, రోజువారీగా క్రమంగా హాజరు శాతంలో కూడా మెరుగైన ప్రగతిని సాధిస్తున్నదన్నారు. కాగా అత్యుత్తమ హాజరు శాతాన్ని నమోదు చేసిన జిల్లా, మండల,పాఠశాల స్థాయిల్లో అధికారులను ప్రధానోపాధ్యాయులను శాలువాతో సత్కరించి, వారికి నవీన్ నికోలస్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు రాధా రెడ్డి, లింగయ్య, రమణ కుమార్, శ్రీనివాస్ చారి, ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ జి.రమేష్ , జాయింట్ డైరెక్టర్స్ పి.రాజీవ్, వెంకట నరసమ్మ, మదన్మోహన్, ఆర్ జెడిలు సత్యనారాయణ రెడ్డి, విజయలక్ష్మి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రూ.10 కోట్లు ఇవ్వకుంటే మీ కొడుకుని చంపేస్తాం

బిజెపి ఎంపికి బెదిరింపు కాల్

**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ రాష్ట్రానికి చెందిన బబిజెపి ఎంపి, లోక్‌సభలో ఆ పార్టీ చీఫ్ విప్ సంజయ్ జైశ్వాల్‌కు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చాయి. రూ.10 కోట్ల ఇవ్వకుంటే ఆయన కుమారుడిని చంపేస్తామని అజ్ఞాత వ్యక్తులు బెదిరించినట్టు పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం కొద్దిపాటి వ్యవధిలోనే తనకు రెండు బెదిరింపు కాల్స్ వచ్చినట్టు సంజయ్ జైశ్వాల్ శనివారంనాడు ఫిర్యాదు చేశారని ఎస్‌డిపిఒ (బెట్టాయ్ టౌన్) వివేక్ దీప్ తెలిపారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కాల్ చేసిన వ్యక్తిని ట్రాక్ చేస్తున్నట్టు చెప్పారు. కాల్ చేసిన వ్యక్తికి క్రిమినల్ ముఠాతో సంబంధం ఉన్నట్టు కనిపిస్తోందన్నారు. రాజకీయ వైరం ఉన్నట్టు ఎలాంటి సమాచారం లేదని, అయితే అన్ని కోణాల్లోంచి దర్యాప్తు జరుపుతున్నామని ఆయన తెలిపారు. సంజయ్ జైశ్వాల్ బిహార్‌లోని పశ్చిమ చంపరాన్ నియోజకవర్గానికి ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బిహార్ బిజెపి చీఫ్‌గా కూడా ఆయన సేవలందించారు.

## 21వ శతాబ్దం మనదే (మొదటి పేజీ తరువాయి)

భావనలో ఆధారపడి, సమానత్వం, సమగ్రత, స్థిరమైన అభివృద్ధి లక్ష్యంగా భారత్ దృష్టి పెట్టిందని మోదీ వివరించారు. భారత 'ఆక్ట్ ఈస్ట్ పాలసీ'కి ఏషియాన్ అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. 10 దేశాల ఆసియాన్ బ్లాక్‌తో భారత వ్యూహాత్మక బంధం మరింతగా బలపడుతున్నదని ప్రధాని మోదీ అన్నారు. కాగా, గత గురువారం మలేషియా ప్రధాని అన్వార్ ఇబ్రహీమ్‌తో తన సంభాషణ వివరాలను మోదీ 'ఎక్స్' (మాజీ ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. 'నా ప్రియ మిత్రుడు, మలేషియా ప్రధానమంత్రి అన్వార్ ఇబ్రహీమ్‌తో ఆప్యాయమైన సంభాషణ జరిగింది. మలేషియా ఆసియాన్ అధ్యక్ష దేశంగా బాధ్యతలు స్వీకరించినందుకు ఆయనకు అభినందనలు తెలిపాను. రాబోయే సదస్సులు విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలియజేశాను' అని మోదీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. భారత్–ఏషియాన్ సంబంధాలు 1992లో ప్రారంభమయ్యాయి. మొదట సెక్టోరల్ డైలాగ్ పార్ట్నర్ (కార్యదర్శి స్థాయి చర్చలు)గా మొదలై, 1995లో చర్చల భాగస్వామ్యం స్థాయికి చేరాయి. 2014 నుంచి మోదీ ప్రతి ఏషియాన్–భారత్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. 2018 జనవరిలో న్యూఢిల్లీ లో జరిగిన 25వ వార్షికోత్సవ సదస్సు సందర్భంగా అన్ని 10 సభ్య దేశాల నాయకులు భారత 69వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో అతిథులుగా పాల్గొన్నారు. 2022లో జరిగిన సమావేశాన్ని మినహాయిస్తే, మోదీ అన్ని సదస్సుల్లో పాల్గొన్నారు.

## 'సంస్థాగత హత్యే'

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడ్డారు. బిజెపితో సంబంధం ఉన్న కొంతమంది ప్రభావవంతమైన వ్యక్తులు ఆమెను అవినీతికి ఒత్తిడి చేయడానికి కూడా ప్రయత్నించారు' అని కొన్ని నివేదికలు ద్వారా తెలుస్తోందన్నారు. ఇది అధికారంతో రక్షించబడిన నేర సిద్ధాంతానికి అత్యంత నీచమైన ఉదాహరణ అని, ఆమెది ఆత్మ హత్య కాదు... సంస్థాగత హత్య' అని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు అభివర్ణించారు. అధికారం నేరస్థులను రక్షించినప్పుడు, న్యాయం కోసం ఎవరు ఆశిస్తారని ప్రశ్నించారు. న్యాయం కోసం బాధిత కుటుంబానికి తాము అండగా నిలబడతామని, భారతదేశపు ప్రతి కుమార్తెకు ఇకపై భయం ఉండదని, తమ న్యాయం అవసరమన్నారు.

### నిందితుల అరెస్టు

డాక్టర్ ఆత్మహత్యకు సంబంధించి పోలీసులు సబ్‌ఇన్‌స్పెక్టరర్ గోపాల్ బదానేను అరెస్టు చేశారని అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రం సతారాలోని ఫల్టాన్ గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో బదానే లొంగిపోగా, ఆ తర్వాత అతన్ని అరెస్టు చేసినట్లు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ తుషార్ దోషి తెలిపారు. శనివారం ఉదయం, ఫల్టాన్ పోలీసుల బృందం పుణెలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బంకర్‌ను అరెస్టు చేసింది. బాధితురాలిని మానసికంగా వేధించాడని, ఆత్మహత్యకు ప్రేరేపించాడని ఆరోపిస్తూ బంకర్‌ను శనివారం సతారా జిల్లా కోర్టు ముందు హాజరుపరచగా, అతనికి కోర్టు నాలుగు రోజుల పోలీసు కస్టడీ విధించింది. సతారా జిల్లాలోని ఫల్టాన్‌లో ఈ ఇద్దరిపై అత్యాచారం, ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసు నమోదైంది. పోలీసుల ప్రకారం బంకర్ డాక్టర్ నివసించిన ఇంటి యజమాని కుమారుడు. ఆమె అతనికి ఫోన్ చేసి, అతనితో చాట్ చేసి, ఆపై తన జీవితాన్ని ముగించిందని వారు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు సమయంలో సబ్ ఇన్‌స్పెక్టర్ బదానే పేరు బయటపడటంతో అతన్ని సర్వీసు నుండి సస్పెండ్ చేశారు. కాగా, డాక్టర్‌ను శుక్రవారం రాత్రి బీడ్‌లో వాడ్వానీ తహసీల్‌లోని ఆమె స్వస్థలంలో దహనం చేశారు. ఈ కేసులో నిందితులకు మరణశిక్ష విధించాలని ఆమె బంధువులు డిమాండ్ చేస్తున్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com